అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

గురువారం 2-2-2023 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 32 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 14 పేజీలు | వెల : 6.50

పెన్షన్ సంస్కరణలను నిరసిస్తూ ఫ్రాన్స్‌లో భారీ ప్రదర్శన



వివరాలు 5లో

అన్నీ కోతలే..

సామాన్యులపై భారాలు.. సంపన్నులకు రాయితీలు

2023-24 కేంద్ర బడ్జెట్ లో నిర్మల మాటలతో మాయ...

- అధిక ధరలు, నిరుద్యోగం, సబ్సిడీలు.. ఊసెత్తని కేంద్రం
- రైతులు, కార్మికులు, మహిళలు, వికలాంగులను పట్టించుకోని బడ్జెట్
- అమృత్ కాలంలో ఇది తొలి పద్దు : కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్
- ఏడు అంశాలకు ప్రాధాన్యత అంటూ తీయని మాటలు..
- 2022-23లో ఆదాయం రూ.24.3లక్షల కోట్లే... అయినా రూ.45లక్షల కోట్లతో బడ్జెట్

మరిన్ని వివరాలు లోపలి పేజీల్లో...



నేడు దేశం ఎదుర్కొంటున్న నిరుద్యోగం, అధిక ధరలు, వేతనాల కోత, ద్రవ్యోల్బణం.. ప్రధాన సమస్యలను పరిగణలోకి తీసుకోకుండా మోడీ సర్కార్ 2023-24 బడ్జెట్‌ను తీసుకొచ్చింది. బుధవారం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కొత్త బడ్జెట్..దేశ ప్రజల్ని తీవ్రంగా నిరాశపర్చింది. రైతులు, మహిళలు, కార్మికులు, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల ప్రయోజనాలు, మధ్య తరగతి ఇబ్బందులు ఇవేవీ ఈ బడ్జెట్ లెక్కలోకి తీసుకోలేదు. బడా కార్పొరేట్లు నడిపిస్తున్న రుణ సంస్థలకు మాత్రం నిబంధనల్ని సడలించారు. కొత్తగా రూ.15.43 లక్షల కోట్లు అప్పులు చేస్తున్నా, పన్ను ఆదాయం 11శాతం పెరుగుతున్నా...సామాన్యుడికి ఊరట సున్నా. ఎన్నికలున్నాయని కర్నాటకకు ప్రత్యేక కేటాయింపులు చేయటం మోడీ సర్కార్‌కే చెల్లింది. సంక్షేమం, అభివృద్ధి ఊసే లేదు. యువత, మహిళలు, వికలాంగులు, అణగారిన వర్గాలకు మేలు చేసే ముచ్చట ఈ బడ్జెట్‌లో లేదు. పేదలు, వలస కూలీలను ఆదుకుంటున్న ఉపాధి హామీ పథకానికి నిధుల్ని భారీగా తగ్గించారు.

- ఉపాధి హామీ చట్టానికి తూట్లు..రూ.29,400 కోట్లు తగ్గుదల..
- వ్యవసాయ, అనుబంధ రంగాలకు పదేండ్లలో భారీ కోత
- మొత్తం బడ్జెట్‌లో 3.20 శాతానికి పడిపోయిన కేటాయింపులు
- వంట గ్యాస్ సబ్సిడీ కేవలం రూ.180 కోట్లు
- పంటల బీమా పథకంలో 12శాతం తగ్గిన నిధుల కేటాయింపు
- గతేడాది రూ.15,500 కోట్లు..ఈ బడ్జెట్‌లో రూ.13,625 కోట్లు
- పీఎం కిసాన్ పథకానికి కోతలే..13శాతం తగ్గిన కేటాయింపులు
- 31శాతం తగ్గిన రాష్ట్రీయ కృషి వికాస్ యోజన నిధులు
- ఎరువుల సబ్సిడీ రూ.2.25 లక్షల కోట్ల నుంచి రూ.1.75లక్షల కోట్లకు తగ్గింపు
- ఎస్సీ, ఎస్టీ సంక్షేమంలో భారీగా తగ్గిన కేంద్రం వాటా
- గత బడ్జెట్‌లో రూ.1,819 కోట్లు.. ఈసారి రూ.976.86 కోట్లు మాత్రమే..
- మహిళా శిశుసంక్షేమం, పోషకాహారం, భద్రతలోనూ అదే తీరు..
- గతేడాది..రూ.3,512 కోట్లు..ఈ బడ్జెట్‌లో రూ.1,514 కోట్లు



న్యూఢిల్లీ : కేంద్ర బడ్జెట్ ప్రసంగం..ఆ తర్వాత వెలువడిన కీలక గణాంకాలను పరిశీలిస్తే..ఏ ఒక్కరికీ ఈ బడ్జెట్ ఊరట కలిగించలేదనే చెప్పాలి. దేశ ఆర్థిక వ్యవస్థ అత్యంత సంక్లిష్టంగా, ఆందోళనకరంగా ఉందని బడ్జెట్ గణాంకాలు చెబుతున్నాయి. 'అమృత్ కాల్' అనే పదాన్ని పదే పదే ఉచ్చరిస్తూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఈ బడ్జెట్ అందులో మొట్టమొదటిగా పేర్కొన్నారు. 'అమృత్ కాల్' అనేందుకు ఈ బడ్జెట్‌లో ఏముందో ఎవ్వరికీ అర్థం కాలేదు. సామాన్యులు, ప్రయివేటు ఉద్యోగులకు రుణాలు ఇచ్చే ఫైనాన్స్ కంపెనీలకు అనుకూలించే కేవైసీ, డిజీలాకర్ విధానాల్ని సులభతరం చేశారు.

సమ్మిళిత వృద్ధి, చిట్టచివరి వ్యక్తికి కూడా లబ్ది. మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు. హరిత వృద్ధి, యువ శక్తి, ఆర్థికరంగం బలోపేతం..ఈ ఏడు అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్న బడ్జెట్‌గా ...5లో

ధరలు పెరిగేవి..

- బంగారం, ప్లాటినంతో తయారైన ఆభరణాలు
- ఇమిటేషన్ జ్యూయలరీ (గిల్టు నగలు) - సిగరెట్లు
- వెండి ఉత్పత్తులు
- వంటగదిలో వినియోగించే ఎలక్ట్రిక్ చిమ్నీలు
- దిగుమతైన సైకిళ్లు, ఆటవస్తువులు
- విదేశాల నుండి దిగుమతయ్యే రబ్బరు

తగ్గేవి..

- హీట్ కాయిల్స్
- మొబైల్ భాగాలు, ల్యాప్‌టాప్
- డిఎస్‌ఎల్‌ఆర్‌ల కెమెరా లెన్సెలు
- టివి ప్యానెల్ భాగాలు
- లిథియం అయాన్ బ్యాటరీలు
- ఎలక్ట్రిక్ స్కూటర్లు

దేశ నిర్మాణానికి బలమైన పునాది

- బడ్జెట్‌పై ప్రధాని మోడీ



న్యూఢిల్లీ : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టి బడ్జెట్‌పై ప్రధాని మోడీ స్పందించారు. ఇది అమృత కాలంలో ప్రవేశపెట్టిన మొదటి బడ్జెట్ అనీ, దేశ నిర్మాణానికి బలమైన పునాది వేస్తుందని అన్నారు. బడ్జెట్ ప్రసంగం అనంతరం ప్రధాని మాట్లాడారు. ఈ చారిత్రక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ...5లో

సమస్యలను పరిష్కరించడంలో బడ్జెట్ విఫలం

- సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి



న్యూఢిల్లీ : సమస్యలను పరిష్కరించడంలో బడ్జెట్ విఫలం అయిందని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి విమర్శించారు. బుధవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ...5లో

భవిష్యత్తు నిర్మాణానికి రోడ్ మ్యాప్ లేదు

- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ : కేంద్ర బడ్జెట్‌పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విలక్షణ రీతిలో స్పందించారు. "ఉపాధి కల్పనలో విజన్ లేదు. అసమానతలను తగ్గించే ఉద్దేశం లేదు. ఒకశాతం మంది 40 శాతం సంపదను కలిగి ఉన్నారు. 50 శాతం మంది పేదలు 64శాతం జీఎస్టీని చెల్లిస్తున్నారు. ఇప్పటికీ 42 శాతం మంది ...5లో

రాష్ట్రాలను నిరుత్సాహపరిచింది..

- రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం ప్రతిపాదించిన బడ్జెట్.. రాష్ట్రాలను నిరుత్సాహ పరిచేదిగా ఉందని రాష్ట్ర ఆర్థిక మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. అది రైతులు, పేదలకు వ్యతిరేకంగా ఉందని పేర్కొన్నారు. బడ్జెట్‌లో అందమైన మాటలు తప్ప.. నిధుల కేటాయింపులో ...5లో

తెలంగాణకు అన్యాయం




న్యూఢిల్లీ : కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగింది. విభజన హామీలను పక్కన పెట్టింది. రాష్ట్రం కోరే విన్నపాలు విస్మరణకు గురయ్యాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ గిరిజన విశ్వవిద్యాలయాలు రెండింటికి కలిపి కేవలం రూ.37.67 కోట్లు కేటాయించారు. హైదరాబాద్‌లోని గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ జాతీయ సంస్థకు రూ.115 కోట్లు కేటాయించారు. హైదరాబాద్‌లోని ఐఐటీకి రూ.300 కోట్లును లోన్ కింద ఇవ్వనున్నారు. గత బడ్జెట్‌లో సింగరేణికి రూ.2 వేల కోట్లు కేటాయించారు. ఈ సారి బడ్జెట్‌లో కోత విధించారు. రూ.1650 కోట్లును కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. సాలార్జంగ్ సహా అన్ని మ్యూజియాలకు కలిసి కేవలం రూ. 357 కోట్లను కేటాయించారు.


కేంద్ర పన్నుల్లో తెలంగాణ వాటా రూ. 21 వేల కోట్లు

కేంద్ర పన్నుల్లో తెలంగాణకు రూ.21,470.84 (2.102 శాతం) కోట్ల వాటా రానుంది. అందులో కార్పొరేషన్ పన్ను రూ.6,872.08 కోట్లు, ఆదాయపు పన్ను రూ.6,685.61 కోట్లు, సంపద పన్ను రూ. -0.18 కోట్లు, సెంట్రల్ జీఎస్టీ రూ.6,942.66 కోట్లు, కస్టమ్స్ రూ.681.10 కోట్లు, ఎక్సైజ్ డ్యూటీ రూ.285.26 కోట్లు, సర్వీస్ టాక్స్ రూ.4.31 కోట్లు రాష్ట్రానికి రానున్నాయి.

రైల్వే బడ్జెట్ రూ.2.40 లక్షల కోట్లు



రైల్వే బడ్జెట్‌కు ఈసారి రూ.2.40లక్షల కోట్లు కేటాయించింది. కాగా, ఈసారి బడ్జెట్‌లో కొత్త రైళ్ల ప్రస్తావన లేదు. రాజధాని, శతాబ్ది, హంసఫర్, తేజస్ వంటి ప్రీమియం రైళ్లకు ప్రాధాన్యత ఇచ్చారు. రైళ్ల వేగానికి అనుగుణంగా ట్రాకుల సామర్థ్యాన్ని పెంచేందుకు బడ్జెట్‌లో రూ.17,296 కోట్లు కేటాయించినట్టు కేంద్రం తెలిపింది.



ప్రభుత్వ కేజీ టు పీజీ దేశంలో ఎక్కడా లేదు

రాష్ట్రంలో తొలి అడుగు గంభీరావుపేట విద్యాసంస్థలు

- మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, కె.తారకరామారావు
- రాష్ట్ర వ్యాప్తంగా 'మన ఊరు-మనబడి' ప్రారంభం



గంభీరావుపేటలో కేజీ టు పీజీ క్యాంపస్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు సబితాఇంద్రారెడ్డి, కేటీఆర్



హైదరాబాద్‌లో.. నిజాంపేటలో మంత్రి తలసాని శ్రీనివాస్

నవతెలంగాణ - విలేకరులు

దేశంలోనే ప్రభుత్వపరంగా ఏర్పాటు చేసిన కేజీ టూ పీజీలాంటి విద్యా సంస్థలు లేవని, గంభీరావుపేట కేజీ టూ పీజీ విద్యాసంస్థలు తెలంగాణకు తొలి అడుగుగా ఉంటాయని విద్యా శాఖ మంత్రి సబిత ఇంద్రారెడ్డి, ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం 'మన ఊరు- మన బడి' మొదటి దశ పాఠశాలలను మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో కేజీ టు పీజీ క్యాంపస్‌ను మంత్రులు సబిత, కేటీఆర్ ప్రారంభించారు. ఈ క్యాంపస్‌కు ఆచార్య జయశంకర్ పేరుగా నామకరణం చేయాలన్నారు. అనంతరం క్యాంపస్‌లోని కిండర్ గార్డెన్ నుంచి పీజీ కళాశాల బ్లాక్‌లు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, డిజిటల్ లైబ్రరీతోపాటు వివిధ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ మాట్లాడారు. తెలంగాణ సిద్ధించిన తర్వాత కేజీ టూ పీజీ విద్యా సంస్థలను ఏర్పాటు చేస్తామని సీఎం కేసీఆర్ చెప్పారన్నారు. ఆయన హామీ ప్రతి రూపమే కేజీ టూ పీజీ క్యాంపస్ అన్నారు. కేజీ టు పీజీ క్యాంపస్ నిర్మాణానికి తోడ్పాటు అందించిన రహెజా, దివిస్ ల్యాబరేటరీ, గివ్ తెలంగాణ, ఎంఆర్‌ఎఫ్ ప్రతినిధులను సన్మానించారు. క్యాంపస్‌లో విద్యార్థులతో కలిసి మంత్రులు భోజనం చేశారు.

చింతకుంట మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి చేసిన పాఠశాలలను బీసీ ...5లో

లోపాలు సరిదిద్దుకుంటేనే మనుగడ

ఇచ్చిన వాగ్దానాలను అమలు చేస్తే బీఆర్ఎస్‌కు ప్రజల్లో సానుకూలత

ములాఖాత్

- బీజేపీ బలపడకుండా చేయడమే వామపక్ష, లౌకికశక్తుల లక్ష్యం
- కేంద్రం సహాయ నిరాకరణ వల్లే ఉద్యోగులకు జీతాలు ఆలస్యం
- రాష్ట్రానికి జీఎస్టీ బకాయిలు, నిధులివ్వకుండా కక్షసాధింపు
- విద్యావైద్యం ప్రభుత్వరంగంలో ఉంటేనే ప్రజలకు మెరుగైన సేవలు
- ప్రతిపక్షం లేకుండా చేయాలనుకోవడం అప్రజాస్వామికం
- చట్టసభల్లో ప్రజాస్వామ్యస్ఫూర్తి కనిపించడం లేదు
- బడ్జెట్‌లో భారీ కేటాయింపులతో మోసం
- వామపక్షాల పోరాటం వల్లే పోడు సాగుదార్లకు త్వరలో పట్టాలు
- నవతెలంగాణతో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని



బీఆర్ఎస్ ప్రభుత్వం పట్ల ప్రజల్లో అసంతృప్తి ఉందనీ, ఆయా లోపాలను సరిదిద్దుకుని ముందుకుపోతేనే మనుగడ ఉంటుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చెప్పారు. ఇచ్చిన వాగ్దానాలను అమలు చేస్తేనే ప్రజల్లో సానుకూల దృక్పథం వస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. బీజేపీని రాష్ట్రంలో బలపడకుండా చేయడమే వామపక్షాలు, లౌకికశక్తుల లక్ష్యమని స్పష్టం చేశారు. దేశంలో, రాష్ట్రంలో ప్రతిపక్షం లేకుండా చేయాలనుకోవడం అప్రజాస్వామికమని విమర్శించారు. చట్టసభల పనిదినాలు, ప్రజాసమస్యలపై చర్చ వంటి అంశాల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తి కనిపించడం లేదని అన్నారు. శుక్రవారం నుంచి శాసనసభ, శాసనమండలి సమావేశాలు ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో నవతెలంగాణ ప్రతినిధి బొల్లె జగదీశ్వర్‌కు తమ్మినేని వీరభద్రం ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు...

వివరాలు 8లో..

సీఎం సాబ్... ఇచ్చిన హామీని

నిలబెట్టుకోండి...

లేకపోతే ఉద్యమం తీవ్రతరం

- వీఆర్ఏల మౌనదీక్షలో జేఏసీ నాయకులు
- సీఐటీయూ,కేవీపీఎస్, చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ మద్దతు

వివరాలు 5లో..



త్రిపురలో సీపీఐ(ఎం) భారీ ర్యాలీలు

కాషాయ పార్టీ నుంచి ప్రజాసంఘాల్లోకి వలసలు



అగర్తల : అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న త్రిపురలో ఎన్నికల ప్రచారం ఉధృతంగా సాగుతున్నది. సీపీఐ(ఎం) నిర్వహిస్తున్న సభలకు, ర్యాలీలకు పెద్ద సంఖ్యలో ప్రజానీకం హాజరవుతున్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ నుంచి సీపీఐ(ఎం) ప్రజా సంఘాల్లోకి చేరికలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. యువరాజ్ నగర్ లబ్‌నందతల్‌లో బీజేపీ నాయకులు సీపీఐ(ఎం) ప్రజాసంఘాల్లో చేరారు. కళ్యాణ్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో సీపీఐ(ఎం) అభ్యర్థి మనింద్రా చంద్ర దాస్ విజయం కోరుతూ భారీ ర్యాలీ జరిగింది. ఎర్ర జెండాలతో సీపీఐ(ఎం) నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. యువరాజ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం లెఫ్ట్‌ఫ్రంట్ అభ్యర్థి షైలేంద్ర చంద్ర దేవ్‌నాథ్ విజయాన్ని కోరుతూ రామ్‌నగర్‌లో నిర్వహించిన సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సమావేశంలో పాణిసాగర్‌కు చెందిన బీజేపీ నాయకులు సీపీఐ(ఎం)లో చేరారు. బగ్మా నియోజవర్గం లెఫ్ట్‌ఫ్రంట్ అభ్యర్థి నరేష్ జమాతియా విజయాన్ని కోరుతూ ఫిత్రాని ఫోటమతి ప్రాంతంలో భారీ ప్రదర్శన జరిగింది. త్రిపురలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి ఐక్యంగా ప్రజానీకం కదలిరావాలని నాయకులు పిలుపునిచ్చారు. మాను నియోజవర్గంలో లెఫ్ట్‌ఫ్రంట్ అభ్యర్థి ప్రభాత్ చౌదరి విజయాన్ని కోరుతూ జరిగిన బంకుల్ మార్చ్‌లో వేలాది మంది ప్రజలు భాగస్వామ్యమయ్యారు. రెడ్‌ఝుందతల్‌లోని రైసబరియాలో బీజేపీకి చెందిన కార్యకర్తలు సీపీఐ(ఎం) ప్రజాసంఘాల్లో చేరారు.

ఎడా పెడా కోతలు

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన 2023-24 ఆర్థికసంవత్సరపు బడ్జెట్‌లో వివిధ కీలక రంగాలకు కోతలు పెట్టారు. కరోనా సృష్టించిన సంక్షోభం దేశ ప్రజానీకాన్ని ఇంకా వెంటాడుతూనే ఉందన్న విషయాన్ని కేంద్రం విస్మరించింది. గ్రామీణ భారతానికి ఎంతో కొంత అలంబనగా ఉన్న ఉపాధి హామీ పథకంలో కోత పెట్టింది. అర్థాకలితో విలవిలలాడుతున్న కోట్లాది కుటుంబాల కడుపు నింపడానికి చర్యలు చేపట్టడానికి బదులు ఆహార సబ్సిడీని భారీగా కుదించింది. వ్యవసాయం నుండి విద్య, వైద్యం అనేక రంగాలకు పెరుగుతున్న ద్రవ్యోల్బణంతో పోల్చుకున్నప్పుడు అరకొర కేటాయింపులే దక్కాయి.

ఉపాధి హామీ



గ్రామీణ పేద ప్రజలను కష్టకాలంలో ఆదుకునే మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంపై బిజెపి ప్రభుత్వం ఒక పథకం ప్రకారం దాడి కొనసాగిస్తోంది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకం కింద 98,468 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 89,400 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు సవరించిన అంచనాల్లో చూపించారు. పూర్తి స్థాయి లెక్కలు వచ్చే సమయానికి ఇది మరింత పెరిగే అవకాశం ఉంది. అయినా, 2023-24 ఆర్థిక సంవత్సరానికి కేవలం 60,000 కోట్ల రూపాయలనే కేంద్రం కేటాయించింది. అంటే, దాదాపుగా 30 వేల కోట్ల రూపాయల కోత!

ఆహార సబ్సిడీ



ఆహార సబ్సిడీలోనూ భారీ కోత పెట్టడం ద్వారా పేదప్రజానీకంపై మరో దాడిని కేంద్ర ప్రభుత్వం చేసింది. వివిధ పథకాల ద్వారా పేదలకు తక్కువ ధరకు సరఫరా చేసే ఆహారం కోసం ఇచ్చే సబ్సిడీలో ఏకంగా 90 వేల కోట్ల రూపాయలను మోడీ ప్రభుత్వం తగ్గించింది. 2021-22లో ఆహార సబ్సిడీ కోసం 2,88,969 కోట్ల రూపాయలను ఖర్చు చేయగా, 2022-23లో 2,87చ194 కోట్ల రూపాయలను ఖర్చు చేసినట్లు అంచనా! మాంధ్యం ముంచుకొస్తున్న వేళ ఈ మొత్తాన్ని ఇంకా

ధాన్యం సేకరణ



ధాన్యం సేకరణ కోసం ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు 2022-23లో 2,14,696 కోట్ల రూపాయల సబ్సిడీ ఇవ్వగా తాజా బడ్జెట్‌లో 1,37,207 కోట్లకు తగ్గించారు. ఎన్ఎఫ్ఎస్ఎ పథకం కింద చేసే సేకరణకూ 72,283 కోట్లు గత బడ్జెట్‌లో కేటాయించగా, తాజా బడ్జెట్‌లో 59,793 కోట్లకు పరిపెట్టారు.

వ్యవసాయం



వ్యవసాయ రంగ కేటాయింపులను కూడా కేంద్రం తగ్గించింది. 2022-23 బడ్జెట్‌లో 1,51,521 కోట్ల రూపాయలను కేటాయించగా, 2023-24 ఆర్థిక సంవత్సరానికి 1,44,224 కోట్ల రూపాయలనే కేటాయించింది. అంటే 5శాతం కోత పెట్టింది. మొత్తం బడ్జెట్‌లో చూస్తే గత బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి 3.84 శాతం కేటాయింపులు దక్కగా, తాజా బడ్జెట్‌లో 3.20 శాతం నిధులు మాత్రమే దక్కాయి.

ఎరువులు



ఎరువులపై సబ్సిడీని గత బడ్జెట్‌తో పోలిస్తే 50 వేల కోట్ల రూపాయల మేర తాజాబడ్జెట్‌లో కేంద్రం తగ్గించింది. అంటే 22శాతం. 2022-23లో 2,25,520 కోట్ల రూపాయలను ఎరువుల సబ్సిడీ కోసం ఖర్చు చేయగా, తాజా బడ్జెట్‌లో 1,75,100 కోట్ల రూపాయలతో సరిపెట్టారు. ఫలితంగా వ్యవసాయం మరింత భారంగా మారనుంది.

గృహనిర్మాణం




పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం 2021-20లో 90,020కోట్ల రూ పాయలు ఖర్చు చేయగా, తాజా బడ్జెట్‌లో 79,590 కోట్ల రూపాయలతో సరిపెట్టారు. 2022-23లో 77,130 కోట్ల రూపాయలు ఇళ్ల నిర్మాణం కోసం వ్యయమైనట్లు అంచనా వేశారు. దానితో పోలిస్తే నామమాత్రంగా కేటాయింపులు పెంచినప్పటికీ, ద్రవ్యోల్బణాన్ని పరిగణలోకి తీసుకుంటే ఆ మొత్తం తగ్గుతుంది.

బడ్జెట్ సైజు

మాంద్యం ముంచుకొస్తున్న వేళ ప్రభుత్వ ఖర్చును గణనీయంగా పెంచాల్సిఉండగా, కార్పొరేట్ రంగ ఒత్తిళ్లకు లొంగి బడ్జెట్ సైజును గణనీయంగా తగ్గించారు. జిడిపిలో 15.33 శాతంగా గత బడ్జెట్ సైజు ఉండగా, తాజా బడ్జెట్ 14.92 శాతానికి పరిమితమైంది.

ఇది దుకాణదారుడి బిల్లు : సుబ్రమణ్యస్వామి



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ కిరాణా దుకాణం దుకాణదారుడి బిల్లు అని బీజేపీ నేత సుబ్రమణ్యస్వామి అన్నారు. నిర్మల పద్దుపై ఆయన అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇది ఈ రోజు సమర్పించిన బడ్జెటేనా? అని అన్నారు. మంచి బడ్జెట్‌లో లక్ష్యాలు ఏమిటో వెల్లడించాలన్నారు.

బడ్జెట్ నుంచి పంజాబ్ గాయబ్ : పంజాబ్ సీఎం

ఇంతకుముందు వరకు రిపబ్లిక్‌డే నుంచి పంజాబ్ మిస్ అయింది. ఇప్పుడు బడ్జెట్‌లో కనబడటం లేదు. సరిహద్దు రాష్ట్రంలో బీఎస్ఎఫ్ ఆధునీకరణ, యాంటీ డ్రోన్ సిస్టమ్ కోసం రూ. 1000 కోట్లను అభ్యర్థించాం. అయితే, బడ్జెట్‌లో దీని గురించి ఏమీ మాట్లాడలేదు.

నిరాశ బడ్జెట్ : డీఎంకే ఎంపీ దయానిధి మారన్

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరాశపర్చిందని డీఎంకే ఎంపీ దయానిధి మారన్ అన్నారు. రాష్ట్రాలకు పథకాలు ప్రకటించినా.. వాటి బాధ్యత రాష్ట్రాలకే వదిలేశారు.

ఇది మోడీకి 'అమృత్‌కాల్' : ఆప్ ఎంపీ సంజయ్ సింగ్

ఈ బడ్జెట్ ప్రధాని మోడీకి అమృత్‌కాల్ వంటిదనీ, దేశంలోని సామాన్య ప్రజలకు కాదు. పంటల కనీస మద్దతునూ పెంచలేదు, యువత ఉద్యోగాలు పొందేలా చర్యలూ లేవు

మళ్లీ దారిద్ర్యంలోకి ప్రజలు : పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ

గత 8-9 ఏండ్లుగా ప్రవేశపెడుతున్న బడ్జెట్‌లాగానే ప్రస్తుత బడ్జెట్ ఉన్నది. పన్నులను పెంచారు. సంక్షేమ పథకాలు, సబ్సిడీలపై ఖర్చు చేయలేదు. పేదరికం నుంచి బయటకు వచ్చిన ప్రజలు మళ్లీ దారిద్ర్యంలోకి పడిపోయారు.

అదానీ గ్రూపునకు రుణాలు రద్దు

- క్రెడిట్ సూస్సె షాకింగ్ నిర్ణయం
- కొనసాగిన షేర్ల పతనం
- కుబేరుల అగ్ర స్థానంలోకి మళ్లీ ముకేశ్

న్యూఢిల్లీ : అదానీ గ్రూపునకు మరో తీవ్ర ఎదురుదెబ్బ తగిలింది. గౌతం అదానీ కంపెనీల బాండ్లపై మార్జిన్ రుణాల జారీని నిలిపివేస్తున్నట్లు స్విస్‌కు చెందిన ప్రయివేటు రంగ రుణదాత క్రెడిట్ సూస్సె తాజాగా ప్రకటించింది. హిండెన్‌బర్గ్ రీసెర్చ్ నుంచి తీవ్ర మోసాల ఆరోపణలు ఎదుర్కొంటున్న అదానీ కంపెనీలకు ఇది మరింత శరఘాతంగా మారింది. ఈ రెండు సంస్థల దెబ్బకు బుధవారం స్టాక్ మార్కెట్‌లో అదానీ కంపెనీల షేర్లు పేక ముక్కల్లా కూలాయి. అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్, అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ ఎలక్ట్రిసిటీ ముంబయి లిమిటెడ్ కంపెనీల బాండ్లకు సున్నా విలువను ఇస్తూ క్రెడిట్ సూస్సె నిర్ణయం తీసుకుందని.. ఈ వ్యవహారంతో సంబంధం కలిగిన వ్యక్తులు వెల్లడించినట్లు రిపోర్టులు వచ్చాయి. ఇంతక్రితం అదానీ పోర్ట్స్ బాండ్లపై 75 శాతం రుణాలు ఇచ్చేవి. ఇతర బ్యాంక్‌లు కూడా అదానీకి రుణాలు ఇవ్వడానికి నిరాకరిస్తున్నాయని సమాచారం. అదానీ కంపెనీలకు డౌన్‌గ్రేడ్ రేటింగ్‌లు రావొచ్చని బ్యాంక్‌లు ఆందోళన చెందుతున్నాయని పేరు చెప్పుకోవడానికి ఆసక్తి చూపని ఒక్కరు తెలిపారు. ఆసియాలోని సంపన్న క్లయింట్లు పెట్టుబడులు పెట్టడానికి సెక్యూరిటీలపై తరచుగా రుణాలు తీసుకుంటారు. బ్యాంకులు సాధారణంగా సెక్యూరిటీ ధర యొక్క అస్థిరతను, రుణ విలువలను నిర్ణయించేటప్పుడు దాని క్రెడిట్ రేటింగ్‌ను పరిగణనలోకి తీసుకుంటాయి. అదానీ పరపతికి ఒక వేళ రేటింగ్ ఏజెన్సీలు కోత పెడితే ఆ కంపెనీలు మరింత ఒత్తిడిని ఎదుర్కోనున్నాయి. హిండెన్‌బర్గ్ రిపోర్ట్‌తో అదానీ సంపద, ఆయన కంపెనీల విలువ అమాంతం పడిపోతున్న నేపథ్యంలో రేటింగ్ ఏజెన్సీలు ఎలాంటి ప్రకటన చేయనున్నాయే వేచి చూడాలి. పలు కంపెనీల కుంభకోణాలు, మోసాల దెబ్బతో 2022 డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో క్రెడిట్ సూస్సె 1.6 బిలియన్ డాలర్ల నష్టాలు చవి చూసింది.

వెస్ట్‌లైఫ్ ఫుడ్ అమ్మకాల్లో 28% వృద్ధి

ముంబయి : దేశంలో మెక్‌డొనాల్డ్స్‌ను నిర్వహించే వెస్ట్‌లైఫ్ ఫుడ్‌వర్ల్డ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 28.23 శాతం వృద్ధితో రూ.611.46 కోట్ల నికర అమ్మకాలు నమోదు చేసింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.476.83 కోట్ల అమ్మకాలు చేసింది. ఇదే సమయంలో రూ.20.82 కోట్ల లాభాలు నమోదు చేయగా.. గడిచిన క్యూ3లో 74.69 శాతం వృద్ధితో రూ.36.37 కోట్ల నికర లాభాలు సాధించింది. గడిచిన అక్టోబర్-డిసెంబర్ కాలంలో ఎప్పుడూ లేని విధంగా నెల వారి సగటు అమ్మకాలు రూ.200 కోట్లు దాటిందని తెలిపింది.

ఇంగ్లండ్‌ను కుదిపేసిన అతి పెద్ద సమ్మె

వేతనాలు పెంచాలని కోరుతూ ఉపాధ్యాయులు, ట్రైన్ డ్రైవర్ల ఆందోళనలు



లండన్ : ఈ దశాబ్దంలోనే అతిపెద్ద వాకౌట్, సమ్మెలతో బ్రిటన్ అట్టుడుకుతోంది. విద్య, రవాణా, పౌర సేవలకు చెందిన 5 లక్షల మంది వర్కర్లు బుధవారం తమ పని ప్రదేశాల్లో వాకౌట్ చేశారు. 2011 నవంబరు30న జరిగిన పెన్షనర్ల సమ్మె తరువాత తిరిగి అంత పెద్దయెత్తున సమ్మె జరగడం ఇదే మొదటిసారి. అధిక ధరలకు వ్యతిరేకంగా రైలు డ్రైవర్లు, ఉపాధ్యాయులు, విశ్వవిద్యాలయ సిబ్బంది, సివిల్ సర్వెంట్ల సంయుక్తంగా సమ్మె చేస్తున్నారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణానికి అనుగుణంగా వేతనాలు పెంచాలని వీరంతా నిరసనలకు దిగడంతో పాఠశాలలు మూతపడటంత పాటు, బ్రిటన్ రైల్ నెట్‌వర్క్ నిర్వీర్య మయింది. బుధవారం లండన్‌లో ఉపాధ్యాయులు మార్చ్ నిర్వహించారు. సుమారు 4,75,000 మంది యూనియన్ సభ్యులు సమ్మెలో పాల్గొన్నారు. విక్టోరియా, కానన్ స్ట్రీట్, మెరిలేబోన్, లండన్ బ్రిడ్జ్ స్టేషన్లతో సహా లండన్‌లో ప్రధాన రైలు స్టేషన్లనీ పూర్తిగా మూసివేయబడ్డాయి. ఇంగ్లండ్, వేల్స్‌ల్లో 85 శాతం పాఠశాలలు మూసివేయబడినట్లు నేషనల్ ఎడ్యుకేషన్ యూనియన్ వెల్లడించింది. కాగా, ఈ సిబ్బందికి తోడుగా ఈ నెల 17 నుంచి నాలుగు రోజుల పాటు సమ్మె చేస్తామని సరిహద్దు దళ అధికారులు తెలిపారు.

'కాసాని' తల్లి అంత్యక్రియలు పూర్తి



నవతెలంగాణ - హైదరాబాద్

తెలుగుదేశం తెలంగాణ శాఖ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ తల్లీ కౌసల్య అంత్యక్రియలు పూర్తయ్యాయి. బుధవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లిలో టీడీపీ శ్రేణులు, ముదిరాజ్ మహాసభ కార్యకర్తలు, కాసాని అభిమానులు భారీసంఖ్యలో తరలిరాగా మధ్యాహ్నం ఒంటిగంటకు అంత్యక్రియలు జరిగాయి. కాసానితోపాటు టీడీపీ పొలిట్‌బ్యూరోసభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, బక్కిన నర్సింహులు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఈటల రాజేందర్, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కె.ఎం ప్రతాప్, మాజీ ఎంపీలు మల్లు రవి, అంజన్‌కుమార్ యాదవ్, టీడీపీ సీనియర్ నేతలు నన్నూరి నర్సిరెడ్డి, జ్యోత్స్న తదితరులు భౌతికకాయానికి నివాళులు అర్పించారు.

ఎన్నికల వేళ కర్నాటకకు ప్రాధాన్యం

న్యూఢిల్లీ : త్వరలో ఎన్నికలు జరగనున్న దక్షిణాది రాష్ట్రమైన కర్నాటకకు బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించారు. కర్నాటకలో కరువు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం ఆర్థిక సహకారం అందించనున్నట్లు నిర్మలా సీతారామన్ వెల్లడించారు. అప్పర్ భద్ర ప్రాజెక్టుకు రూ.5,300 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. 29.4 టీఎంసీల సామర్థ్యంతో 2.25 లక్షల హెక్టార్ల ఆయకట్టుకు నీటిని సరఫరా చేసేందుకు అప్పర్‌భద్ర ప్రాజెక్టును కర్ణాటక చేపట్టింది. ఈ ఏడాది మే 24తో కర్ణాటక అసెంబ్లీ గడువు ముగియనుంది. ఆలోపే అంటే మార్చి-ఏప్రిల్‌లో అక్కడ శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి.

ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ పథకాల కేటాయింపుల్లోనూ తగ్గింపు

న్యూఢిల్లీ :ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ కోసం కేంద్రం ప్రాయోజిత పథకాల కేటాయింపులు తగ్గాయి. గత బడ్జెట్‌లో రూ.1,819.52 కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.976.86 కోట్లకు తగ్గించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి కార్యక్రమాలకు ఈసారి నిధులు కేటాయించలేదు. మహిళా, శిశు సంక్షేమానికి సంబంధించిన పోషకాహారం, భద్రత, సంక్షేమానికి కేటాయింపులు భారీగా తగ్గించారు. 2022-23లో రూ.3,512.88 కోట్లు కేటాయించగా, ఈ బడ్జెట్‌లో రూ.1,514 .32 కోట్లకు తగ్గించారు. యువజన, క్రీడల రంగంలోనూ కేంద్ర ప్రాయోజిత పథకాలకు కేటాయింపులో కోత విధించారు. స్పేస్ రంగంలో న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్‌కు కేటాయింపులు భారీగా తగ్గించారు.

మహిళలు, వృద్ధుల కోసం...

మహిళల కోసం ప్రత్యేకంగా మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ అనే కొత్త పథకాన్ని బడ్జెట్‌లో కేంద్రం ప్రవేశపెట్టింది. రెండేళ్ల కాలానికి ఈ పథకం అందుబాటులో ఉంటుంది. ఈ ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకంలో డిపాజిట్‌పై 7.5 శాతం స్థిర వడ్డీ ఉంటుంది. గరిష్ఠంగా రూ.2 లక్షల వరకు ఈ పథకంలో డిపాజిట్ చేయొచ్చు. పాక్షిక మినహాయింపులకు అవకాశం ఉంటుంది.

సీనియర్ సిటిజన్లు డిపాజిట్ చేసే గరిష్ఠ పరిమితిని రూ.30 లక్షలకు పెంచింది. సీనియర్ సిటిజన్లకు సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీమ్ కింద ప్రస్తుతం గరిష్ఠ పరిమితి రూ.15 లక్షల వరకు మాత్రమే ఉంది.

వర్ధమాన్ బ్యాంక్

వర్ధమాన్ (మహిళ) కొ-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్
(రిజిస్టర్డు నెం.టి.పి.1341)
హెడ్ ఆఫీసు: 3వ అంతస్తు, నిషాంత్ హౌస్, 8-2-351/ఎన్/1, బంజారాహిల్స్, రోడ్ నెం.2, హైదరాబాద్-500034 (టి.ఎస్) ఫోన్: 040-46664777
Email : ho@vardhamanbank.com

2022-23 కొరకు 2వ జనరల్ బాడీ సమావేశపు ప్రకటన

ఇందుమూలంగా సభ్యులకు ప్రకటన ఇవ్వడమేమనగా దిగువ వ్యాపారాల నిర్వహణకు బుద్విభవన్, 3-5-141/2/ఏ/1, రాంకోట్, హైదరాబాద్-500001 వద్ద శుక్రవారం, 17 ఫిబ్రవరి, 2023న సా.4.00గం.లకు బ్యాంకు యొక్క 54వ జనరల్ బాడీ సమావేశం వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించబడును.

1. సంవత్సరం 2023-24 కొరకు ఆదాయ & వ్యయాల యొక్క వార్షిక బడ్జెట్ ఆమోదించుటకు
2. సంవత్సరం 2023-24 కొరకు వార్షిక బిజినెస్ ప్లాన్ ఆమోదించుటకు
3. తేది.01.06.2022 నుండి 31.12.2022 వరకు కాలవ్యవధిలో షేర్ క్యాపిటల్ యొక్క రీఫండ్ మరియు అదనపు వాటాలు/ విత్‌డ్రా కేటాయింపు/ సభ్యుల ప్రవేశం ఆమోదం/రటిపై
4. తేది.01.06.2022 నుండి 31.12.2022 వరకు కాలవ్యవధిలో బ్యాంకుచే నిర్వహించిన ఇన్వెస్ట్‌మెంట్ల అమ్మకం/ కొనుగోలు ఆమోదించుటకు
5. అన్ని ఓవర్‌డ్యూ/ఎన్‌పిఏ మరియు సూట్ ఫైల్డ్ రుణ ఖాతాలను సమీక్షించుటకు
6. బైలాస్ ఆఫ్ ది బ్యాంక్‌లోని క్లాజు 4 (1) & (2) మరియు 31 (3)కు సవరణలు పరిగణించుటకు & ఆమోదించుటకు
7. బ్యాంకు యొక్క వర్క్‌మెన్ స్టాఫ్ రివిజన్ ఆఫ్ పేస్కేల్స్ మరియు సర్వీస్ రూల్స్ పరిగణించుటకు& ఆమోదించుటకు
8. చట్టం లేదా రూల్స్ క్రింద అవసరమైనట్లుగా సదరు విషయాలతోసహా చైర్మన్ అనుమతితో ఏదేని ఇతర విషయానికి సంబంధించి పరిగణించుటకు జనరల్ బాడీ సమావేశానికి హాజరు కావాల్సిందిగా సభ్యులందరినీ కోరుతున్నారు.

తేది: 25 01 2023
ప్రదేశం: హైదరాబాద్

బోర్డు ఆఫ్ డైరెక్టర్ల ఉత్తర్వుల మేరకు
సం/-
చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

గమనిక:
1. కోరం హాజరులేని విషయంలో, వాయిదావేయబడిన జనరల్ బాడీ సమావేశం అదే వేదిక, వాయిదావేయబడిన 30 నిమిషాల తరువాత అదే రోజున వద్ద నిర్వహించబడును.
2. గుర్తింపు కొరకు వారి షేర్ సర్టిఫికేట్స్/ గుర్తింపు కార్డులతోసహా రావాల్సిందిగా సభ్యులను కోరుతున్నారు.
3. బ్యాంకు రికార్డులో వారి ఖాతా నెం, చిరునామా, మోబైల్ నెంబరు మరియు ఇమెయిల్ ఐడిని అప్‌డేట్ చేయాల్సిందిగా సభ్యులను కోరుతున్నారు.

ఫారం నెం.ఐఎన్‌సి-26

కేంద్ర ప్రభుత్వం, రీజినల్ డైరెక్టర్, సౌత్ ఈస్ట్ రీజియన్, హైదరాబాద్ వారి సమక్షంలో
కంపెనీల చట్టం. 2013లోని సెక్షన్ 13 (4) మరియు కంపెనీస్ (ఇన్‌కార్పొరేషన్) రూల్స్, 2014లోని రూల్ 30 (5) (ఎ) విషయంలో
మరియు
మెట్రో డిజిటల్ నెట్‌వర్క్స్ (హెచ్‌వైడి) ప్రైవేట్ లిమిటెడ్,
దీని రిజిస్టర్డు ఆఫీస్: ఫ్లాట్ నెం.బి-206, మౌంట్ మేరు అపార్ట్‌మెంట్, రోడ్ నెం.7, బంజారాహిల్స్, హైదరాబాద్-500034 వద్ద కలిగియున్న విషయంలో
...... పిటిషనర్

పిటిషన్ కొరకు ప్రకటన

ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి ప్రకటన ఇవ్వడమేమనగా "తెలంగాణ రాష్ట్రం"నుండి "తమిళనాడు రాష్ట్రానికి" కంపెనీ దీని రిజిస్టర్డు ఆఫీసును మార్పుచేయు ఉద్దేశ్యంతో **గురువారం, 29-12-2022** (ఇరవై తొమ్మిది డిసెంబర్ రెండువేల ఇరవై రెండు)న నిర్వహించబడిన అసాధారణ సర్వసభ్య సమావేశంలో ఆమోదించిన ప్రత్యేక తీర్మానం నియమాలను అనుసరించి కంపెనీ యొక్క మెమోరండం ఆఫ్ అసోసియేషన్‌లో మార్పు నిర్ధారణ కోరుతూ కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 13 క్రింద కేంద్ర ప్రభుత్వం వారికి కంపెనీ దరఖాస్తు చేయుటకు ప్రతిపాదిస్తున్నది.

కంపెనీ యొక్క రిజిస్టర్డు ఆఫీసు ప్రతిపాదిత మార్పుకు సంబంధించి ప్రభావితం అయ్యే అవకాశం ఉన్న ఎవరైనా వ్యక్తి, అతని/ఆమె ఆసక్తి స్వభావం మరియు అభ్యంతరాలకుగల కారణాలు చూపుతూ అఫిడవిట్ మద్దతు ద్వారా అతని/ఆమె అభ్యంతరాలను రిజిస్టర్డు పోస్టు ద్వారా దరఖాస్తుదారైన కంపెనీకి రిజిస్టర్డు ఆఫీసు పై పేర్కొన్న చిరునామా వద్ద ఒక కాపీతో ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి **పద్నాలుగు రోజుల్లోగా** రీజినల్ డైరెక్టర్, సౌత్ ఈస్ట్ రీజియన్, 3వ అంతస్తు, కార్పొరేట్ భవన్, బండ్లగూడ, నాగోల్, తట్టిఅన్నారం గ్రామం, హయాత్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్-500068, తెలంగాణ వారికి పంపవచ్చును లేదా ఇన్వెస్టర్స్ ఫిర్యాదు ఫారం దాఖలు చేయుట ద్వారా ఎంసిఏ-21 పోర్టల్ (www.mca.gov.in) పై బట్వాడా చేయవచ్చును.

వీరి తరపున
మెట్రో డిజిటల్ నెట్‌వర్క్స్ (హెచ్‌వైడి) ప్రైవేట్ లిమిటెడ్
సం/- కామేశ్వర రావు వేమూరి
(డైరెక్టర్)
డిఐఎన్-01831177

ప్రదేశం: హైదరాబాద్
తేది: 01-02-2023

Indian Bank

इंडियन बैंक Indian Bank
इलाहाबाद ALLAHABAD

స్ట్రెస్డ్ అసెట్స్ మేనేజ్‌మెంట్ బ్రాంచ్, 5-1-679, సురభి ఆర్కేడ్, బ్యాంక్ స్ట్రీట్, కోఠి, హైదరాబాద్-500 001, ఫోన్: 040-24651169.

అనుబంధం-4-ఎ (రూల్ 8(6)లోని ప్రొవిజో చూడండి)
స్థిరాస్తుల అమ్మకం యొక్క విక్రయ ప్రకటన

[illegible]

రుణఖాతాలు	[illegible]
రిజర్వు ధర	Rs.50,59,000/-
ఇఎండి మొత్తం	Rs.5,05,900/-
వేలం పెంపు మొత్తం	Rs.10,000/-
ఇ-వేలం తేదీ మరియు సమయం	09-03-2023 మ.గం.12-00 నుండి సా.3-00 వరకు
ఆస్తి ఐడి నెంబర్	IDIBSAMLH_39

[illegible]
తెలుసుకునేందుకు దయచేసి ibapiop@mstcecommerce.com వెబ్‌సైట్ మరియు ఇఎండి స్టేటస్ తెలుసుకునేందుకు దయచేసి ibapifin@mstcecommerce.com వెబ్‌సైట్‌ను సందర్శించాలి.
ఆస్తి యొక్క వివరాలు, ఫోటోగ్రాఫ్‌లు మరియు వేలానికి సంబంధించి ఇతర షరతులు మరియు నిబంధల కోసం దయచేసి https://ibapi.in వెబ్‌సైట్‌ను సందర్శించాలి మరియు పోర్టల్‌కు సంబంధించి సందేహాల నివృత్తి కోసం దయచేసి హెల్ప్‌లైన్ నెంబర్ 18001025026 మరియు 011-41106131లో సంప్రదించాలి.
వేలందారులు దయచేసి పైన పేర్కొన్న ఆస్తి యొక్క ఐడి నంబర్‌ ఉపయోగించి ఆస్తి సంబంధించిన వివరాలను తెలుసుకునేందుకు https://ibapi.in వెబ్‌సైట్ మరియు www.mstcecommerce.com వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరడమైనది.

తేది:31-01-2023, ప్రదేశం: హైదరాబాద్ — సం/- అధీకృత అధికారి, ఇండియన్ బ్యాంక్

R V CONSULTING SERVICES PRIVATE LIMITED

CIN: U74999TG2010PTC069857
Registered Office: Plot No. 111, Road No. 10, Jubilee Hills, Hyderabad – 500033, Telangana, India.
Phone: 040 23351571/6572; email: info@rvconsulting.in

గౌరవ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ వారి సమక్షంలో
హైదరాబాద్ బెంచ్, హైదరాబాద్
సి.ఎ.(సిఎఎ) నెం.22/హెచ్‌డి/2022
కంపెనీల చట్టం,2013లోని సెక్షన్ 230 నుండి 232 వరకు మరియు వర్తింపదగిన నిబంధనలకు అనుగుణంగా
మరియు
మెసర్స్ ట్విన్‌వెస్ట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ ('ట్రాన్స్‌ఫరర్ కంపెనీ') దీనితో పాటుగా మెసర్స్ ఆర్‌వి కన్సల్టింగ్ సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్ ('ట్రాన్స్‌ఫరీ కంపెనీ') మరియు దీని యొక్క సంబంధిత వాటాదారుల యొక్క స్కీమ్ ఆఫ్ అమాల్గమేషన్ విషయంలో

మెసర్స్ ఆర్‌వి కన్సల్టింగ్ సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్
[CIN: U74999TG2010PTC069857],
కంపెనీ చట్టం,1956లోని నిబంధనలకు అనుగుణంగా దీని యొక్క వ్యవస్థాపన జరిగింది.
రిజిస్టర్డ్ కార్యాలయం చిరునామా: ప్లాట్ నం.111,
రోడ్ నెం.10, జూబ్లీహిల్స్, హైదరాబాద్, తెలంగాణ-500 033,
దీన్ని రిప్రెజెంట్ చేస్తున్న డైరెక్టర్: శ్రీమతి రచనా సమ్మిడి
........అప్లికంట్ కంపెనీ / ట్రాన్స్‌ఫరీ కంపెనీ

ఆర్‌వి కన్సల్టింగ్ సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్ యొక్క అన్‌సెక్యూర్డ్ క్రెడిటార్ల యొక్క సమావేశానికి సంబంధించిన ప్రకటన

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా గౌరవ నేషనల్ లా ట్రిబ్యునల్, హైదరాబాద్ బెంచ్, హైదరాబాద్ వారు 12, డిసెంబర్, 2022 తేదీన జారీ చేసిన ఉత్తర్వులతో పాటుగా చదవదగిన ఆర్డర్ తేది:23,జనవరి,2023 ప్రకారం మెసర్స్ ఆర్‌వి కన్సల్టింగ్ సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్ యొక్క అన్‌సెక్యూర్డ్ క్రెడిటార్ల యొక్క సమావేశం మెసర్స్ ట్విన్‌వెస్ట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ ('ట్రాన్స్‌ఫరర్ కంపెనీ') స్కీమ్ ఆఫ్ మెర్జర్‌తో పాటుగా మెసర్స్ ఆర్‌వి కన్సల్టింగ్ సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్ ('ట్రాన్స్‌ఫరీ కంపెనీ') మరియు వారి యొక్క సంబంధిత వాటాదారుల యొక్క స్కీమ్ ఆఫ్ మెర్జర్ ఆమోదించడం లేదా ఎలాంటి సవరణలు లేకుండా ప్రతిపాదనలను ఆమోదించడం తదితరమైనవి చేపట్టబడును. పైన పేర్కొన్న ఉత్తర్వులోని నిర్దేశాలకు అనుగుణంగా, ఇందుమూలంగా తదుపరి నోటీసు ఇవ్వడమేమనగా మెసర్స్ ఆర్‌వి కన్సల్టింగ్ సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్ యొక్క అన్‌సెక్యూర్డ్ క్రెడిటార్ల యొక్క సమావేశం [illegible]

తేది: 01 ఫిబ్రవరి, 2023
ప్రదేశం: హైదరాబాద్

[illegible]
గౌరవ ట్రిబ్యునల్ ఆదేశానుసారం చైర్మన్‌గా నియమించబడ్డారు:
చిరునామా: 201, సిర్కిటీస్ ల్యాండ్‌మార్క్,
ఎంఎల్‌ఏ కాలనీ, రోడ్ నెం.12,
బంజారాహిల్స్, హైదరాబాద్-500 034.

HDFC

WITH YOU, RIGHT THROUGH

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకపు ప్రకటన (ఇ-బిడ్డింగ్ ద్వారా మాత్రమే అమ్మకం)
హౌసింగ్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్
బ్రాంచి: హెచ్‌డిఎఫ్‌సి హౌస్, 3-6-310, హైదరాబాద్ రోడ్, బషీర్‌బాగ్, హైదరాబాద్-500029.
Tel : 040-64807999/9065/9094 CIN L70100MH1977PLC019916 Website: www.hdfc.com

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) తో చదువబడే ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకపు ప్రకటన.

ఇందుమూలంగా సర్వజనులకు మరియు ప్రత్యేకించి కాలం (ఎ)లో పేర్కొన్న రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు ప్రకటన ఇవ్వడమేమనగా, కాలం (సి)లో వివరించిన దిగువ వివరించిన స్థిరాస్తులు సెక్యూర్డ్ క్రెడిటర్‌కు తాకట్టుపెట్టబడినవి/ చార్జ్‌చేయబడినవి, వాటిని హౌసింగ్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌డిఎఫ్‌సి లిమిటెడ్) సెక్యూర్డ్ క్రెడిటర్ యొక్క అధీకృత అధికారిచే కాలం (డి)లో వివరించినట్లు నిర్మాణాత్మకంగా/భౌతికంగా స్వాధీనం చేసుకోబడినవి, వాటిని దిగువ పేర్కొన్న వివరాల ప్రకారం "ఎక్కడ ఎలా ఉన్నది" మరియు "అది అక్కడ అలాగే ప్రాతిపదికన" విక్రయించబడుతుంది.

ఇందుమూలంగా రుణగ్రహీత/ తాకట్టుదారు(లు)/చట్టబద్ధ వారసులు. చట్టబద్ధ ప్రతినిధులు (తెలిసిన లేదా తెలియని), ఎగ్జిక్యూటర్(లు), అడ్మినిస్ట్రేటర్(లు), వారసు(లు) మరియు సదరు రుణగ్రహీతలు/తాకట్టుదారుల (మరణించిన) వారి అసైన్స్‌కు ప్రకటన ఇవ్వడమేమనగా, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6) క్రింద కాలం (ఎ)లో సూచించినట్లు, అమ్మకం యొక్క వివరణాత్మక నియమ నిబంధనల కొరకు దయచేసి, హౌసింగ్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌డిఎఫ్‌సి లిమిటెడ్) సెక్యూర్డ్ క్రెడిటర్ యొక్క వెబ్‌సైట్ అనగా www.hdfc.com లో ఇవ్వబడిన లింకును చూడగలరు.

క్ర.సం.	రుణగ్రహీతలు/ మరియు హామీదారు(ల) పేర్లు	రికవరీచేయాల్సిన బకాయి (సెక్యూర్డ్ డెటర్) మొత్తం(రూ)	స్థిరాస్తి/సెక్యూర్డ్ అసెట్ వివరణ (1చ.మీ. అనునది 10.76చ.అ.లకు సమానం)	స్వాధీనతా విధానం	రిజర్వు ధర (రూ.)	ధరావత్తు (రూ)	వేలం తేది & సమయం	సెక్యూర్డు ఆస్తిపరిశీలన తేది	బిడ్ సమర్పించుటకు చివరి తేది
	(A)	(B)	(C)	(D)	(E)	(F)	(G)	(H)	(I)
1	శ్రీ అట్లూరి జేసురాజ్ చౌదరి (రుణగ్రహీత) శ్రీమతి అట్లూరి ఇందిరా ప్రియా దర్శిణి (సహ-రుణగ్రహీత)	31.08.2020 నాటికి రూ. 30,84,884/- (రూపాయలు ముప్పై లక్షల ఎనభైనాలుగు వేల ఎనిమిది వందల ఎనభై నాలుగుమాత్రమే).	మచ్చబొల్లారం, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, మల్కాజిగిరి మండలం, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా వద్దగల (ఉమ్మడి ఏరియాలు& కార్ పార్కింగ్‌తో కలిపి) 982చ.అ.లు లేదా 91.23చ.మీ.ల నిర్మితమైన ఏరియా కలిగిన ఎక 0.20 గుంటల పూర్తి విస్తీర్ణంకుగాను 15చ.గ.లు లేదా 67.62చ.మీ.లవిస్తీర్ణపు విడదీయలేని స్థల భాగంతోసహా సర్వే నెం.11/ఇ పార్టులోని 'జయలక్ష్మి ఆర్కేడ్'గా తెలిసిన 2వ అంతస్తులోని ఫ్లాట్ నెం.204 మొత్తం భాగం మరియు సరిహద్దులు: ఉత్తరం: ఓపెన్ టు స్కై, దక్షిణం: ఓపెన్ టు స్కై, తూర్పు: ఓపెన్ టు స్కై, పడమర: ఎంట్రన్స్ & కారిడార్. సంప్రదించు వ్యక్తి: రామకృష్ణ రాచ్చ. సంప్రదించు నెం.9000789578	భౌతికంగా	రూ. 33,50,000/- (రూపాయలు ముప్పైమూడు లక్షల యాభైవేలు మాత్రమే)	రూ. 3,35,000/- (రూపాయలు మూడు లక్షల ముప్పైఐదు వేలు మాత్రమే)	22.02.2023 ఉ.10.30 గం.ల నుండి ఉ. 11.30 గం.ల వరకు (అమ్మకం ముగింపు వరకు 5 నిమిషాల అపరిమిత పొడిగింపుతో)	04.02.2023 ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 4.00 గం॥ల వరకు	20.02.2023 సా॥ 5.00 గం॥ల వరకు
2	శ్రీ.జతోత్ నరేందర్ (రుణగ్రహీత), శ్రీమతి జతోత్ కవిత (సహ-రుణగ్రహీత)	31.03.2021 నాటికి రూ. 40,57,198/- (రూపాయలు నలభైలక్షల యాభైఏడు వేల ఒకవంద తొంభై ఎనిమిది మాత్రమే).	సాధన విహార్ కాలనీ, కాప్రా, జిహెచ్‌ఎంసి కాప్రా సర్కిల్ & మండల పరిధి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వద్దగల సర్వే నెం.662, 663, 667, 668& 671లోని ఎక 32.17గుంటలపైగల ఫేజ్-1 క్రింద అభివృద్ధిలో భాగంగా బిల్డింగ్ ఫుట్ ప్రింట్ ఏరియాలో 20.09చ.మీ.లకు సమానమైన 24.96చ.గ.లవిడదీయలేని స్థల భాగంతో సహా ఉమ్మడి ఏరియాలు & ఒకకార్ పార్కింగ్ ఏరియా & వసతులతోసహా 207చ.అ.ల ఉమ్మడి సర్వీస్ ఏరియాతో సర్వే నెం.662, 663,667, 668 & 671 లోని మున్సిల్ డోర్ నెం.1-4-213/2/ఇ-105 (పిటిఐఎన్ నెం.1010126229)తో "జనప్రియ లేక్ ఫ్రంట్" యొక్క బ్లాక్, మొదటి అంతస్తులోని ఫ్లాట్ నెం.ఇ-105 మొత్తం మరియు సరిహద్దులు: **ఫ్లాట్ సరిహద్దులు:** ఉత్తరం: మెట్లు & ఓపెన్ టుస్కై, దక్షిణం: ఫ్లాట్ నెం.ఇ-108. తూర్పు: ఓపెన్ టు స్కై, పడమర: మెట్లరు దారి & ఓపెన్ టు స్కై. సంప్రదించు వ్యక్తి: ఎం.పవన్ రెడ్డి, సంప్రదించు నెం.8897054206.	భౌతికంగా	రూ. 40,10,000/- (రూపాయలు నలభై లక్షల పదివేలు మాత్రమే)	రూ. 4,01,000/- (రూపాయలు నాలుగు లక్షల ఒకవేలు మాత్రమే)	22.02.2023 ఉ.11.30 గం.ల నుండి మ. 12.30 గం.ల వరకు (అమ్మకం ముగింపు వరకు 5 నిమిషాల అపరిమిత పొడిగింపుతో)	04.02.2023 ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 4.00 గం॥ల వరకు	20.02.2023 సా॥ 5.00 గం॥ల వరకు
3	శ్రీ.సయ్యద్ ఇర్ఫాన్ అహ్మద్ (రుణగ్రహీత) శ్రీమతి సయ్యద్ షకీల బానో (సహ-రుణగ్రహీత)	30.09.2020 నాటికి రూ. 30,02,995/- (రూపాయలు ముప్పై లక్షల రెండు వేల తొమ్మిది వందల తొంభై ఐదు మాత్రమే).	ఆసిఫ్‌నగర్, హైదరాబాద్ వద్దగల ఇ.నెం.10-2-350లోని ప్లాట్‌నెం.4లోగల 900చ.గ.ల పూర్తి స్థలంలో 5.08%గల 42.03చ.గ.లు లేదా 35.14చ.మీ.ల విస్తీర్ణపు విడదీయలేని స్థల భాగంతోసహా 162.77చ.గ.లకు సమానమైన 1345 చ.అ.లు లేదా 124.95చ.మీ.ల యొక్క సూపర్ ప్లింత్ ఏరియా కలిగియున్న మొఘల్ ముస్కాన్ అపార్ట్‌మెంట్స్‌లోని 5వ అంతస్తులోని ఫ్లాట్ నెం.503 మొత్తం మరియు సరిహద్దులు: ఉత్తరం: ఓపెన్ టుస్కై, దక్షిణం: ఫ్లాట్‌నెం.504, తూర్పు: కారిడార్ & ఓపెన్ టు స్కై పడమర: ఓపెన్ సెట్ బ్యాక్ సంప్రదించు వ్యక్తి: శ్రీ సి.వి.రఘురామరావు, సంప్రదించు నెం.9849616840.	భౌతికంగా	రూ. 47,08,000/- (రూపాయలు నలభైఏడు లక్షల ఎనిమిది వేలు మాత్రమే)	రూ. 4,70,800/- (రూపాయలు నాలుగు లక్షల డెబ్బైవేల ఎనిమిది వందలు మాత్రమే)	22.02.2023 మ.12.30 గం.ల నుండి మ. 01.30 గం.ల వరకు (అమ్మకం ముగింపు వరకు 5 నిమిషాల అపరిమిత పొడిగింపుతో)	04.02.2023 ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 4.00 గం॥ల వరకు	20.02.2023 సా॥ 5.00 గం॥ల వరకు

చెల్లింపు తేది మరియు /లేదా రియలైజేషన్ తేది వరకు చెల్లించిన ఇన్సిడెంటల్ వ్యయాలు, ఖర్చులు, చార్జీలు, 18% వార్షిక వర్తింపు తదుపరి వడ్డీతోసహా.
రుణభారాలు/ క్లెయింల డిస్‌క్లోజర్:
హెచ్‌డిఎఫ్‌సి లిమిటెడ్ యొక్క అధీకృత అధికారికి తెలిసినంత వరకు మరియు సమాచారం ఉన్నంత మేరకు పై స్థిరాస్తులు/ సెక్యూర్డ్ అసెట్స్‌కు సంబంధించి ఏలాంటి రుణభారాలు లేవు.

తేది: 01-02-2023
ప్రదేశం: హైదరాబాద్

హౌసింగ్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్
సం/-
అధీకృత అధికారి
రిజిస్టర్డు ఆఫీసు: రామన్ హౌస్, హెచ్.టి.పరేఖ్ మార్గ్, 160, బ్యాక్‌బే రిక్లేమేషన్, ముంబయి-400020.

SURANA SOLAR LIMITED

SURANA GROUP
(CIN: L45200TG2006PLC051566)
Regd Office: Plot No. 212/3 & 4, Phase II, IDA, Cherlapally, Hyderabad-500 051,
Ph:+9140 27845119, e-mail: surana@surana.com, Website: www.suranasolar.com

31 డిసెంబర్, 2022తో ముగిసిన త్రైమాసికం మరియు తొమ్మిది నెలల కాలానికి స్టాండ్అలోన్ ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాలు యొక్క సారాంశం (రూ.లక్షల్లో)

క్ర.సం	వివరాలు	ముగిసిన త్రైమాసికం			ముగిసిన తొమ్మిది నెలలకు		ముగిసిన సంవత్సరం
		31.12.2022 ఆడిట్‌చేయనివి	30.09.2022 ఆడిట్‌చేయనివి	31.12.2021 ఆడిట్‌చేయనివి	31.12.2022 ఆడిట్‌చేయనివి	31.12.2021 ఆడిట్‌చేయనివి	31.03.2022 ఆడిట్‌చేసినవి
1.	ఆపరేషన్ల నుండి పూర్తి ఆదాయం (నికర)	1,390.02	1,117.64	262.14	3,438.06	1,614.14	2,483.14
2.	కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (పన్ను, మినహాయింపుగల ఐటంలకు ముందు)	19.33	13.63	36.81	303.75	107.49	121.88
3.	పన్నుకు ముందు కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (మినహాయింపుగల ఐటంల తరువాత)	19.33	13.63	36.81	303.75	107.49	121.88
4.	పన్ను తరువాత కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (మినహాయింపుగల ఐటంల తరువాత)	2.77	9.94	30.72	203.28	54.02	84.58
5.	కాలవ్యవధి కొరకు పూర్తి సమగ్ర ఆదాయం (కాలవ్యవధి కొరకు కంప్రైసింగ్ లాభం/(నష్టం) (పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత))						
6.	ఈక్విటీ వాటా మూలధనం (ముఖ విలువ రూ.5/- చొప్పున)	2460.33	2460.33	2460.33	2460.33	2460.33	2460.33
7.	ఆడిట్‌చేసిన బ్యాలెన్స్ షీట్‌లో చూపినట్లుగా రిజర్వులు (రివ్యాల్యూయేషన్ రిజర్వు మినహాయించి)						3053.83
8.	వాటా ఒక్కింటికి రాబడి (రూ.5/- చొప్పున) (కొనసాగుతున్న మరియు నిలిచిపోయిన ఆపరేషన్ కొరకు)						
	బేసిక్:	0.01	0.02	0.06	0.41	0.11	0.17
	డైల్యూటెడ్:	0.01	0.02	0.06	0.41	0.11	0.17

గమనికలు:
1. సెబీ (లిస్టింగ్ అండ్ అదర్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్స్చేంజీలతో దాఖలు చేయబడిన ముగిసిన త్రైమాసికం ఆర్థిక ఫలితాల యొక్క వివరణాత్మక ఫార్మాట్‌కుపై పేర్కొన్నవి సారాంశం. సమీక్షిత సవీక్ష రిపోర్టుతోసహా త్రైమాసికం కాలానికి ఆర్థిక ఫలితాలు మరియు సెగ్మెంట్ ఫలితాల యొక్క పూర్తి వివరాలు స్టాక్ ఎక్స్చేంజ్ వెబ్‌సైట్లు అనగా www.bseindia.com & www.nseindia.com మరియు కంపెనీ వెబ్‌సైట్: www.suranasolar.com పై అందుబాటులో ఉంటాయి.
2. పై పేర్కొన్న ఫలితాలు ఆడిట్ కమిటీచే సమీక్షించబడినవి మరియు 1 ఫిబ్రవరి, 2023న నిర్వహించబడిన వారి సమావేశంలో బోర్డు ఆఫ్ డైరెక్టర్ల ద్వారా ఆమోదించబడినవి.

బోర్డు ఉత్తర్వుల మేరకు
For SURANA SOLAR LIMITED
సం/-
నరేందర్ సురానా
చైర్మన్

తేది: 01-02-2023
ప్రదేశం: సికింద్రాబాద్

MEDINOVA DIAGNOSTIC SERVICES LIMITED

CIN: L85110TG1993PLC015481
Regd. Office : H.No. 7-1-58, Unit No. 1/Flat No.301, 3rd Floor, Amrutha Business Complex, Ameerpet, Hyderabad - 500 016.E mail- cs@medinovaindia.com, website- www.medinovaindia.com, Tel No. 040-42604250

31 డిసెంబర్, 2022తో ముగిసిన త్రైమాసికం మరియు తొమ్మిది నెలల కాలానికి ఆడిట్‌చేయని స్టాండ్అలోన్ మరియు కన్సాలిడేటెడ్ ఆర్థిక ఫలితాల సారాంశం (రూ.లక్షల్లో)

క్ర.సం.	వివరాలు	స్టాండ్అలోన్			కన్సాలిడేటెడ్		
		ముగిసిన త్రైమాసికం 31.12.2022 (ఆడిట్‌చేయనివి)	ముగిసిన 9 నెలలు 31.12.2022 (ఆడిట్‌చేయనివి)	ముగిసిన త్రైమాసికం 31.12.2021 (ఆడిట్‌చేయనివి)	ముగిసిన త్రైమాసికం 31.12.2022 (ఆడిట్‌చేయనివి)	ముగిసిన 9 నెలలు 31.12.2022 (ఆడిట్‌చేయనివి)	ముగిసిన త్రైమాసికం 31.12.2021 (ఆడిట్‌చేయనివి)
1	ఆపరేషన్ల నుండి పూర్తి ఆదాయం	171.86	571.84	224.35	223.54	730.38	265.82
2	కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (పన్ను, మినహాయింపుగల మరియు అసాధారణ ఐటంలకు ముందు)	3.03	32.78	35.28	27.99	99.70	42.08
3	పన్నుకు ముందు కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (మినహాయింపుగల ఐటంల తరువాత)	3.03	32.78	35.28	27.99	99.70	42.08
4	పన్ను తరువాత కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం)	(1.00)	21.18	30.84	23.46	89.23	39.56
5	ఇతర సమగ్ర ఆదాయం	-		(0.22)	-	-	(0.22)
6	కాలవ్యవధి కొరకు పూర్తి సమగ్ర ఆదాయం	(1.00)	21.18	30.62	23.46	89.23	39.34
7	ఈక్విటీ వాటా మూలధనం	**995.68**	**995.68**	**995.68**	**995.68**	**995.68**	**995.68**
8	గత సంవత్సరం యొక్క ఆడిట్‌చేసిన బ్యాలెన్స్ షీట్‌లో చూపినట్లుగా రిజర్వులు (రివ్యాల్యూయేషన్ రిజర్వు మినహాయించి)	**(1,342.55)**	**(1,342.55)**	**(1,551.50)**	**(1,676.56)**	**(1,676.56)**	**(1,715.47)**
9	వాటా ఒక్కింటికి రాబడి (రూ.10/-ల చొప్పున) (కొనసాగుతున్న మరియు నిలిచిపోయిన ఆపరేషన్ల కొరకు)						
	1. బేసిక్: (రూ.)	(0.01)	0.21	0.31	0.24	0.89	0.36
	2. డైల్యూటెడ్: (రూ.)	(0.01)	0.21	0.31	0.24	0.89	0.36

గమనిక: పై నివేదిక అనునది, సెబీ (లిస్టింగ్& ఇతర డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ లిమిటెడ్‌తో దాఖలు చేయబడిన 31 డిసెంబర్, 2022తో ముగిసిన త్రైమాసికం మరియు 9 నెలల కాలానికి ఆర్థిక ఫలితాల వివరణాత్మక ఫార్మాట్ యొక్క సారాంశం. 31 డిసెంబర్, 2022తో ముగిసిన త్రైమాసికం మరియు 9 నెలల కాలానికి ఆర్థిక ఫలితాల పూర్తి వివరాలు బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ లిమిటెడ్ వెబ్‌సైట్: www.bseindia.com మరియు కంపెనీ యొక్క వెబ్‌సైట్: www. medinovaindia.com పై అందుబాటులో ఉంటాయి.

for MEDINOVA DIAGNOSTIC SERVICES LTD.
సం/-
సునీల్ చంద్ర కొండపల్లి
మేనేజింగ్ డైరెక్టర్
DIN 01409332

ప్రదేశం: హైదరాబాద్
తేది: 01-02-2023

వర్ధన ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్

varthana
(గతంలో తిరుమేని ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌గా తెలిసినది)

రిజిస్టర్డు ఆఫీసు: నెం.ఇబిసి-110, వరసిద్ధి, 3వ అంతస్తు, ఔటర్ రింగ్ రోడ్, సర్వీస్ రోడ్, 3వ బ్లాక్, HRBR లేఔట్, కళ్యాణ్‌నగర్, బెంగళూరు-560043. వెబ్‌సైట్: www.varthana.com, ఇమెయిల్: care@varthana.com, ఫోన్: 080-68455777,
బ్రాంచ్ ఆఫీసు: ఇ.నెం.1-8-303/40, 2వ అంతస్తు, రవిప్లాజా, పిజి రోడ్, సింధి కాలనీ, అర్బన్ కిసాన్ పైన, సికింద్రాబాద్-500003.

స్థిరాస్తుల అమ్మకం కొరకు వేలం కొరకు బహిరంగ ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6)తో చదువబడే ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద స్థిరాస్తి అమ్మకం కొరకు వేలం అమ్మకపు ప్రకటన. ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి మరియు ప్రత్యేకించి రుణగ్రహీత(లు) మరియు తాకట్టుదారు(ల)కు ప్రకటన ఇవ్వడమేమనగా, సెక్యూర్డ్ క్రెడిటర్‌కు తాకట్టు పెట్టబడిన/చార్జ్ చేయబడిన దిగువ వివరించిన స్థిరాస్తిని, మెసర్స్ వర్ధన ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్ (గతంలో తిరుమేని ఫైనాన్స్ప్రైవేట్ లిమిటెడ్‌గా తెలిసినది) యొక్క అధీకృత అధికారిచే స్వాధీనం చేసుకోబడినది, వాటిని దిగువ పేర్కొన్న రుణ ఖాతాకు సంబంధించి రికవరీ కొరకు "ఎక్కడ ఎలా ఉన్నది" మరియు "అది అక్కడ అలాగే" ప్రాతిపదికన 07-03-2023న (మంగళవారం) మ.1.00గం.ల నుండి 2.00గం.ల మధ్య విక్రయించబడుతుంది. రుణగ్రహీత(లు)/తాకట్టుదారు(లు)/సెక్యూర్డు అసెట్/ బకాయిలు/రిజర్వు ధర/ వేలం తేది మరియు సమయం, ధరావత్తు మరియు బిడ్ పెంపుదల మొత్తం యొక్క వివరాలు దిగువ విధంగా కలవు.

రుణగ్రహీతలు/ తాకట్టుదారుల పేరు: 1) మెసర్స్ ఎస్‌ఎల్ఎన్ స్కూల్, ప్రతినిధియైన దీని అధీకృత సంతకందారు, 2) మెసర్స్ శ్రీ లక్ష్మి నరసింహా ఎడ్యుకేషనల్ సొసైటీ, ప్రతినిధియైన దీని అధీకృత సంతకందారు, 3) శ్రీ.రాచకొండ మల్లాద్రి, తండ్రి మాలకొండయ్య, 4) శ్రీమతి రాచకొండ లక్ష్మి దేవి.
Loan A/c. No's. S20HYD-HYD-013667 and U20HYD-HYD-016080.

పూర్తి బాకీపడిన మొత్తాల వివరాలు రూపాయల్లో: పూర్తి మొత్తాల రియలైజేషన్ వరకు తదుపరి ఒప్పందంచేసిన కాంట్రాక్చువల్ వడ్డీ ప్లస్ లీగల్ ఖర్చులు/ చార్జీలతోసహా 23-01-2023 నాటికి రూ.25,65,011/- (రూపాయలు ఇరవైఐదు లక్షల అరవైఐదు వేల పదకొండు మాత్రమే).

స్థిరాస్తుల యొక్క వివరాలు: టి.ఎస్.నెం.1, బ్లాక్-ఎఫ్, వార్డు నెం.9, ఆవరణ నెం.8-1-338/18/14, ఓ.యు.ఆర్.నగర్, షేక్‌పేట్, హైదరాబాద్ వద్దగల 97 చ.గ.ల విస్తీర్ణపు సర్వే నెం.403గల ఆస్తి మొత్తం భాగం మరియు సరిహద్దులు దిగువ విధంగా కలవు: తూర్పు: రోడ్డు, పడమర: లేన్, ఉత్తరం: ఇ.నెం.8-1-339/16/ 15/బిజెంట్, దక్షిణం: ఇ.నెం.8-2-239/ఏ/4.
పై పేర్కొన్న ఆస్తి రిజర్వు ధర: రూ.31,64,400/- (రూపాయలు ముప్పైఒక లక్షల అరవైనాలుగు వేల నాలుగు వందలు మాత్రమే) మరియు ధరావత్తు (రిజర్వు ధరలో 10%) : రూ. 3,16,440/-.
తెలిసిన రుణభారాలు, ఏవేని ఉన్నచో: నిల్.

[illegible]
వేలం అక్కడ నిర్వహించబడును: ఇ.నెం.1-8-303/40, 2వ అంతస్తు, రవిప్లాజా, పిజి రోడ్, సింధికాలనీ, అర్బన్ కిసాన్ పైన, సికింద్రాబాద్-500003 వద్ద 07-03-2023 (మంగళవారం) మ.1.00గం.ల నుండి మ.2.00గం.ల మధ్య.

అమ్మకం యొక్క వివరణాత్మక నియమ నిబంధనల కొరకు, దయచేసి కంపెనీ వెబ్‌సైట్ అనగా: www.varthana.com లో పేర్కొన్న లింకును పరిశీలించండి. నిర్దిష్ట బిడ్డరుదారులు తదుపరి వివరాలు/ సమాచారం కొరకు అధీకృత అధికారి శ్రీ.ఏడుకొండలు-ఫోన్ నెం.7306981632 మరియు శ్రీ.అభిషేక్ -ఫోన్ నెం.9133199333 వారిని సంప్రదించండి.

తేది: 02-02-2023 ప్రదేశం: బెంగళూరు — అధీకృత అధికారి, వర్ధన ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్

చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

Chola — Enter a better life
కార్పొరేట్ కార్యాలయం: 1వ అంతస్తు, 'డేర్ హౌజ్', నం.2, ఎన్.ఎస్.సి బోస్ రోడ్, చెన్నై-600001 శాఖ కార్యాలయం: 102, మొదటి అంతస్తు, మందన టవర్స్, 7-1-59/2, 59/6, హైదరాబాద్-500016

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క సెక్షన్ 13 (2) క్రింద డిమాండ్ నోటీసు

మీరు, దిగువ పేర్కొన్న రుణగ్రహీత/తనఖాదారుడు ఇక్కడ తెలియజేయడం ఏమనగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద మీకు వ్యతిరేకంగా కంపెనీ చర్యలు మొదలుపెట్టింది మరియు చట్టం యొక్క 13(2) క్రింద రిజిస్టర్డ్ పోస్ట్ ఎక్నలాడ్జ్‌మెంట్ ద్వారా మీకు నోటీసు పంపించడమైనది. రుణగ్రహీత/ల కారణంగా డెలివరీ కాకుండా తిరిగివచ్చింది. కావున, మిమ్మల్ని ఇక్కడ నోటీసు తీసుకొనుటకు పిలువడమైనది మరియు ఈ ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా అక్కడ నుండి పొందిన వడ్డీతో సదరు ఖాతా ఎదురుగా పేర్కొన్న మిగిలిన లోను మొత్తం చెల్లించవలెను, విఫలమైనయెడల వడ్డీల మరియు వ్యయాలతో దాని బకాయిలు తెలిసిన మేరకు దిగువ పేర్కొన్న సెక్యూరిటీ అమలుచేయుట ద్వారా చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద దాని హక్కులు అధ్యాయనం చేయుట ద్వారా మీకు వ్యతిరేకంగా కంపెనీ ముందుకెళ్తుంది. ఈ నోటీసు కంపెనీకి ఏ ఇతర పరిహారం లభించకుండా పక్షపాతం లేకుండా మీకు సంబోధించబడిందని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

క్ర.స	రుణ ఖాతా నెం. & రుణగ్రహీత/లు పేరు మరియు చిరునామా	రుణం మొత్తం	డిమాండ్ నోటీసు తేది & బకాయి ఉన్న మొత్తం
1.	రుణ ఖాతా నెంబర్లు X0HEHYD00002643282 గుడిస మోహన్, తండ్రి: నర్సింహ, ఇంటి నెం.1607,ఎంబిజి, బిహెచ్ఇఎల్, నల్లగండ్ల, శేరిలింగంపల్లి, హైదరాబాద్, తెలంగాణ-ఎన్-500 032, లతా శ్రీ గుడిస, తండ్రి: నరసగౌడ్ గంగమ్మ (దరఖాస్తుదారురాలు),ఇంటి నెం.1607,ఎంబిజి, బిహెచ్ఇఎల్, నల్లగండ్ల, శేరిలింగంపల్లి, హైదరాబాద్, తెలంగాణ-ఎన్-500 032, శ్రీ సాయి వాటర్ సప్లయర్స్ (సహ-దరఖాస్తుదారులు), ఇంటి నెం.1607,ఎంబిజి, బిహెచ్ఇఎల్, నల్లగండ్ల, శేరిలింగంపల్లి, హైదరాబాద్, తెలంగాణ-ఎన్-500 032, గుడిస నర్సింహ, తండ్రి: గుడిస సంగయ్య (సహ-దరఖాస్తుదారులు) ఇంటి నెం.1607,ఎంబిజి, బిహెచ్ఇఎల్, నల్లగండ్ల, శేరిలింగంపల్లి, హైదరాబాద్, తెలంగాణ-ఎన్-500 032, జి.లక్ష్మి, భర్త: గుడిస నర్సింహ [illegible]	Rs. 63,00,000/-	23.01.2023 మరియు 23.01.2023 నాటికి రూ.63,14,263/- వర్తింపుగల వడ్డీ& చార్జీలను కలుపుకొని

స్థిరాస్తి/ సెక్యూర్డ్ అసెట్స్ వివరాలు: [illegible] ... 1610.

తేది: 02-02-2023
ప్రదేశం: హైదరాబాద్

సం/- అధీకృత అధికారి
చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

సంపాదకీయం

శుష్క వాగ్దానాలు.. శూన్య హస్తాలు...

'బడ్జెట్ అంటే కేవలం అంకెలు.. సంఖ్యలు మాత్రమే కాదు. అది దేశ ప్రజల జీవన ప్రమాణాలు. వారి దైనందిన జీవితాలను ప్రభావితం చేసే అతి కీలకమైన పద్దు...' ఆర్థిక నిపుణులు, విశ్లేషకులు పదే పదే చెప్పే మాట ఇది. అంటే జనం జీతాలు, భత్యాలు, వాటిపై వేసే పన్నులు, ధరలు తదితరాంశాలతో మిళితమై అనునిత్యం వారి జీవనంపై ప్రభావాన్ని

> తెలంగాణ కోణంలో ఈ బడ్జెట్‌ను పరిశీలించి నప్పుడు...రాష్ట్రానికి 'శుష్క వాగ్దానాలు- శూన్య హస్తాలే...' మిగిలాయి తప్ప ఒక్కటంటే ఒక్కటీ ఉపయోగపడేది లేదు. గత ఎనిమిదిన్నరేండ్లుగా 'మాకు చాలినన్ని నిధులివ్వండి మొర్రో...' అంటూ బీఆర్ఎస్ సర్కారు వినతులు, విజ్ఞప్తులు చేసినా ప్రధాని మోడీ కనుసన్నల్లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన నిర్మలమ్మ కనీసం కనికరం చూపలేదు.

చూపేదే బడ్జెట్. ఈ క్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం పార్లమెంటుకు సమర్పించిన 2023-24 ఆర్థిక సంవత్సరపు పద్దు మాత్రం పేదలు, సామాన్యులు, మధ్య తరగతి ప్రజలు, వేతన జీవులకు ఊరట కలిగించకపోగా వారి నడ్డి విరగ్గొట్టేదిగా ఉంది. హిడెన్ బర్గ్ నివేదికలు బయటి కొచ్చినా అలాంటి వాస్తవాలను పట్టించుకోకుండా ఇది మోడీ స్నేహితులైన సంపన్నుల కోసమే రూపొందించిన బడ్జెట్ అని చెప్పేందుకు ఎలాంటి సంశయమూ అక్కర్లేదు. ఇదే సమయంలో ఇది ఫక్తు ఎన్నికల కోణంలో ప్రవేశ పెట్టిన ఒక రాజకీయ పద్దని మాత్రం చెప్పక తప్పదు. ముఖ్యంగా మరో మూడు నెలల్లో నిర్వహించబోయే కర్నాటక అసెంబ్లీ ఎన్నికలు, ఆ తర్వాత వచ్చే ఏడాది నిర్వహించాల్సిన పార్లమెంటు ఎలక్షన్లను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌ను సమర్పించారనేది సుస్పష్టమవు తున్నది. అంతేతప్ప కరోనా సమయంలో ఉద్యోగాలు, ఉపాధి కోల్పోయిన ప్రజలకు ఊరటనిచ్చేందుకు గానీ, పెరుగుతున్న ధరల అదుపునకుగానీ ఈ బడ్జెట్‌లో ఎలాంటి చర్యలూ తీసుకోకపోవటం గమనార్హం.



ఇక తెలంగాణ కోణంలో ఈ బడ్జెట్‌ను పరిశీలించి నప్పుడు...రాష్ట్రానికి 'శుష్క వాగ్దానాలు- శూన్య హస్తాలే...' మిగిలాయి తప్ప ఒక్కటంటే ఒక్కటీ ఉపయోగపడేది లేదు. గత ఎనిమిదిన్నరేండ్లుగా 'మాకు చాలినన్ని నిధులివ్వండి మొర్రో...' అంటూ బీఆర్ఎస్ సర్కారు వినతులు, విజ్ఞప్తులు చేసినా ప్రధాని మోడీ కనుసన్నల్లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన నిర్మలమ్మ కనీసం కనికరం చూపలేదు. చివరి సారిగా సమర్పించిన పూర్తిస్థాయి పద్దులోనూ విభజన హామీల్లోని ఏ ఒక్క దాని గురించీ పట్టించుకోలేదు. తెలంగాణలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ ఊసే లేదు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని కేంద్రం పెడ చెవిన పెట్టింది. రాష్ట్రం లోని వెనుకబడిన ప్రాంతాలు, జిల్లాలకు హక్కుగా ఇవ్వాల్సిన రూ.1,350 కోట్ల గురించి చెప్పకుండా మరోసారి మొండి చేయి చూపారు. ఇదే సమయంలో కర్నాటక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అక్కడి వెనుక బడిన ప్రాంతాల అభివృద్ధి కోసం రూ.5,300 కోట్లను విత్త మంత్రి కేటాయించటం గమనార్హం. గతంలో దేశవ్యాప్తంగా మొత్తం 157 వైద్య కళాశాలలను ప్రకటించిన కేంద్రం... అందులో తెలంగాణకు ఒక్కటి కూడా కేటాయించలేదు. ప్రస్తుత బడ్జెట్‌లోనూ అదే దుస్థితి పునరావృతమైంది. గమ్మత్తేమిటంటే... నర్సింగ్ కాలేజీల ఏర్పాటు విషయంలోనూ గతంలో మాదిరి గానే వ్యవహరిస్తామనటం విడ్డూరం. అంటే రాష్ట్రానికి ఇప్పుడు కూడా అదనంగా ఒక్క నర్సింగ్ కాలేజీ రాబోదన్నమాట. మరోవైపు వస్త్రాలపై విధించిన జీఎస్టీ, నేతన్నలకు భారంగా మారిన నేపథ్యంలో... దాన్ని ఎత్తేయాలంటూ తెలంగాణ సర్కారు కోరినప్పటికీ నిర్మలమ్మ దయ చూపకపోవటం బాధాకరం. ఇవన్నీ ప్రత్యక్షంగా తెలంగాణకు నష్టం చేకూర్చిన అంశాలు కాగా... పరోక్షంగా రాష్ట్రంలోని పేదలు, రైతులు, కార్మికులపై ప్రభావం చూపే అనేకాంశాలు బడ్జెట్‌లో దాగున్నాయి. ఉపాధి హామీ పథకానికి గత బడ్జెట్‌లో రూ.89,400 కోట్లను కేటాయించగా, ఈసారి రూ.60 వేల కోట్లకు ఆ నిధులను కుదించారు. ఇది అనివార్యంగా తెలంగాణలోని పేదలు, వ్యవసాయ కార్మికుల ఉపాధికి గండి కొట్టనుంది. పేదల ఆహార భద్రత కోసం గత పద్దులో రూ.2,87,194 కోట్లను కేటాయించగా... ప్రస్తుత బడ్జెట్‌లో ఆ కేటాయింపులను రూ.1,97,350 కోట్లకు తగ్గించారు. ఇది రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పేదల నోటికాడి బువ్వకు ఎసరు పెట్టనుంది. పదిహేనో ఆర్థిక సంఘం సిఫారసుల ప్రకారం... 2022-23 బడ్జెట్‌లో పట్టణ స్థానిక సంస్థల కోసం రూ.22,908 కోట్లను ప్రతిపాదించారు. ఆ తర్వాత ఆ కేటాయింపులను రూ.15,026 కోట్లకు సవరించినట్టుగా ప్రస్తుత బడ్జెట్‌లో పేర్కొన్నారు. గ్రామీణ స్థానిక సంస్థలకు రూ.46,513 కోట్లను కేటాయించి... రూ.41 వేల కోట్లకు కుదించినట్టుగా పద్దులో ప్రస్తావించారు. ఈ రకంగా స్థానిక సంస్థల నిధుల్లో కోతలు పెట్టటమనేది... తెలంగాణలోని నగరాలు, పట్టణాలు, పంచాయతీల అభివృద్ధికి శరఘాతమే కదా..? ఈ రకంగా చూసినప్పుడు ఆర్థిక మంత్రి గారి పద్దు... రాజ్యాంగంలోని ఆహార భద్రత, పని భద్రత, జీవించే హక్కులకు భిన్నంగా ఉంది. రాష్ట్రాల, ముఖ్యంగా తెలంగాణ హక్కులను హరించేదిగానూ ఉంది. ఇది సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం. అన్ని ప్రాంతాల, ప్రజల సర్వతోముఖాభివృద్ధికి విఘాతం.

హిందూత్వ ఆధునీకరణ సిద్ధాంతం-ఓ మతతత్వ ప్రేరణ



బృందాకరత్

ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్‌తో "ఆర్గనైజర్", "పాంచజన్యం" పత్రికల సంపాదకులు జరిపిన ఇంటర్వ్యూలో ఆయన చేసిన వ్యాఖ్యలను, హిందూ రాజ్యస్థాపన కోసం ఆరెస్సెస్ స్థాపకులు హెడ్గే వార్, గోల్వాల్కర్‌ల రచనల 2023 ఆధునీకరణలుగా భావించాలి. "హిందుస్థాన్ ఒక హిందూ రాజ్యం. ఈ అభివృద్ధి చెందుతున్న శక్తివంతమైన హిందూ సమాజం, హిందూరాజ్యం, భారత్ ఉన్నత శిఖరాలకు చేరుకొని, ప్రపంచానికి నాయకత్వాన్ని అందిస్తుందని" భగవత్ అన్నాడు. భారతదేశం, బ్రిటిష్ వలస దేశంగా ఉన్నప్పుడే ఆరెస్సెస్ తన ప్రణాళికను చాలా స్పష్టంగా వివరించింది. నేడు స్వాతంత్ర్య భారత దేశం స్వంత రాజ్యాంగాన్ని కలిగి ఉంది. ఆరెస్సెస్ అధినేత అసాధారణమైన వ్యాఖ్యలు, ఆరెస్సెస్ ఎన్నటికీ భారత రాజ్యాంగాన్ని అంగీకరించదనే విషయాన్ని రుజువు చేస్తాయి. నేడు ఆరెస్సెస్ "వనరులు", "సమృద్ధి", "సాధనాల"ను కలిగి ఉంది. ఆ వనరులు ఏమిటి, ఎలా సమృద్ధిగా ఉంది, ఆ సాధనాలు ఎక్కడి నుండి వస్తున్నాయని అడగడం చట్టబద్ధమవుతుంది.

గోల్వాల్కర్ విస్తరించిన "అంతర్గత శత్రువు"

ఈ ఇంటర్వ్యూ "హిందూ సమాజానికి" సంబంధించిన చర్చ కోసం ఉద్దేశించినది. కానీ ఆరెస్సెస్ చీఫ్ ప్రకటించిన 'హిందూ సమాజం' అనే భావనకు భారతరాజ్యాంగంలో చోటు లేదు. ఆయన చెప్పేదాని ప్రకారం "హిందూ సమాజం 1000 సంవత్సరాలకు పైగా యుద్ధంలో ఉంటుంది కాబట్టి, యుద్ధంలో ఉండేవారు దూకుడుతనంతో ఉండడం సహజం." అందువల్ల స్థానిక భూస్వామ్య ఆధిపత్యవర్గాల సహాయంతో, దురాక్రమణ దారులకు, విజేతలకు మధ్య జరిగిన యుద్ధాలను,

> ఆరెస్సెస్ ప్రేరేపణలు, ఇస్లామిక్ వాదుల సమూహం వారి మత ఛాందస భావాలను, ఆచారాలను వ్యాప్తి చేయడానికి అవకాశం ఇవ్వడం వల్ల ఆరెస్సెస్ మత విభజన వ్యూహాలు మరింతగా బల పడ్డాయని సీపీఐ(ఎం) అభిప్రాయపడింది. ఒక మతతత్వం ఇతర మతతత్వాన్ని బలోపేతం చేస్తుందని సీపీఐ (ఎం) పదేపదే చెప్పే విషయాన్ని ఈ ఇంటర్వ్యూ రుజువు చేస్తుంది.

హిందూ,ముస్లింలకు మధ్య జరిగిన మత యుద్ధాలుగా మార్చారు. చారిత్రక అన్యాయాల పేరుతో నేటి "హిందువుల దూకుడుతనాన్ని" న్యాయమైందిగా చెపుతున్నారు. ఆయన మాటల్లో చెప్పాలంటే "ఇది బయటి శత్రువు కాదు కానీ, అంతర్గత శత్రువు. కాబట్టి హిందూ సమాజాన్ని, హిందూధర్మాన్ని, హిందూ సంస్కృతిని రక్షించుకోడానికి యుద్ధం ఉంటుంది." "భారతదేశంలో నివసిస్తున్న ముస్లింలు వారి విశ్వాసాలను అంటిపెట్టుకొని ఉండాలనుకుంటే, వారి పూర్వీకుల విశ్వాసాలను తిరిగి ఆచరించాలనుకుంటే, వారికెలాంటి ప్రమాదం ఉండదు, వారు భయపడాల్సిన పని లేదు. కానీ అదే సమయంలో ముస్లింలు తమ ఆధిపత్య ప్రసంగ గర్జనలను వదిలిపెట్టాలి. ముస్లింలు భారతదేశాన్ని తిరిగి పాలించబోతున్న "ఉన్నత జాతి" అనే కథనాన్ని ముస్లింలు వదిలెయ్యాలి. వాస్తవానికి ఇక్కడ నివసించే వారంతా, వారు హిందువులైనా, కమ్యూనిస్టులైనా ఈ తర్కాన్ని వదిలిపెట్టాలని" ఆయన అన్నాడు.ఆరెస్సెస్ తప్పుడు కథనాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న కమ్యూనిస్టుల వలె రాజీపడని వారిపై దాడి చెయ్యడం, వారిని బెదిరించడం, భయపెట్టడమే ఆరెస్సెస్ తర్కం. "హిందూ జాతికి పూర్తిగా లోబడి ముస్లింలు భారతదేశంలో నివసించవచ్చని" గోల్వాల్కర్ అన్నాడు. భగవత్ ప్రకటనలు, చట్టం నుండి తప్పించుకోడానికి సవరించినప్పటికీ ఆరెస్సెస్ పరిశీలనలో ముస్లింలను లొంగదీసుకోవడం, సంఘ్ పరివార్ నేర పూరిత దాడులను చూసీచూడనట్టుండటం, అంతర్గత శత్రువుకు వ్యతిరేకంగా యుద్ధాన్ని కొనసాగించే లక్ష్యాన్ని కలిగి ఉన్నాయి. ఈ యుద్ధంలో గోల్వాల్కర్ ముస్లింలు, కమ్యూనిస్టులు, క్రైస్తవులు శత్రువులనే నిర్వచనం అంతటితో ఆగకుండా ఆరెస్సెస్ కథనాలకు అనుగుణంగా లేని హిందువులను కూడా శత్రు జాబితాలో చేర్చడం జరిగింది. అంటే ఇక్కడ నివసించే భారతీయ పౌరులు ప్రశాంతంగా జీవించాలంటే భారత రాజ్యాంగానికి అనుగుణంగా కాక ఆరెస్సెస్‌కు అనుగుణంగా ఉండాలి.


ఆరెస్సెస్ ప్రేరేపణలు, ఇస్లామిక్ వాదుల సమూహం వారి మత ఛాందస భావాలను, ఆచారాలను వ్యాప్తి చేయడానికి అవకాశం ఇవ్వడం వల్ల ఆరెస్సెస్ మత విభజన వ్యూహాలు మరింతగా బల పడ్డాయని సీపీఐ(ఎం) అభిప్రాయపడింది. ఒక మతతత్వం ఇతర మతతత్వాన్ని బలోపేతం చేస్తుందని సీపీఐ(ఎం) పదేపదే చెప్పే విషయాన్ని ఈ ఇంటర్వ్యూ రుజువు చేస్తుంది.

కుల హింసను పట్టించుకోని ఆరెస్సెస్

భగవత్ "హిందూ సమాజపు" స్వయం నియామక ప్రతినిధిగా "సమాజం" తరపున అనాగరికమైన వాదనలు చేస్తూ మాట్లాడతాడు. మతానికి ఎలాంటి సంబంధంలేని హిందూత్వ రాజకీయభావనా కవచాన్ని ప్రకటించడం ఒకటైతే, ఈ దేశంలో అత్యధికంగా ఉన్న ప్రజలంతా హిందూ మతానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు అనేది రెండవది. కానీ మతపరంగా హిందువులైన ప్రజలు ఆరెస్సెస్ ఆలోచనలను సమ్మతిం చడం లేదు. ఆరెస్సెస్ నాయకునికి దళి తులకు వ్యతిరేకంగా పెచ్చరిల్లుతున్న హింసాత్మక చర్యలు అసలు ఒక సమస్యగా కనిపించవు. "శ్రీరాముడే అన్ని జాతులను, వర్గాలను కలిపి ఉంచు తాడు" అనేదే కులానికి సంబంధించిన ఏకైక ప్రస్తావన. హిందూత్వ గుర్తింపు నిర్మాణంలో జైశ్రీరామ్ నినాదాల్లో, జైశ్రీరామ్ ఒక రాజకీయ సాధనంగా మారుతుంటే, దళితులు కుల హిందువుల చేతుల్లో వివక్షతను, హింసను, లైంగిక దాడులను ఎదుర్కొంటున్న వాస్తవాల ప్రస్తావనలను ఎక్కడా ఉదహరించలేదు.

ఆరెస్సెస్ అధినేత మాటల్లో లేని "పేదరికం" అనే పదం

భగవత్ "శక్తివంతమైన, సంపన్న హిందూ సమాజం" గురించి మాట్లాడతాడు. అధిక పోషకాహార లోపం, ఆకలితో అధిక జనాభా గల దేశాలలో భారతదేశం గ్లోబల్ హంగర్ ఇండెక్స్‌లో అవమానకరమైన స్థానంలో ఉంది. అలాంటి జనాభాలో హిందువులే అధికులు. ఆయన "సంపన్నం" గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉంది. భారతదేశాన్ని ధ్వంసం చేస్తున్న సామాజిక, ఆర్థిక అసమానతలు, సామాన్య ప్రజానీకం ఎదుర్కొంటున్న కష్టాల గురించి సంఘ్ అధినేత ఒక్కమాట కూడా మాట్లాడకపోవడం ఆశ్చర్యంగా ఉంది. ఆరెస్సెస్‌కు కార్మికులు, రైతులు అనే వర్గాలు లేవు. వారి దృష్టిలో అంతా హిందూ సమాజంగా పిలువబడే దానిలోనే దాగి ఉంటారు. కాబట్టి, ఆదానీ రోజుకు సగటున 1216కోట్ల రూపాయలు, గ్రామీణ మహిళ రోజుకు కేవలం 250రూపాయలు సంపాదిస్తే, ఆరెస్సెస్ వారిరువుర్నీ అదే హిందూ సమాజమనే ఒకే వర్గంలో ఉన్నట్లు భావిస్తుంది. ఆరెస్సెస్ సృష్టించాలనుకునే ముఖ్యమైన హిందూత్వ గుర్తింపులో భాగంగా ధనికులను, పేదలను



గుర్తించడానికి నిరాకరించడం ద్వారా ఆరెస్సెస్ అధినేత భారీ అసమానతలను సమర్థిస్తున్నాడు. జనాభాలో అధిక సంఖ్యాక ప్రజల తక్కువ కొనుగోలు శక్తిని ప్రతిబింబించే అధికారిక సంఖ్యలు ఉన్నప్పటికీ, అధిక సంఖ్యాక భారతీయులు అధిక ధరలతో బాధపడుతున్నప్పటికీ, ద్రవ్యోల్బణం అనేది "వినియోగతత్వం" విధి అనీ, ప్రజలు ఎక్కువ కొనుగోలు చేస్తున్నందువల్లే ధరలు పెరిగిపోతున్నాయని సంఘ్ నాయకుడు అభిప్రాయ పడుతున్నాడు. భారతదేశం ప్రస్తుతం మాంద్యం అంచున ఉంది. ఆఖరికి పెట్టుబడిదారీ అనుకూల ఆర్థికవేత్తలు కూడా డిమాండ్‌ను పెంచే విధానాల కోసం ముందుకు పోతున్నారు కానీ, ధరల పెరుగుదలకు ప్రజలే కారణమని ఆరెస్సెస్ నేత ప్రజల్ని నిందిస్తున్నాడు.

అదనపు రాజ్యాంగబద్ధమైన అధికారం

ఇంటర్వ్యూలో భగవత్ ఆరెస్సెస్, దాని స్వయం సేవకులు, రాజకీయాలు, ప్రభుత్వం మధ్య ఉండే సంబంధం గురించి మాట్లాడినప్పుడు మరో అంశం బహిర్గతమైంది. ఆరెస్సెస్ ఒక "సాంస్కృతిక" సంస్థ అనీ, దానికి రోజువారీ రాజకీయాల్లో ఆసక్తి లేదనీ, కానీ ప్రస్తుత పరిస్థితుల్లో తమకు ఇష్టం లేకపోయినప్పటికీ ప్రభుత్వ వ్యవహారాల్లో బలవంతంగా జోక్యం చేసుకుంటుందని అంగీకరిస్తూ ఆయన కట్టుకథను పునశ్చరణ చేశాడు. "ఇంతకు ముందున్న తేడా ఏమంటే, మా స్వయం సేవకులు అధికార స్థానాల్లో లేరనీ, రాజకీయాల్లో స్వయం సేవకులు ఏమి చేసినా వాటికి మేము బాధ్యత వహిస్తాం. స్వయం సేవకులకు శిక్షణ ఇచ్చిన సంఘ్‌కే అంతిమంగా "కొంత బాధ్యత" ఉంటుంది. అందువల్ల మా సంబంధం ఏమిటి, ఏ అంశాలను జాగ్రత్తగా కొనసాగించాలి అనే విషయాలను గురించి ఆలోచించాల్సి వస్తుందని" ఆయన అంటాడు. ఇప్పుడు "తేడా" ఏమంటే, ప్రధానమంత్రి గతంలో ప్రచారక్‌గా పని చేశాడు. యూనియన్ మంత్రిమండలిలో 71శాతం మంది మంత్రులకు ఆరెస్సెస్‌తో సంబంధాలు ఉన్నాయి. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కూడా చాలా మంది మంత్రులకు ఆరెస్సెస్ అనుబంధ సంస్థలు, సంఘాలతో సంబంధాలు ఉన్నాయి. ప్రభుత్వంలోని స్వయం సేవకులపై తన పర్యవేక్షణ ఉంటుందని ఆరెస్సెస్ ప్రకటించింది. ఆ "కొంత బాధ్యత" అంటే అర్థమేమిటి?"ఇక్కడ అసలు విషయం అంటే రాజకీయ పరిణామాలు మాత్రమే. ఒకవేళ ప్రజలు ఏదో ఒకటి ఆశిస్తూ, వారు ఏవైనా ఇబ్బందులు ఎదుర్కొంటూ, వాటిని మాకు తెలియజేస్తే, అప్పుడు సంబంధిత వ్యక్తుల దృష్టికి తీసుకొని వెళ్ళొచ్చు, ఒకవేళ వారు స్వయం సేవకులైతే, అంతా మేమే చేసేస్తాం."

"మేం చేసే" దానిలోని చిక్కుల్ని చూడండి. సంఘ్‌లో శిక్షణ పొందిన మూడింట రెండొంతుల మంది మంత్రివర్గ సభ్యుల పర్యవేక్షణ ("కొంత బాధ్యత"), విధానాలలో జోక్యం (శ్రద్ధతో కొన్ని విషయాలు), స్వయం సేవకులైన మంత్రులకు ఆరెస్సెస్ సిఫార్సులు (సంబంధిత వ్యక్తుల దృష్టికి తీసుకొని రావడం). అదనపు రాజ్యాంగ బద్ధమైన అధికారం అంటే ఇదే. బీజేపీ రాష్ట్ర ప్రభుత్వాలపై ఆరెస్సెస్ చెలాయిస్తున్న అధికారం రహస్యమేమీ కాదు. దీనిని ఇప్పుడు ఆరెస్సెస్ అధినేతే స్వయంగా చెప్పాడు. ఆరెస్సెస్ విధానాన్ని కొనసాగిం చడమెలా, దానికి సంబంధించిన అవగా హనను ఎలా మార్చాలన్నదే ఆరెస్సెస్ అదనపు రాజ్యాంగబద్ధమైన అధికారం, దాని ఏకపక్ష విభజన భావజాలం యొక్క లక్ష్యం."మేము మీడియాను కలుసుకునే సంద ర్భాల సంఖ్యను పెంచాం, ప్రజలకు సేవలందించే కార్యక్ర మాలను ప్రారంభించాం. కోరుకునే ఫలితాల సాధన కోసం మేం సరియైన వ్యూహంతో, సరియైన సమయంలో స్పందిం చాల్సి ఉంటుందనీ,రానున్న రోజుల్లో ఆరెస్సెస్ పై పొగడ్తల జల్లు కురిపిస్తూ, దానిపై ఉన్న ద్వేషాన్ని తగ్గించే కథలను గూర్చి వింటామని" భగవత్ చెప్పాడు.

మహిళలను పట్టించుకోని ఆరెస్సెస్

హక్కుల ఆధారిత ప్రజాస్వామిక చట్రాన్ని గుర్తించ నిరాకరించడం కూడా మహిళల గురించి చేసిన వ్యాఖ్యల్లో ప్రతిబిం బిస్తుంది. ఆరెస్సెస్ వారి దృష్టిలో మహిళ అంటే కుటుంబంలో ఒక భాగం."మహిళా విముక్తి, మహిళా సాధికారత గురించి చాలా కాలంగా మాట్లాడుతున్నారు. కానీ ఇప్పుడు పాశ్చాత్య మహిళలు, స్త్రీ పురుషులు పరస్పరం ఆధారితంగా ఉండే కుటుంబ జీవనానికి తిరిగి వస్తున్నారని" భగవత్ అంటున్నాడు. ఆరెస్సెస్ ఉద్దేశ్యంలో, ఒక స్వతంత్ర మనస్తత్వం, సాధికారత, సమాన హక్కులు గల మహిళకు కుటుంబ జీవితంతో పొసగదట. ఎందుకంటే ఆరెస్సెస్

> "మేము మీడియాను కలుసుకునే సందర్భాల సంఖ్యను పెంచాం, ప్రజలకు సేవలందించే కార్యక్రమాలను ప్రారంభించాం. కోరుకునే ఫలితాల సాధన కోసం మేం సరియైన వ్యూహంతో, సరియైన సమ యంలో స్పందించాల్సి ఉంటుందనీ,రానున్న రోజుల్లో ఆరెస్సెస్ పై పొగడ్తల జల్లు కురిపిస్తూ, దానిపై ఉన్న ద్వేషాన్ని తగ్గించే కథలను గూర్చి వింటామని" భగవత్ చెప్పాడు.

భావజాలం ప్రకారం, కుటుంబంలో మహిళలకు మనువాద విధానాల మార్గదర్శకత్వం ఉంటుంది కాబట్టి, ఎదుర్కొనబోయే హింసతో నిమిత్తం లేకుండా మహిళ సర్దుకుపోవాల్సి ఉంటుంది. ఇది, ఆరెస్సెస్ మహిళా విభాగం "రాష్ట్రీయ సేవికా సమితి" చేస్తున్న ప్రచారం. కానీ ఈ సమితి విఫలమైన ప్రణాళిక అని స్వయంగా ఆరెస్సెస్ నేత అంగీకరించినట్లు, నేడు సమితికి అంత బలం లేదు. శాఖల ద్వారా నేర్చుకునే మహిళల సంఖ్య పెరుగుతుంది కాబట్టి వారిని సేవికా సమితికి పంపకుండా నేరుగా సంఘ్‌లోకి ఇముడ్చుకోవడం ఎలా అనే విషయాన్ని ఆరెస్సెస్ కసరత్తు చెయ్యాలని ఇప్పుడు ఆయన కొత్తగా చెపుతున్నాడు.

మహిళలను నేరుగా సంఘ్‌లోకి నియమించుకునేందుకు, ద్వేషపూరిత ప్రసంగాలు, రెచ్చగొట్టే ప్రకటనలు చేసే ప్రజ్ఞాఠాకూర్ లాంటి హిందూత్వ దళానికి చెందిన మహిళా సభ్యులు ఆరెస్సెస్‌కు ఆదర్శంగా ఉన్నారు. పిల్లలపై జరుగుతున్న లైంగికదాడులతో పాటు మహిళలపై పెరుగుతున్న హింస, అదనపుకట్నం మరణాలపై సంఘ్ నేత మౌనం వహిస్తున్నాడు. ఆరెస్సెస్‌లోకి మహిళల్ని చేర్చేది మహిళల హక్కుల కోసం కాదు, కానీ ఆరెస్సెస్‌లోకి మహిళలను నేరుగా చేర్చుకోవడం ద్వారా ద్వేషపూరిత భావజాలాన్ని వ్యాప్తి చేసే ఉద్దేశంతో మాత్రమే.

ఒక లౌకిక, ప్రజాస్వామిక భారతదేశం కోసం స్వాతంత్ర్యపోరాట విలువలకు కట్టుబడి ఉండే వారికి, ఆరెస్సెస్ అధినేత ఇంటర్వ్యూ ఒక హెచ్చరిక. పెట్టుబడి దారీ వ్యవస్థ విధ్వంసాలు రాజ్యాంగం ఇచ్చిన అనేక వాగ్దానాలు అమలుకాకుండా చేయడంతో తిరిగి ప్రతిచర్య శక్తులు పెరిగిపోయాయి. ఈ ఇంటర్వ్యూలో చెప్పినట్లు ఈ శక్తులు మోడీ ప్రభుత్వ అండదండలతో రాజ్యాధికారం పై అదుపును సాధించాయి. దీనికి సమాధానం ప్రత్యా మ్నాయ విధానాల్లో, ప్రజా సమీకరణల్లో, హిందూత్వ ఆధునీకరణ ఎజెండాను ఓడించేందుకు, ప్రతిఘటనాశక్తిని నిర్మించడంలో, పెట్టుబడిదారీ లూటీకి వ్యతిరేకంగా ప్రజల హక్కులను రక్షించే చర్యల్లో ఉంటుంది.

- అనువాదం: బోడపట్ల రవీందర్, 9848412451

పాత పెన్షన్ విధానంపై బీజేపీ ప్రభుత్వదాడి


> ఈ విధంగా ఉద్యోగులు, కార్మికులకు ప్రయోజనం కలిగించే పాత పెన్షన్ విధానానికి తిరిగిపోవటానికి చేస్తున్న ప్రయత్నాలను సరళీకరణ విధానాల సమర్థకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ప్రధాని నరేంద్రమోడి, బిజెపి నాయకత్వం అంతా పాత పెన్షన్‌కు తిరిగిపోవటానికి వ్యతిరే కంగా ప్రచారం చేస్తున్నారు. ఈ విధానాన్ని అమలు చేయటం అంటే రానున్న తరాల భవిష్యత్‌ను తాకట్టు పెట్టటమేనని వీరంతా వాదిస్తున్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తే ప్రభుత్వాలకు అయ్యే ఖర్చు ఎంత, పెరుగుతున్న జిడిపి, ప్రభుత్వ ఆదాయాలు తదితరాలను పరిశీలిస్తే ఈ వాదనలోని డొల్లతనం బయటపడుతుంది.

పాత పెన్షన్ విధానానికి తిరిగిపోవ టానికి వ్యతిరేకంగా కేంద్ర-రాష్ట్ర ప్రభు త్వాలు, బడా పెట్టుబడిదారులు, వారికి అనుకూలంగా ఉన్న మీడియాతో పాటు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) కూడా రంగంలోకి దిగింది. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తే ప్రభుత్వ వనరులపై తీవ్ర ఒత్తిడి పడుతుందని రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించింది. నూతనంగా ఎన్నికైన హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం తమ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు జరుపుతామని ప్రకటించిన కొద్దిరోజులకే ఆర్‌బిఐ ఈ ప్రకటన చేసింది. విద్య, వైద్యం, కాలుష్యరహిత విద్యుత్, మౌలిక వసతుల రంగాల్లో పెట్టుబడులకు రాష్ట్రాలు ప్రాధాన్యత ఇవ్వాలని, ఇతర పథకాలకు పెట్టే ఖర్చులు పోనూ మిగతా మొత్తాన్ని పెట్టుబడులకు కేటాయించాలనే ఆలోచన సరైనది కాదని "భారతదేశంలో పెట్టుబడుల పెంపుదల- రాష్ట్రాల పాత్ర" అంశంపై రూపొందించిన నివేదికలో ఆర్‌బిఐ పేర్కొంది. పాత పెన్షన్ విధానానికి తిరిగిపోవద్దని, సిపిఎస్‌నే అమలు చేయాలని రాష్ట్రాలపై ఒత్తిడి చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఈమధ్యనే రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖ రాసింది.

ఈ విధంగా ఉద్యోగులు, కార్మికులకు ప్రయోజనం కలిగించే పాత పెన్షన్ విధానానికి తిరిగిపోవటానికి చేస్తున్న ప్రయత్నాలను సరళీకరణ విధానాల సమర్థకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ప్రధాని నరేంద్రమోడి, బిజెపి నాయకత్వం అంతా పాత పెన్షన్‌కు తిరిగిపోవటానికి వ్యతిరే కంగా ప్రచారం చేస్తున్నారు. ఈ విధానాన్ని అమలు చేయటం అంటే రానున్న తరాల భవిష్యత్‌ను తాకట్టు పెట్టటమేనని వీరంతా వాదిస్తున్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తే ప్రభుత్వాలకు అయ్యే ఖర్చు ఎంత, పెరుగుతున్న జిడిపి, ప్రభుత్వ ఆదాయాలు తదితరాలను పరిశీలిస్తే ఈ వాదనలోని డొల్లతనం బయటపడుతుంది.

ప్రస్తుతం లభిస్తున్న సమాచారం ప్రకారం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు 48 లక్షలు, ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులు 10 లక్షలు, ప్రభుత్వబ్యాంకుల ఉద్యోగులు 8 లక్షలు, రాష్ట్ర ప్రభు త్వాల ఉద్యోగులు 1.32 కోట్లు. మొత్తం కలిపితే 1.98 కోట్లమంది ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు మనదేశ జనాభాలో సుమారుగా 1.5 శాతం, 50 కోట్లమంది శ్రామిక ప్రజలలో 4శాతంగానూ ఉన్నారు. 2014లో పెన్షన్ పొందుతున్న రిటైరైన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు 51.96 లక్షల మంది ఉన్నారు. వీరిలో రక్షణరంగంలో పనిచేసి పెన్షన్లు పొందుతున్నవారు 46.5 శాతం ఉన్నారు. త్రివిధ సైనిక బలగాలలో ఉన్నవారు తక్కువ వయసుకే రిటైరవటం వారిలో పెన్షనర్ల శాతం ఎక్కువగా ఉండటానికి కారణం.రిటైరయిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షన్లు చెల్లించటం కోసం కేంద్ర ప్రభుత్వం 2013-14లో 1,04,000 కోట్ల రూపాయలు ఖర్చు చేసింది.ఇందులో 44శాతం రక్షణ బలగాల నుండి రిటైరైన వారికి చెల్లించారు. మొత్తం వ్యయంలో 7.8 శాతం జీతాలకు, 4.6 శాతం పెన్షన్లు చెల్లించటానికి కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేసింది.

కేంద్ర ప్రభుత్వం 2021-22 బడ్జెట్ ను 34,83,236 కోట్ల వ్యయంగా ప్రతి పాదించింది. 2019-20 ఫైనల్‌గా జరిగిన వ్యయం లెక్కల కన్నా ఇది 14 శాతం అధికం. దీనిలో ప్రణాళికేతర ఖర్చు 29,29,000 కోట్ల రూపాయలు. ఇది 12 శాతం అధికం. ప్రణాళిక ఖర్చు 5,54,236 కోట్ల రూపాయలు.ఇది 29శాతం అధికం. పెరుగుతున్న ప్రభుత్వ ఆదాయాలు, ఖర్చులు పెన్షన్లకు ఖర్చు పెడుతున్న మొత్తం కంటే అనేక రెట్లు అధికంగా ఉన్నాయని పై లెక్కలు వెల్లడిస్తున్నాయి. సంఘటితరంగంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల శాతం క్రమంగా తగ్గిపోతున్నది. 1994లో సంఘటితరంగ



ఉద్యోగులలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు 12.4 శాతం ఉండగా, 2012 నాటికి 8.5 శాతంకు తగ్గిపోయారు.

భవిష్యత్‌లో తగ్గనున్న పెన్షన్ భారం

2022 సంవత్సరంలో మనదేశ జీడిపి 3.469 లక్షల కోట్ల డాలర్లు. రూపాయల్లో 284 లక్షల 45వేల 8 వందల కోట్ల రూపాయలు. దీనిలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్లకు చెల్లించేది 1.20 లక్షల కోట్ల రూపాయలు. మొత్తం జీడిపిలో 0.4 శాతం ఉంటుంది. మొత్తం ఉద్యోగులలో రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులు 66 శాతం ఉన్నారు. కేంద్రం చెల్లిస్తున్న నిష్పత్తిలో వారి పెన్షన్లకు మరో 2.40 లక్షల కోట్ల రూపాయలు అవుతుంది. ఇది జీడిపిలో 0.8 శాతం. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పెన్షన్లకు చెల్లించేది జీడిపిలో 1.2 శాతం అవుతుంది. జనాభాలో 1.5శాతంగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబసభ్యులను కూడా కలుపుకుంటే 6 శాతం అవుతారు. మొత్తం జీడిపిలో 1.2 శాతాన్ని శ్రామికశక్తిలో 4 శాతంగా ఉన్న ప్రభుత్వోద్యోగుల పెన్షన్ కోసం ఖర్చు పెట్టలేమని చెప్పటం హస్యాస్పదం. ఈ వాదన ఉద్యోగులకు వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టటానికి ఉద్దేశించినది. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తే భవిష్యత్‌లో భరించలేని భారం అవుతుందని వాదిస్తున్నారు. దేశ జీడిపి పెరుగుదల, ప్రభుత్వాల ఆదాయం, ఖర్చులలో పెన్షన్ చెల్లింపులకు చేస్తున్న ఖర్చు అతి తక్కువగా ఉండటం వలన ఇపుడివ్వలేమని చెబితే హాస్యాస్పదంగా ఉంటుంది కాబట్టి భవిష్యత్ పేరుతో పాత పెన్షన్ విధానాన్ని వ్యతిరేకిస్తు న్నారు. సంవత్సరానికి 6 శాతంకు పైగా పెరుగుతున్న జిడిపి, తగ్గుతున్న ప్రభుత్వోద్యోగుల సంఖ్య కారణంగా భవిష్యత్‌లో ఇప్పటికన్నా పెన్షన్ భారం బాగా తగ్గుతుంది. పాత పెన్షన్ విధానం ద్వారా జనాభాలో 6శాతంగా ఉన్న ప్రభుత్వోద్యోగుల కుటుంబాలకు జీవన భద్రత లభిస్తుంది.

ప్రస్తుతం ప్రపంచంలో ఐదవ స్థానంలో ఉన్న మన జీడిపి రానున్న సంవత్సరాలలో చైనాను అధిగమిస్తుందని ఏలికలు గొప్పలు చెప్పుకుంటున్నారు. తక్కువలో తక్కువ 2022-23లో జీడిపి 6 శాతానికి మించి పెరుగుతుందని అంచనాలు వేస్తున్నారు. ఆ లెక్కన పెరిగినా ఈ దశాబ్దం చివరికి మన జీడిపి రెట్టింపుకు పైగా పెరుగుతుంది. అదే నిష్పత్తిలో ప్రభుత్వాల ఆదాయం కూడా పెరుగుతుంది. కాని ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య పెరగకపోగా తగ్గుతున్నది.కాబట్టి రానున్న సంవత్స రాలలో జీడిపి, ప్రభుత్వాల ఆదాయాలలో ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్‌లకు చెల్లించే మొత్తం తగ్గుతుంది. కాని ఈ విషయాన్ని కప్పిపెట్టి, రానున్న కాలంలో ఉద్యోగులకు చెల్లించే పెన్షన్ భారం పెరుగుతుందని, ఆదాయం మాత్రం ఇపుడున్నంతే ఉంటుందన్న అబద్ధాలను ప్రచారం చేస్తూ ప్రభుత్వాలు ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయి.

ఉద్యోగులకు పెన్షన్ చెల్లించటంపై ఇంత గగ్గోలు పెడుతున్న ప్రభుత్వాలు, సరళీకరణ విధానాలను సమర్థించే మేధావులు, ఆర్థికవేత్తలు మోడి ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాల వలన పెరుగుతున్న జీడిపిలో సింహభాగం బడా పెట్టుబడిదారుల చేతుల్లోకి పోవటాన్ని గురించి మాత్రం నోరు మెదపటం లేదు. ప్రభుత్వ విధానాల వలన అదాని, అంబాని లాంటి బడా పెట్టుబడిదారులు దేశ సంపదను తమ స్వంతం చేసుకుంటున్నారు. అదాని ఆదాయం గంటకు 100 కోట్లు దాటిపోగా, అంబాని గంటకు 90 కోట్ల రూపాయలకు పైగా సంపదను స్వంతం చేసుకుంటున్నాడు. వీరిరువురి ఆదాయం కలిపితే రోజుకు 5,000 కోట్ల రూపాయలకు పైగా ఉంటుంది. వీరికి 24 రోజులలో వచ్చే ఆదాయంతో రిటైరయిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ సంవత్సరం పాటు పెన్షన్ చెల్లించవచ్చు. మరో 48 రోజుల ఆదాయంతో అన్ని రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులందరికీ సంవత్సరం పాటు పెన్షన్ చెల్లించవచ్చు.

అందువలన ఉద్యోగులకు పెన్షన్ చెల్లించటం భారం అవటం వలన కాక, మొత్తం ఆదాయాన్ని అదాని, అంబాని లాంటి బడా పెట్టుబడిదారులకు తరలించటానికి ఆటంకంగా ఉంటుందనే పాత పెన్షన్ విధానానికి తిరిగిపోవటాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యతిరేకిస్తున్నది. బడా పెట్టుబడిదారులకు ఏజంట్లుగా పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అదే దారిలో నడుస్తు న్నాయి. కేవలం పెన్షన్‌లపైనే కాక, ప్రభుత్వ ఉద్యోగుల జీతాలపై కూడా దాడి చేస్తున్నాయి.

అందుకే సరళీకరణ విధానాలతో ప్రభుత్వోద్యోగుల పెన్షన్‌పైనే కాక, జీతాలు, ఇతర సదుపాయాలపై కూడా దాడి చేస్తున్నారు. ఈ దాడిని ప్రతిఘటించి, తిప్పికొట్టకపోతే ఉద్యోగ భద్రతతో పాటు అన్నింటినీ హరిస్తారు. అందుకే పాత పెన్షన్ విధానంపై ప్రభుత్వాల దాడిని ప్రతి ఘటించటం అత్యవసరం. ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలుకాకపోతే ప్రైవేటు రంగంలో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు పెన్షన్ ఊసే ఉండదు. అందువలన పెత పెన్షన్ విధానం కావాలని ప్రభుత్వ ఉద్యోగులు చేస్తున్న పోరాటాన్ని ప్రైవేటురంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు సంపూర్ణంగా బలపరచాలి.

- ఎ. కోటిరెడ్డి

వారికేం తెలియదు!

బురుజుల మీదా,
కోటగోడల మీదా,
అద్భుతమైనశిల్పాలమీదా,
తరాల తరబడి నిలబడిన
వారసత్వ నిర్మాణాల మీదా..

చదువుగాకుండా కేవలం
అక్షరాస్యత కలిగిన
ఆకతాయి కుర్రాళ్లు తమ
పేరుని, ప్రియు రాలి
పేరునీ, తోటి సావాసగాళ్ల
పేర్లనీ పక్కన కన పడిన
రాయో, రప్పో తీసుకుని
చెక్కుతూ ఉంటారు.
నిజానికి అదివాళ్ల
సొంతమని చెక్కరు.కేవలం
తమ ఉనికిని గుర్తించమని
చెక్కు తారు.నిజానికి వాళ్లు
అక్కడ నుంచి కదిలిపోయిన
మరు క్షణమే వాళ్లేవరో
కూడా ఎవరికీ తెలియదు.

వాళ్లకి చరిత్ర తెలి యదు,
వారసత్వం తెలి యదు,
నాగరి కత, సంస్కృ తులు
తెలియదు, కనీసం శ్రమ
విలువ కూడా గుర్తించలేరు!

మనకు నిర్మించదానికి చేత
కానప్పుడు, నిర్మించిన
దానిమీద మనపేరు రాసు
కుని, తద్వారా దాని
విలువని పతనం చేస్తున్నా
మనే కనీస స్పృహ లేకుండా
గుర్తింపు పొందాల
నుకోవడం ఆకా
తయితనం, బాధ్యతా
రాహిత్యం, దిగ
జారుడుతనం.

-సిద్దార్థి సుభాష్ చంద్రబోస్

మీల్ మేకర్‌తో వంటలు

మీల్ మేకర్ గురించిన ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. తక్కువ సమయంలో వంట చేయాల్సి వచ్చినప్పుడు వంటింట్లో గృహిణిని ఆదుకునేది వచ్చినప్పుడు వంటింట్లో గృహిణిని ఆదుకునేది ఇదే. దీంతో చేసిన వంటకాలను పిల్లలతో పాటు పెద్దలు కూడా ఎంతో ఇష్టంగా తింటారు. నాన్‌వెజ్‌కు అంతగా ఇష్టపడని వారు దీన్ని మరింత ఇష్టంగా తింటారు. ఇందులో పోషక విలువలు కూడా ఎక్కువేనని అంటున్నారు నిపుణులు. అలాంటి మీల్‌మేకర్‌తో కొన్ని రుచికరమైన వంటలు మీ కోసం...


ఖీమా హల్వా



కావల్సిన పదార్థాలు: మీల్ మేకర్ ఖీమా - అర కిలో, చక్కెర - కప్పు, క్యారెట్ లేదా బీట్‌రూట్ తురుము - ఒక కప్పు, నెయ్యి - వంద గ్రాములు, ఇలాచీ పొడి - చిటికెడు, జీడిపప్పు, ఎండు ద్రాక్ష - 25 గ్రాములు, పాలు - రెండు కప్పులు.

తయారు చేసే విధానం: ముందుగా మీల్ మేకర్‌లో కొద్దిగా ఉప్పు వేసి ఐదు విజిల్స్ వచ్చే వరకు ఉడికించి జార్‌లో ఖీమా బ్లేడ్ పెట్టి ఖీమాలాగా చేసిపెట్టుకోవాలి. స్టవ్ మీద బాణలి పెట్టి నెయ్యి వేసి డ్రైఫ్రూట్స్ వేయించి పక్కన బెట్టుకోవాలి. క్యారెట్ తురుము వేయించి పక్కన పెట్టుకోవాలి. అదే బాణలిలో పాలు పోసి బాగా వేడి చేసి అందులో చక్కెర, వేయించిన క్యారెట్ తురుము, ఉడికించిన ఖీమా వేసి తిప్పుతూ బాగా మెత్తగా ఉడకనిచ్చి ఇలాయి పొడి వేసి నెయ్యి తేలేలాగా దగ్గర కానివ్వాలి. దించే ముందు వేయించిన డ్రైఫ్రూట్స్ వేసి దించాలి. ఇది కొద్దిగా చల్లారాక సర్వ్ చేసుకోవాలి. వెరైటీగా, రుచిగా ఉంటుంది.

పులావ్



కావల్సిన పదార్థాలు: మీల్ మేకర్ - 250 గ్రాములు, బాస్మతి బియ్యం - 250 గ్రాములు, నెయ్యి లేదా నూనె - వంద గ్రాములు, ఉప్పు - ఒక టేబుల్ స్పూను, దాల్చిన చెక్క - ఒక ముక్క, అల్లం - 25 గ్రాములు, వెల్లుల్లి రెబ్బలు - ఒక గుప్పెడు, యాలకులు - మూడు, లవంగాలు - పదిహేను, బిర్యానీ ఆకులు - రెండు, పుదీనా - నాలుగు రెబ్బలు, కొత్తిమీర - నాలుగు రెబ్బలు, పచ్చిమిర్చి - నాలుగు, ఉడికించిన గ్రీన్‌పీస్ - 50 గ్రాములు, ఆలుముక్కలు - చిన్న కప్పు, ఉల్లి తరుగు - చిన్న కప్పు.

తయారు చేసే విధానం: ముందుగా ఆలు ముక్కలు, గ్రీన్ పీస్, మీల్‌మేకర్ విడివిడిగా ఉడికించుకోవాలి. స్టవ్‌పై చిన్న కుక్కర్ పెట్టి నెయ్యి, నూనె పోసి కొద్దిగా వేడి చేయాలి. ఇలాచి, దాల్చిన చెక్క, సగం అల్లం, సగం వెల్లుల్లి పేస్ట్ వేసి వేయించాలి. అందులోనే బిర్యానీ ఆకులు, కొత్తిమీర, పుదీనా, ఉల్లితరుగు వేసి వేయించాలి. ఆ తర్వాత మిగతా అల్లం, వెల్లుల్లి పేస్ట్ వేసి మంచి వాసన, రంగు, రుచి వచ్చేదాకా వేయించి, గ్రీన్ పీస్, ఆలు ముక్కలు, మీల్‌మేకర్ ముక్కలు ఉడికించినవి వేసి వేయించి తగినంత నీరు (రెండు కప్పులు), ఉప్పు వేసి కడిగిన బియ్యం వేసి నాలుగు విజిల్స్ వచ్చే వరకు ఉంచాలి. మంచి సోయా పులావ్ రెడీ. దీన్ని మీల్‌మేకర్ ఖుర్మా లేదా బఠానీ ఖుర్మా లేదా పుదీన చట్నీతో తినవచ్చు. చాలా రుచిగా ఉంటుంది. దీన్ని వండడం కూడా చాలా తేలియక.

పకోడి



కావల్సిన పదార్థాలు: మీల్ మేకర్ గ్రాన్యూల్స్ - అరకప్పు, ఉల్లిగడ్డలు - మూడు (సన్నగా తరగాలి), పచ్చిమిర్చి - ఐదు (సన్నగా తరగాలి), కొత్తిమీర - కట్ట, కరివేపాకు - నాలుగైదు రెబ్బలు, జీలకర్ర - చెంచా, కందిపప్పు పొడి - పావుకప్పు కన్నా ఎక్కువ, ఉప్పు - తగినంత, నూనె - వేయించడానికి సరిపడా.

తయారు చేసే విధానం: మీల్ మేకర్ గ్రాన్యూల్స్‌ని ఉడికించి నీళ్ల పిండేసి ఓ గిన్నెలోకి తీసుకోవాలి. అందులో నూనె తప్ప మిగిలిన పదార్థాలన్నీ వేసుకుని బాగా కలపాలి. కావాలనుకుంటే కొద్దిగా నీళ్ల కూడా చల్లుకోవాలి. ఈ మిశ్రమాన్ని పకోడీల్లా వచ్చేలా కాగుతున్న నూనెలో వేసి వేయించుకోవాలి. బాగా వేగాక తీసుకుంటే సరిపోతుంది.

దాల్చా



కావల్సిన పదార్థాలు: మీల్ మేకర్ - వంద గ్రాములు, కందిపప్పు - 50 గ్రాములు, కొబ్బరి - చిన్న ముక్క, కొత్తిమీర - నాలుగు రెమ్మలు, టమాటాలు - నాలుగు, చింతపండు రసం - ఒక కప్పు, ఉల్లి తరుగు - అర ఉల్లిగడ్డ, ఉప్పు - అర టీ స్పూను, కారం - ఒక టీ స్పూను, ధనియాల పొడి - మూడు టీ స్పూన్‌లు, పసుపు - చిటికెడు.

తయారు చేసే విధానం: ముందుగా మీల్ మేకర్ ఉడికించి పెట్టుకోవాలి. అలాగే కందిపప్పు కూడా ఉడికించుకోవాలి. స్టవ్ మీద కుక్కర్ చిన్నగా పెట్టి ఉడికించిన ఖీమా, ఉప్పు, పసుపు, రెండు రెమ్మల కొత్తిమీర తరుగు వేసి ఒక నిమిషం సన్నని సెగ మీద తిప్పాలి. ఆ తర్వాత టమాట ముక్కలు వేసి మెత్తగా ఉడకనివ్వాలి. కొబ్బరి మిశ్రమం, కంది పప్పు, చింతపండు రసం వేసి పది నిమిషాలు ఉడకనివ్వాలి. అంతే కమ్మని మీల్‌మేకర్ దాల్చా రెడీ. ఇది అన్నం, రోటీ, పూరీ ఎందులోకైనా రుచిగా ఉంటుంది. ఆయిల్ లేకుండా కూడా దీన్ని వండవచ్చు.


ఆనందం కోసం...

ఇంటా బయటా ఎన్ని పనులు, ఎంత ఒత్తిడి ఉన్నా మన గురించి మనం శ్రద్ధ తీసుకోవడం కూడా అవసరమే. మనం ఆనందంగా ఉంటూ ఇతరుల మన్ననలందుకోవాలంటే శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండాలి. అందుకోసం ఈ తేలికైన సూత్రాలు పాటించమంటున్నారు సైకాలజిస్టులు.



- రోజూ చేసే వంటే, నిత్యం వెళ్లే ఆఫీసే అయినా అవి రొటీన్‌గా, మొక్కుబడిగా మారకుండా చూసుకోవాలి. దేనిమీదైనా ఆసక్తీ, అనురక్తీ ఉన్నప్పుడు నీరసం, నిస్సత్తువా తలెత్తవు. కొత్తదనాన్ని జోడించుకుంటాం. మెరుగుదల కోసం ప్రయత్నిస్తాం.
- బయట దొరికే సౌందర్య సాధనాల్లో రసాయనాలు ఉంటాయి కనుక అవి మేలు కంటే కీడే చేస్తాయి. పాలు, తేనె, పసుపు, పండ్ల గుజ్జు, కూరగాయల చెక్కు.. ఇలా సహజమైనవాటితో ఫేస్‌ప్యాక్ వేసుకోండి. ముఖం అందంగా, ఆరోగ్యంగా ఉంటుంది, డబ్బు ఆదా చేసినట్లూ అవుతుంది.
- టీవీ, మొబైల్ రోజుల్లో పుస్తకాలేంటి అనుకోకుండా రోజులో అరగంటయినా పుస్తకం చదవండి. అది ఎంత ప్రశాంతత నిస్తుందో మీకే అర్థమవుతుంది.
- చిన్న గంధపు చెక్కలను వార్డ్‌రోబ్ అరల్లో పెట్టండి. సూక్ష్మ క్రిములు చేరకపోవడమే కాదు, దుస్తుల పరిమళం మనసుకు హాయి కలిగిస్తుంది.

నిద్ర కరువైందా..?



లైఫ్ స్టైల్ మారిపోయింది. కడుపు నిండా తిండి, కంటి నిండా నిద్ర కరవైంది. దీంతో అనేక రకాల వ్యాధులు చుట్టుముడుతున్నాయి. ముఖ్యంగా నిద్ర అనేది.. వ్యక్తి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. కాబట్టి రోజుకు 8 గంటలు..

లైఫ్ స్టైల్ మారిపోయింది. కడుపు నిండా తిండి, కంటి నిండా నిద్ర కరవైంది. దీంతో అనేక రకాల ఆరోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. ముఖ్యంగా నిద్ర అనేది.. వ్యక్తి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. కాబట్టి రోజుకు 8 గంటలు నిద్రపోవడం చాలా అవసరం. అయితే.. చాలా మంది నిద్రలేమితో బాధపడుతుంటారు. అలా ఎందుకు జరుగుతుందనే విషయంపై నిపుణులు కొన్ని వివరాలు వెల్లడించారు. మెలటోనిన్ హార్మోన్ బ్యాలెన్స్ అనేది.. నిద్ర-మేల్కొనే విధానాన్ని నిర్వహించే చీకటికి ప్రతిస్పందనగా మెదడు ఉత్పత్తి చేసే హార్మోన్. రాత్రి సమయంలో అధిక కాంతి కారణంగా ఈ హార్మోన్ సక్రమంగా ఉత్పత్తి అవదు. దీంతో నిద్రలేమి, ఆందోళన, ఒత్తిడి వంటి ఇబ్బందులు వస్తాయి. నిద్రవేళలో స్మార్ట్‌ఫోన్‌లు, ఇతర గాడ్జెట్‌లను విపరీతంగా ఉపయోగించడం వల్ల నిద్రపోయే విధానాన్ని ప్రభావితం చేసే సాధారణ అలవాటుగా మారింది. నిద్రపోయే ముందు ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌ల వాడకాన్ని నివారించాలి.

ఒత్తిడి, మానసిక ఆరోగ్య సమస్యలు: చాలా సార్లు ఒకరు అలసిపోయినట్లు అనిపించవచ్చు. కానీ నిద్రపోవడం అనేది ఒకే స్థితిలో ఉండటానికి ప్రయత్నిస్తున్నప్పుడు అసౌకర్యం కలుగుతుంది. ఇవి ఒత్తిడి, మానసిక ఆరోగ్య సమస్యల లక్షణాలు. అసౌకర్యం లేదా ఒత్తిడిని సృష్టించే సమస్యలను విశ్లేషించాలి. అందుకు గల కారణాలను తెలుసుకోవాలి. ఈ సమస్యను అధిగమించడానికి నిపుణులను సంప్రదించాలి.

ఆలస్యమైన నిద్ర: రోజూ ఒకే సమయంలో నిద్రపోయేలా ఏర్పాటు చేసుకోవాలి. తద్వారా మన శరీరం ఆ సమయానికి అలవాటు పడిపోతుంది. ఒక్కోసారి మనం అస్థిరమైన షెడ్యూల్‌ని కలిగి ఉండవచ్చు. ఇది మన సాధారణ నిద్రా సమయాలను ఆలస్యం చేయవచ్చు. కానీ దానిని అలవాటుగా చేసుకోవడం వల్ల మన శరీరంపై ఇబ్బందులు ఏర్పడతాయి.

స్లీప్ అప్నియా: స్లీప్ అప్నియా నేడు సాధారణ ఆరోగ్య సమస్యలలో ఒకటిగా మారింది. ముఖ్యంగా నిద్రపోయేటప్పుడు గురక పెట్టే వ్యక్తులు మరింత అప్రమత్తంగా ఉండాలి. ఎందుకంటే వారిలో చాలామంది నిద్రకు అంతరాయం కలిగి ఉంటారు. స్లీప్ అప్నియా లక్షణాలలో ఇది ఒకటి. లక్షణాలు అధికంగా ఉంటే వైద్య నిపుణుడిని సంప్రదించాలి.

గోరువెచ్చటి నీటితో...



నిత్యం చన్నీళ్లను తాగడం వల్ల మన ఆరోగ్యానికి కలిగే మేలు కంటే కీడే ఎక్కువ. చల్లని నీరు అనేక వ్యాధులకు ఆహ్వానం పలుకుతాయి. అందుకే వైద్యులు.. పరకడుపునే వేడినీళ్లను తాగితే ఎన్ని ప్రయోజనాలో.. తెలిస్తే తాగకుండా ఉండలేరు..

- ఉదయం నిద్రలేవగానే.. లేదా కాలకృత్యాలు తీర్చుకోడానికి ముందే 2 లేదా 3 గ్లాసుల గోరు వెచ్చని నీరు తాగండి. నీటిని వేగంగా తాగేయకుండా.. నోటిలోనే ఉంచుకుంటూ గుటకలు వేస్తూ తాగండి. రోజూ ఉదయం నిద్రలేవగానే వేడి నీళ్ల తాగడం వలన చాలా వరకూ బరువు తగ్గుతారు. అంతేకాక మీ శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. సీజన్స్‌లో వచ్చే వైరల్ ఇన్ఫెక్షన్స్ నుంచి వేడినీరు మన శరీరాన్ని రక్షిస్తుంది. అంతేకాకుండా.. ఉదయాన్నే వేడి నీళ్ల తాగడం వలన రోజంతా ఉత్సాహంగా ఉంటారు. చాలామంది బరువు తగ్గడానికి వేడి నీళ్ల తాగుతారు. అయితే ఉదయంతో పాటు రాత్రిళ్ల కూడా వేడి నీళ్ల తాగితే సులభంగా బరువు తగ్గుతారు.
- క్రమం తప్పకుండా వేడినీళ్లను తాగడం వల్ల శరీరంలోని అదనపు కొవ్వు కరుగుతుంది. ఉబకాయం, కొలెస్ట్రాల్ సమస్యలు ఉన్నవారు వేడి నీరు తాగడం చాలా మంచిది. అంతేకాక వేడినీరు తాగడం వలన అజీర్తి సమస్యలు తొలగిపోవడమే కాక జీర్ణశక్తి మెరుగుపడుతుంది. ఆహారాన్ని జీర్ణం చేసుకోవడానికి కడుపులో నుంచి బయటకు వచ్చే జీర్ణరసాల స్రావాన్ని వేడి నీరు పెంచుతుంది. ఫలితంగా శరీరంలో గ్యాస్, ఎసిడిటీ సమస్యలు తగ్గడమే కాక మలబద్ధకం సమస్యకు దూరంగా ఉండవచ్చు.

పెన్షన్ సంస్కరణలను నిరసిస్తూ ఫ్రాన్స్‌లో భారీ ప్రదర్శన

పారిస్ : వివాదాస్పద పెన్షన్ సంస్కరణలను వ్యతిరేకిస్తూ ఫ్రాన్స్‌లో ప్రజలు భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. 25 లక్షల మందికి పైగా ప్రజలు ఈ ప్రదర్శనలో పాల్గొన్నట్టు ఫ్రెంచ్ ట్రేడ్ యూనియన్ పేర్కొంది. దేశవ్యాప్తంగా 1.27 మిలియన్ ప్రజలు వీధుల్లో మంగళవారం ప్రదర్శన చేపట్టినట్టు ఫ్రెంచ్ అంతర్గత మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ నెల 7, 11 తేదీల్లోనూ ఆందోళనలు చేపట్టాలని ఫ్రెంచ్ యూనియన్స్ పిలుపునిచ్చాయి. ఈ నెల 6, 7, 8 తేదీల్లో రిఫైనరీల్లో సమ్మెను కొనసాగించాలని ఫ్రాన్స్‌లోని అతిపెద్ద యూనియన్ జనరల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ లేబర్ (సీజీటీ) ప్రకటించింది. కొన్ని రిఫైనరీలలో ఉత్పత్తిని నిలిపివేసే అవకాశం ఉందని టోటల్ ఎనర్జీస్ కో ఆర్డినేటర్ ఎరిక్ సెల్లిని పేర్కొన్నారు. ఈ వివాదాస్పద సంస్కరణ పదవీ విరమణ వయస్సు క్రమంగా ఏడాదికి మూడు నెలలు పెంచుతుంది. దీంతో 2030 నాటికి పదవీవిరమణ వయస్సు 62 ఏండ్ల నుంచి 64కు చేరుతుంది. అయితే పెన్షన్ సంస్కరణలపై లేవనెత్తిన ప్రశ్నలను మరియు సందేహాలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకుందని ఫ్రెంచ్ ప్రధాన మంత్రి ఎలిసబెత్ బోర్న్ తెలిపారు. పార్లమెంటులో చర్చ ప్రారంభమవుతుందనీ, ఈ పథకం పారదర్శకంగా అమలు చేసేందుకు అవకాశం లభిస్తుందని అన్నారు.ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మాక్రాన్ ప్రవేశపెట్టిన వివాదాస్పద పెన్షన్ సంస్కరణలను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ ఏడాది ప్రారంభం నుండి కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున నిరసన చేపడుతున్నాయి. జనవరి 31న జరిగిన సమ్మె హింసాత్మకంగా మారిన సంగతి తెలసిందే. ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో నిరసనకారులు, పోలీసుల మధ్య ఘర్షణలు చెలరేగాయని, పోలీసులు టియర్‌గ్యాస్, పొగ బాంబులను ప్రయోగించినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి.

సీఎం సాబ్... ఇచ్చిన హామీని నిలబెట్టుకోండి...

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వీఆర్ఏలకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను అమలు చేయాలనీ, లేకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వీఆర్ఏల జేఏసీ నాయకులు హెచ్చరించారు. బుధవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద 'స్టేట్ వీఆర్ఏ జేఏసీ' ఆధ్వర్యంలో మౌనదీక్ష నిర్వహించారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించిన విధంగా వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేయాలనీ, 55 ఏండ్లు పైబడిన వారి వారసులకు ఉద్యోగాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అర్హత కలిగిన వీఆర్ఏలకు పదోన్నతులివ్వాలనీ, 80 రోజుల సమ్మె కాలానికి వేతనాన్ని, ఆ సమయంలో మరణించిన వారి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా, ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలనే డిమాండ్లతో బ్యానర్‌ను, ప్లకార్డులను ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి తరలొచ్చిన వీఆర్ఏలతో ధర్నాచౌక్ దద్దరిల్లింది. 80 రోజుల పాటు సమ్మె చేస్తే మునుగోడు ఎన్నికలకు ముందు ప్రభుత్వం దిగొచ్చి డిమాండ్లను నెరవేరుస్తామమంటూ హామీ ఇచ్చిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆ హామీ ఇచ్చి 100 రోజులు గడుస్తున్నా... అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయంపై సీఎం కేసీఆర్‌కు, మంత్రి కేటీఆర్‌కు, మంత్రులకు, ప్రజా ప్రతినిధులకు, ఉన్నతాధికారులకు పలుమార్లు వినతిపత్రాలిచ్చినప్పటికీ ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది బడ్జెట్ కేటాయింపుల్లో వీఆర్ఏల డిమాండ్లను తీర్చేందుకు అనుగుణంగా కేటాయింపులు చేయకపోతే గుణపాఠం తప్పదని హెచ్చరించారు. మంత్రి కేటీఆర్ నాలుగు సార్లు, సీఎస్ రెండు సార్లు చర్చించారనీ, సీఎం అసెంబ్లీలో ప్రకటించినా ఆ మేరకు జీవోలు ఇవ్వకపోవడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. మౌనదీక్షలో జేఏసీ చైర్మెన్ గడ్డం రాజయ్య, కో చైర్మెన్ రమేష్ బహదూర్, సెక్రెటరీ జనరల్ షేక్ దాదేమియా, కో కన్వీనర్లు వంగూరు రాములు, షేక్ రఫీ, మాదవ నాయుడు, వెంకటేష్ యాదవ్ తదితరులు మాట్లాడారు.

మతోన్మాదులకు అవకాశమివ్వొద్దు

డిమాండ్ల సాధన కోసం వీఆర్ఏలు చేస్తున్న పోరాటానికి కేవీపీఎస్ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు మౌనదీక్షనుద్దేశించి ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో ఏ చిన్న అసంతృప్తి ఉన్నా..దాన్ని ఉపయోగించుకునేందుకు మతోన్మాదులు కాచుకూర్చుంటున్నారని తెలిపారు. అలాంటి అవకాశాన్నివారికి ఇవ్వొద్దని సీఎం కేసీఆర్‌కు సూచించారు. ప్రభుత్వ మాటను గౌరవించి వీఆర్ఏలు సమ్మె విరమించారనీ, అదే రీతిలో వారికి సర్కారు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. వీఆర్ఏల పోరాటానికి చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. సమన్వయ కమిటీ తరపున మౌనదీక్షనుద్దేశించి రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పైళ్ల ఆశయ్య మాట్లాడుతూ వీఆర్ఏల సమస్యల పరిష్కరించకుండా కాలయాపన చేయడం తగదని హితవు పలికారు. వారిని విస్మరిస్తే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ తదితరులు మౌనదీక్షలో పాల్గొని, వీఆర్ఏల పోరాటానికి మద్దతు తెలిపారు.

దేశ నిర్మాణానికి బలమైన పునాది

(మొదటిపేజీ తరువాయి)

నిర్మాలా సీతారామన్, ఆమె బందానికి అభినందనలు తెలిపారు. ఈ బడ్జెట్ అణగారిన వర్గాలకు ప్రాధాన్యతనిస్తుందనీ, రైతులు, మధ్యతరగతి సహా అన్నివర్గాల కలలను సాకారం చేస్తుందన్నారు. మహిళా సాధికారత మరింత పెరిగేలా దోహదం చేస్తుందని తెలిపారు. మహిళా స్వయం సహాయక సంఘాలు వారిని మరింత మెరుగు పరుస్తాయని చెప్పారు. పన్నుల ధరలు తగ్గించి ప్రజలకు ఉపశమనం కలిగించామన్నారు. పీఎం విశ్వకర్మ కౌశల్ సమ్మాన్ విశ్వకర్మల జీవితాల్లో భారీ మార్పులను తీసుకువస్తుందని విశ్వసించారు. విశ్వకర్మల మద్దతుకు సంబంధించిన పథకాలను తొలిసారిగా బడ్జెట్‌లో పొందుపరిచామని చెప్పారు.

ప్రభుత్వ కేజీ టు పీజీ దేశంలో ఎక్కడా లేదు

(మొదటిపేజీ తరువాయి)

సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ ప్రారంభించారు. విద్యకు దూరం కావద్దని సీఎం కేసీఆర్ వేల కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేసి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేశారన్నారు. జిల్లాలో మొదటి విడత మన ఊరు - మన బడి కార్యక్రమంలో భాగంగా 230 పాఠశాలలను రూ.92 కోట్లలతో ఆధునీకరణ చేయనున్నట్టు తెలిపారు. నిర్మిల్‌లో పాఠశాలను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రారంభించారు.

మన బస్తీ-మన బడి కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లో పలు చోట్ల అభివృద్ధి చేసిన పాఠశాలలను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. పద్మారావునగర్‌లోని మైలార్‌గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని లక్ష్మినగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని రాజ్‌భవన్ ప్రాథమిక పాఠశాలలో ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు సాయన్న, దానం నాగేందర్, హైదరాబాద్ డీఈవో ఆర్.రోహిణీతో కలిసి మంత్రి ప్రారంభించారు.

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతినగర్‌లో మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి వసతులు కల్పిస్తున్నామన్నారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కమలానగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి ప్రారంభించారు.

నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం ప్రాథమిక పాఠశాల, నార్కట్‌పల్లి ప్రాథమిక పాఠశాలను పరిషత్ చైర్మెన్ బండా నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల భవనాన్ని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి కలెక్టర్ హేమంత్‌కేశవ్‌పాటిల్‌తో కలిసి ప్రారంభించారు.

ఖమ్మం నగరంలోని మామిళ్లగూడెం ప్రాథమిక పాఠశాలను రూ.12.49 లక్షలు, శాంతినగర్ ఉన్నత పాఠశాలను రూ.1.14 కోట్లతో మన ఊరు-మన బడి/మన బస్తీ-మన బడి కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి చేయగా.. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రారంభించారు.జనగామ జిల్లా దేవరుప్పల ప్రభుత్వ పాఠశాలను మంత్రి ఎర్రబెల్లి ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని కోరారు.

సమస్యలను పరిష్కరించడంలో బడ్జెట్ విఫలం

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రంపై ధ్వజమెత్తారు. అతి ధనవంతులపై పన్ను విధించాలని, మౌలిక సదుపాయాలలో పెట్టుబడుల నేపథ్యంలో యువతకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, ధరల పెరుగుదల, మందగమనాన్ని పరిష్కరించడంలో బడ్జెట్ విఫలమైందని విమర్శించారు. ప్రజల కొనుగోలు శక్తిని పెంచడంతోపాటు దేశీయంగా డిమాండ్‌ను పెంచడంపై బడ్జెట్‌లో దృష్టి సారించాలని ఆయన అన్నారు.

"ధనవంతులపైన ముఖ్యంగా లాభాన్ని ఆర్జిస్తున్న ధనవంతులపై పన్ను విధించాలి. గత రెండేళ్ళలో ఉత్పత్తి చేయబడిన సంపదలో దాదాపు 14.5 శాతం ప్రజల ఒక శాతం మంది ధనవంతుల చేతుల్లో ఉంది. వాటిపై పన్ను విధించండి" అని ఏచూరి అన్నారు.

ధనవంతులకు రాయితీలు ఇచ్చే బదులు, ప్రభుత్వం మౌలిక సదుపాయాలపై పెట్టుబడి పెట్టాలని అన్నారు. ఖర్చు చేసే యువత కోసం కోట్లాది కొత్త ఉద్యోగాలను సృష్టించాలని ఆయన అన్నారు. కాని దానికి బదులుగా ధనికులకు మరిన్ని రాయితీలు ఇచ్చారని విమర్శించారు. అత్యధిక పన్ను శ్లాబును కూడా తగ్గించారని, ఈ పన్ను రాయితీల వల్ల వచ్చే ఏడాది ఆదాయ వసూళ్ల పరంగా రూ. 35,000 కోట్ల నష్టం వాటిల్లుతుందని స్వయంగా ఆర్థిక మంత్రి ప్రకటించారని పేర్కొన్నారు.

"వేతన జీవులకు కొంత ఉపశమనం లభించడం మంచిదే. అయితే ద్రవ్యోల్బణం, సామాజిక సేవలకు కేటాయింపులు క్షీణించిన స్థితిలో, ప్రతి కుటుంబం, ప్రతి వ్యక్తి ఎక్కువ ఖర్చు చేయాల్సి ఉంటుంది.

కాబట్టి పన్ను పరంగా ఎలాంటి ఉపశమనం లభించినా ధరల పెరుగుదల, ఆరోగ్యం, విద్యతో సహా ప్రజా సేవలలో ఖర్చు తగ్గడంతో భర్తీ చేయబడుతుంది"అని విమర్శించారు. ప్రభుత్వ మూలధన వ్యయం నామమాత్రంగా ఏడు శాతం పెరిగిందని ఏచూరి అన్నారు. రాష్ట్ర, కేంద్రం సంబంధాలపై ఒత్తిడి గురించి వ్యాఖ్యానించిన ఏచూరి ఆర్థిక సమాఖ్యవాదం ఇప్పుడు తీవ్ర దాడిలో ఉందని విమర్శించారు.

"రాష్ట్రాలు తీసుకునేందుకు వీలుగా రుణాల విషయంలో రాష్ట్రాలకు జీఎస్టీ పరిహారం ఇవ్వబడింది. ఇప్పుడు రుణాలపై కొత్త షరతులు పెట్టారు. జీఎస్టీ తర్వాత రాష్ట్రాలు వనరులను పెంచుకోలేవు. కొత్త షరతుల ప్రకారం రుణాలు తీసుకోవడానికి వీలు లేదు. కాబట్టి రాష్ట్రాలను భిక్షాటనకు వచ్చేలా కేంద్రం వ్యవహరించింది" అని పేర్కొన్నారు.

"కర్నాటకకు భారీగా కేటాయించారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలకు ప్రయోజనాలు లభిస్తాయని, బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలు ఇరుకున పడతాయని చాలా స్పష్టంగా తెలుస్తోంది. కాబట్టి, ఇది మన రాజకీయాలలో గొప్ప ఒత్తిడికి దారి తీస్తుంది" అని ఏచూరి అన్నారు. అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో పెట్టుబడులు పెట్టాలని న్నారు.

అన్నీ కోతలే..

(మొదటిపేజీ తరువాయి)

నిర్మలా సీతారామన్ చెప్పారు. సప్తర్షి (సప్త రుషుల) రీతిలోనే ఉందని అభివర్ణించారు. అమృత్ కాలానికి ఇది (2023-24 బడ్జెట్) తొలి పద్దుగా వెల్లడించారు. తీయటి మాటలతో ఊరించటం తప్ప, సబ్సిడీలపై, సంక్షేమంపై మాట్లాడలేదు. గత 9ఏండ్లలో ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఆవిర్భవించిందని గొప్పలు చెప్పారు.

కేంద్ర బడ్జెట్‌లో చెప్పేదానికి చేసేదానికి మధ్య తేడాను బయటపెట్టేది 'ద్రవ్యలోటు'. ఇది జీడీపీలో 4.5శాతం దాటనివ్వమని గతంలో చెప్పారు. 2020-21లో 9.3శాతం దాటింది. 2021-22లో 6.9 శాతం, ఈ ఆర్థిక సంవత్సరంలో 6.4శాతం ఉంది. ద్రవ్యలోటు ఓ వైపు ఇలా కనపడుతుంటే 2023-24లో 5.9శాతం ఉండొచ్చునని కేంద్రం చెబుతోంది. వాస్తవానికి 7శాతం దాటుతుందని ఆర్థిక నిపుణులు అంచనావేస్తున్నారు. సవరించిన అంచనాలతో 2022-23లో కేంద్ర ప్రభుత్వ ఆదాయం రూ.24.3లక్షల కోట్లు. అలాంటిది 2023-24లో రూ.27.2లక్షల కోట్లు ఉంటుందని ఈ బడ్జెట్ అంచనావేసింది. మొత్తం ప్రభుత్వ వ్యయం రూ.45లక్షల కోట్లు ఉంటుందని పేర్కొంది. సెక్యూరిటీ బాండ్ల అమ్మకాలతో, స్మాల్ సేవింగ్స్, మార్కెట్ నుంచి మొత్తంగా రూ.15.4 లక్షల కోట్లు రుణాలు సేకరించబోతున్నామని తెలిపింది.

రాష్ట్రాలను నిరుత్సాహపరిచింది..

(మొదటిపేజీ తరువాయి)

డొల్లతనమే కనబడుతున్నదని విమర్శించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఏడు ప్రాధాన్యతారంగాలకు పెద్ద పీట వేశామని చెబుతూనే అసలు రంగాలను గాలికొదిలేశారని తెలిపారు. ప్రస్తుత బడ్జెట్ ద్వారా తెలంగాణకు మరోసారి తీవ్ర అన్యాయం చేశారని వాపోయారు. పారిశ్రామిక వాడలకు సంబంధించి తెలంగాణకు ఒక్కటంటే ఒక్కటి కూడా కొత్తగా ఇస్తామంటూ చెప్పలేదని తెలిపారు. రైతులకు సంబంధించిన నిధుల్లో భారీగా కోతలు విధించారు.. ఎరువుల సబ్సిడీలు తగ్గించారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ఉపాధి హామీ నిధుల్లో కోత పెట్టారు, ఆహార సబ్సిడీలు తగ్గించారని పేర్కొన్నారు. కేంద్ర ఆర్థిక సంఘం సిఫార్సులను అమలు చేస్తామంటూ బడ్జెట్లలో ఎక్కడా చెప్పలేదనీ, ఉద్యోగులకు, సింగరేణి కార్మికులకు ఇచ్చిన పన్ను మినహాయింపులు కూడా ఏ మాత్రం ఆశాజనకంగా లేవని తెలిపారు. ఉద్యోగులను సైతం భ్రమల్లో ముంచారని విమర్శించారు. సెస్సుల భారం తగ్గించలేదు.. పన్నుల భారం నుంచి ఉపశమనం లేదని ఆయన పేర్కొన్నారు. అందువల్ల నిర్మలా సీతారామన్ ప్రతిపాదించిన పద్దును ఆయన భ్రమల బడ్జెట్‌గా అభివర్ణించారు.

కేంద్ర బడ్జెట్‌పై హరీశ్‌రావుతోపాటు వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కూడా స్పందించారు. ఈ పద్దు రైతులకు వ్యతిరేకంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఎరువుల సబ్సిడీకి కేంద్రం మెల్లగా మంగళం పాడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఎరువులు, క్రిమి సంహారక మందులు, పెట్రోల్, డీజిల్ ధరలతో రైతులు సతమతమవుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎరువులపై సబ్సిడీలను ఎత్తేస్తే వారిపై మరింత భారాలు పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగానికి గతేడాది కన్నా ఈసారి 22 శాతం తక్కువగా కేటాయింపులు చేయటం దారుణమని పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్... రాష్ట్ర ప్రభుత్వాలను నిర్వీర్యం చేసేదిగా ఉందని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. ఆచరణ సాధ్యం కాని హామీలతో పద్దును నింపేశారని తెలిపారు. జనరల్ బడ్జెట్‌లో రైల్వే బడ్జెట్‌ను కలపటంతో తీవ్ర గందరగోళం నెలకొంటోందని పేర్కొన్నారు. మంత్రులు ఎర్రబెల్లి దయాకరరావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తదితరులు కూడా కేంద్ర బడ్జెట్‌పై స్పందించారు. అది దేశంలోని పేదలు, బడుగు, బలహీనవర్గాలకు వ్యతిరేకంగా ఉందని వారు విమర్శించారు.

భవిష్యత్తు నిర్మాణానికి రోడ్ మ్యాప్ లేదు

(మొదటిపేజీ తరువాయి)

యువత నిరుద్యోగులుగానే ఉన్నారు. ప్రధానికిది అవసరం లేదు" అని ట్వీట్ చేశారు.



తడబాటా..లేక !

- రిప్లేసింగ్ ఓల్డ్ పొల్యూటింగ్ వెహికల్స్‌కు బదులు రిప్లేసింగ్ ది ఓల్డ్ పొలిటిషియన్స్



న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట తడబడ్డారా..!లేక కావాలనే అలా మాట్లాడారా.. అనే చర్చ సర్వత్రా నడుస్తోంది. 15 ఏండ్లు దాటిన వాహనాలు నడవకుండా చేయాలనుకుంటోంది..అయితే వాహనాలపై బతుకుతున్న కుటుంబాలు మాత్రం మోడీ ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాయి. దీని గురించి నిర్మలా మాట్లాడుతూ.. రిప్లేసింగ్ ఓల్డ్ పొల్యూటింగ్ వెహికల్స్ కు బదులుగా..రిప్లేసింగ్ ది ఓల్డ్ పొలిటిషియన్స్ అన్నారు. దీంతో ఒక్కసారిగా ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేయగా... నిర్మల కొద్దిసేపు బడ్జెట్ ప్రసంగాన్ని ఆపేశారు. లోక్‌సభలో కేంద్రమంత్రికి వ్యతిరేకంగా సభ్యులు గళం విప్పారు. ఆ తర్వాత తాను మాట్లాడిన మాటల్ని సరిదిద్దుకునే ప్రయత్నం చేశారు.

విద్యా వైద్యాన్ని వదిలేసిన పద్దు

- కేంద్ర బడ్జెట్‌పై ఎమ్మెల్సీ అలుగుబెల్లి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర బడ్జెట్‌లో విద్యా, వైద్య రంగాల్లోని ప్రధాన అంశాలను వదిలేసి, కొన్ని ప్రత్యేక అంశాలకు మాత్రమే బడ్జెట్ కేటాయింపులు చేయడం సరైంది కాదని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి విమర్శించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ రెండు రంగాలను ప్రయివేటుకు వదిలేసేలా బడ్జెట్ ఉన్నదని తెలిపారు. దేశంలోని 15 లక్షల పాఠశాలలను ఎలా అభివృద్ధి చేస్తామనే ప్రస్తావన లేకుండా అందరికీ నాణ్యమైన విద్యనందించటం సాధ్యం కాదని తెలిపారు. గిరిజనుల్లో అత్యధిక మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతుంటారనీ, అలాంటి పాఠశాలలను అభివృద్ధి చేయకుండా 750 ఏకలవ్య స్కూళ్లు ప్రారంభిస్తాం, అందులో 3.50 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటారంటూ గొప్పలు చెప్పుకోవడం కేంద్ర ప్రభుత్వానికే చెల్లిందని ఎద్దేవా చేశారు.

బడ్జెట్లో ఉన్నత విద్యారంగం, ప్రభుత్వ యూనివర్సిటీల ప్రస్తావన, పతిపాదనలేవీ లేవు, పరిశోధనా రంగం గురించి కూడా ప్రస్తావించలేదు. యువతకు పని నైపుణ్యం కల్పిస్తాం, ఏ దేశమైనా పోయి బతకండి అనే విధంగా బడ్జెట్ ప్రసంగం చేశారని అలుగుబెల్లి ఈ సందర్భంగా విమర్శించారు. వైద్య రంగంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధికి ఎలాంటి సూచనలు లేవని తప్పుపట్టారు. వాటిని అభివృద్ధి చేయకుండా ప్రభుత్వ వైద్యరంగాన్ని బాగు చేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. రోడ్లు, రవాణా రంగాలను ప్రయివేటు భాగస్వామ్యంతో అభివృద్ధి చేస్తామని చెప్పడమంటే ప్రజలపై అదనపు భారాలు మోపడమేనని అభిప్రాయపడ్డారు. ప్రయివేటు రంగంలో పని చేస్తున్న కార్మిక వర్గం సంక్షేమం గురించి పట్టించుకోని బడ్జెట్ ప్రజా బడ్జెట్ కాదని తెలిపారు. పై పై పూతలతో ప్రజలను మభ్యపెట్టి ఓట్లేయించుకోవడానికి ఎంచుకున్న మార్గంగా ఈ బడ్జెట్ కనిపిస్తున్నదని పేర్కొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై ప్రజా సంఘాల పెదవి విరుపు

- ఉపాధికి ఉరేశారు : వ్యకాస
- నేడు బడ్జెట్ పత్రాల దహనం :కేవీపీఎస్
- అభివృద్ధికి దోహదపడని బడ్జెట్ :టీజీఎస్
- యువతను విస్మరించిన బడ్జెట్ :డీవైఎఫ్ఐ
- విద్యారంగంపై తీవ్ర నిర్లక్ష్యం :ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ప్రజా సంఘాలు పెదవి విరిచాయి. ఆయా రంగాలకు తగినట్టుగా కేటాయింపులు తగినట్టు లేవంటూ తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశాయి.. ఈ మేరకు ఆయా సంఘాల నేతలు బుధవారం వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. వివిధ రూపాల్లో నిరసనలకు పిలుపునిచ్చారు.

కేంద్ర బడ్జెట్ ఉపాధికి ఉరేసిందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.నాగయ్య, ఆర్.వెంకట్ రాములు విమర్శించారు. ఆహార సబ్సిడీ, రైతులకిచ్చే ఇన్‌పుట్ సబ్సిడీపై భారీ ఎత్తున కోతలు విధించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి నిరసనగా రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ఉపాధికి గతేడాది కన్నా 40 శాతానికి పైగా నిధులు తగ్గించారని తెలిపారు. సంక్షేమ పథకాలను ఎత్తివేస్తూ, ఉపాధి నిధుల తగ్గించినందుకు నిరసనగా గురువారం కేంద్ర బడ్జెట్ పత్రాల దహనం కార్యక్రమాన్ని నిర్వహించాలని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జాన్ వెస్లీ, టి.స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు. జనాభాలో 20 శాతమున్న దళితులకు 16 శాతం నిధులనే కేటాయించారని వారు విమర్శించారు. గతేడాది ఉపాధి హామీ చట్టానికి రూ.89,400 కేటాయించి ఈ ఏడాది రూ.60,000 కోట్లకు తగ్గించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోవిడ్ తర్వాత వలస వెళ్లిన పేదలు దాదాపు 19 కోట్ల మంది గ్రామాల్లో రెక్కల కష్టమే జీవనాధారంగా బతుకుతుంటే ఉపాధి హామీకి నిధులెట్లా తగ్గిస్తారని ప్రశ్నించారు.

కేంద్ర బడ్జెట్ గిరిజనులను అంకెలగారడీతో మోసం చేసే విధంగా ఉందని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం. ధర్మ నాయక్ ,ఆర్ శ్రీరాం నాయక్ లు విమర్శించారు. రూ.45 లక్షల కోట్ల బడ్జెట్లో వారికి కేటాయించింది నామమాత్రమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.కేంద్ర బడ్జెట్‌లో గిరిజన సబ్ ప్లాన్ స్ఫూర్తికి విరుద్ధంగా నిధులను కేటాయించడంతోపాటు పూర్తిగా నీరుగార్చే విధంగా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో సగం జనాభా కలిగిన ఓబీసీల సంక్షేమాన్ని కేంద్ర బడ్జెట్ విస్మరించిందని తెలంగాణ రజక వత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పైళ్ల ఆశయ్య తీవ్రంగా విమర్శించారు. పన్నుల రూపంలో లక్షల కోట్ల రూపాయలను చెల్లిస్తున్నా వారికి న్యాయం చేయడంలో కేంద్రంలోని బీజేపీ సర్కార్ విఫలమైందని పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేశారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.ఎల్.మూర్తి, టి.నాగరాజు, యువతను విస్మరించారని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేశ్, ఆనగంటి వెంకటేష్ విమర్శించారు. వికలాంగుల పట్ల కేంద్రం ప్రదర్శించిన నిర్లక్ష్యానికి నిరసనగా బడ్జెట్ పత్రాలను దహనం చేసే కార్యక్రమానికి ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకట్, కార్యదర్శి ఎం.అడివయ్య పిలుపునిచ్చారు.

కేంద్ర బడ్జెట్టా..? కొన్ని రాష్ట్రాల పద్దా...?

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టింది కేంద్ర బడ్జెట్టా..? లేక కొన్ని రాష్ట్రాలకు సంబంధించిన పద్దా..? అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సూటిగా ప్రశ్నించారు. గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీకి 2025 వరకూ పన్ను మినహాయింపును పొడిగించి నప్పుడు... తెలంగాణలోని నిమ్జ్, ఇతర సెజ్‌ల పరిస్థితేంటని ఆమె ఒక ప్రకటనలో ప్రశ్నించారు. కేంద్ర బడ్జెట్ సందర్భంగా ప్రత్యేకించి కొన్ని రాష్ట్రాల వైపే ఎందుకు చూస్తున్నారని నిలదీశారు. కర్నాటకలోని అప్పర్ భద్ర ప్రాజెక్టుకు రూ.5,300 కోట్లు కేటాయించినందుకు సంతోషమే, కానీ తెలంగాణలోని కాళేశ్వరం, మిషన్ భగీరథ ప్రాజెక్టులకు ఎందుకు కేటాయింపులు చేయలేదని ప్రశ్నించారు. భగీరథకు నిధులివ్వాలంటూ నిటి అయోగ్ చెప్పినా కేంద్రం పట్టించుకోలేదంటూ కవిత ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు.

సాగుకు వెతలు



న్యూఢిల్లీ. డెబ్బయి శాతం ప్రజలు ఆధారపడ్డ వ్యవసాయరంగానికి బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేసింది. సాగు పద్దులో అన్నింటికీ కోతలు పెట్టింది. సంక్షోభం, ఆపై మాంద్యం ప్రభావంతో సేద్యపురంగం కుదేలవగా, కోవిడ్ విలయం తోడు కావడంతో రైతుల, వ్యవసాయ కార్మికుల, గ్రామీణ ప్రజల జీవనోపాధి దెబ్బతింది. కార్పొరేట్లకు ఎన్ని ఉద్దీపన పథకాలిచ్చినా పారిశ్రామిక వృద్ధి పెరగలేదు. కానీ కోవిడ్ క్లిష్ట సమయంలో దేశ ఆర్థిక వ్యవస్థను ఆదుకున్నది ఒక్క వ్యవసాయమే. మోడీ ప్రభుత్వం అదేమీ పట్టించుకోకుండా ఆ రంగానికి 2023-24 బడ్జెట్‌లో కత్తెర పెట్టింది. మరోవైపు వ్యవసాయ రంగ కార్పొరేటీకరణకు నడుం కట్టింది. విరివిగా ప్రకృతి సేద్యం, డ్రోన్ల వాడకం, స్టార్టప్‌లకు ప్రత్యేక నిధి, సహకారరంగంపై కేంద్ర పట్టు బిగింపునకు మరిన్ని చర్యలు చేపడతామని ప్రకటించింది. ప్రత్యామ్నాయ ఎరువుల ప్రోత్సాహానికి 'పిఎం-ప్రణామ్' అనే పథకాన్ని ప్రతిపాదించింది. డెయిరీ, ఫిషరీస్ సహా వ్యవసాయ రుణ లక్ష్యాన్ని రూ.20 లక్షల కోట్లుగా సర్కారు పేర్కొంది. కాగా బ్యాంక్ రుణాలు వాస్తవ సాగుదారులకు అందట్లేదు.

28 వేల కోట్లు కట్

గత బడ్జెట్‌కు ఇప్పటికి వ్యవసాయానికి రూ.28 వేల కోట్లకుపైన కోత పడింది. 2022-23లో 1,51,521 కోట్లు ప్రతిపాదించారు. అప్పటి మొత్తం బడ్జెట్‌లో 3.84 శాతం. 2023-24లో 1,44,214 కోట్లు అన్నారు. మొత్తం బడ్జెట్‌లో 3.20 శాతం మాత్రమే. మునుపటి కంటే 0.64 శాతం తగ్గింది. తగ్గుదల సుమారు 28 వేల కోట్లు. రైతుల ఆదాయాలు రెట్టింపు చేసేందుకంటూ అమలు చేస్తున్న పిఎం కిసాన్, విపత్తుల వలన పంటలు నష్టపోయిన రైతులను ఆదుకునే క్రాప్ ఇన్సూరెన్స్, రైతులకు కనీస మద్దతు ధర, పేదలకు ఆహార భద్రత కల్పించేందుకు ఉపకరించే ఫుడ్ సబ్సిడీ, తిండిగింజల సేకరణ పద్దుకూ కోతలే పెట్టారు. ఎరువుల సబ్సిడీకీ కత్తెరలే. ఎంఎస్‌పి గ్యారంటీకి చట్టబద్ధత కోసం రైతులు ఉద్యమిస్తుండగా బడ్జెట్‌లో ఆ అంశం మాటమాత్రమైనా ప్రస్తావించలేదు. వ్యవసాయ కూలీలకు పనులు కల్పించే ఉపాధి హామీకి నిధులు భారీగా తగ్గించారు. ఆర్‌కెవివై, క్రిషియోన్నతి స్కీంలదీ అదే పరిస్థితి.

కార్పొరేట్- మతోన్మాదం

కార్పొరేట్లకు ఊతం

- సహకారంపై కేంద్రం పట్టు బిగింపు
- ఎంఎస్‌పీ చట్టబద్ధత ఊసే లేదు



ముఖ్య ప్రతిపాదనలు (రూ.కోట్లు)

వివరాలు	2022-23 అంచనా	2022-23 సవరించిన బడ్జెట్	2023-24 అంచనా
పీఎం కిసాన్	68,000	60,000	60,000
పంటల బీమా	15,500	12,376	13,625
ఎరువుల సబ్సిడీ	1,05,222	2,25,220	1,75,100
ఫుడ్ సబ్సిడీ	2,06,831	2,87,194	1,97,350

వ్యవసాయంలో కార్పొరేట్ల జోక్యం, ప్రైవేటు ఆధిపత్యం పెంచే పలు కార్యక్రమాలను బిజెపి ప్రభుత్వం బడ్జెట్‌లో పేర్కొంది. రానున్న రోజుల్లో కోటి మంది రైతులను ప్రకృతి వ్యవసాయం కిందికి తీసుకొచ్చి రసాయన ఎరువుల వాడకం తగ్గించడం ద్వారా రైతుల పెట్టుబడి ఖర్చులు తగ్గిస్తారు. తద్వారా రైతుల ఆదాయాలను సుస్థిరం చేస్తారు. ప్రత్యామ్నాయ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించేందుకు పిఎం-ప్రణామ్ పథకాన్ని ప్రకటించారు. పైకి సేంద్రీయం అంటున్నా గోవు విసర్జితాలకు అధిక ప్రాధాన్యమిచ్చి మతోన్మాదాన్ని రైతులకు ఎక్కిస్తారు. వ్యవసాయంలో డ్రోన్లను ప్రవేశపెడతారు. కిసాన్ డ్రోన్లను పంటలపై అంచనాలు, భూరికార్డుల డిజిటలైజేషన్, ఎరువులు, పురుగుమందుల పిచికారీ వంటికి ఉపయోగిస్తారు.

సహకారరంగంపై కేంద్ర పెత్తనాన్ని పెంచేందుకు దేశంలోని 63 వేల పిఎసిఎస్‌ల కార్యకలాపాల డిజిటలైజేషన్ కోసం రూ.2,516 కోట్లు ఖర్చు చేస్తారు. భవిష్యత్తులో పిఎసిఎస్‌లను మల్టీపర్పస్ ప్రయోజన కేంద్రాలుగా మారుస్తారు. డెయిరీ, మత్స్య సహకార సొసైటీలను నెలకొల్పుతారు. గ్రామాల్లో స్టార్టప్‌లకు నాబార్డు ద్వారా ప్రత్యేక నిధి ఏర్పాటు చేస్తారు. పత్తి పంట దిగుబడి, నాణ్యత పెంచేందుకు క్లస్టర్ తరహాలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పిపిపి) ప్రవేశపెడతారు. నూనెల దిగుమతులు తగ్గించేందుకు నూనెగింజల సాగును, ఆరోగ్యం కోసం చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తారు.

ఇది ప్రజా వ్యతిరేక, కోతల బడ్జెట్ !

ఆర్థిక సంక్షోభాన్ని తీవ్రతరం చేస్తుంది

- సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో విమర్శ



న్యూఢిల్లీ : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం పార్లమెంట్‌కు సమర్పించిన కేంద్ర బడ్జెట్ కోతల బడ్జెట్, పూర్తిగా ప్రజా వ్యతిరేకమైనదని సీపీఐ(ఎం) విమర్శించింది. పార్టీ పొలిట్ బ్యూరో ఈ మేరకు బుధవారం నాడిక్కడ ఒక ప్రకటన విడుదల జేసింది. కరోనా మహమ్మారి తలెత్తడానికి ముందే భారతదేశ ఆర్థిక వ్యవస్థ మందగించింది, ఆ తర్వాత వరుసగా కరోనా వచ్చిన రెండేళ్లలో మరింత అధ్వాన స్థితికి దిగజారింది, కరోనా తర్వాత అంతర్జాతీయంగా ఆర్థిక వ్యవస్థ మాంద్యం దిశగా కదులుతున్నప్పుడు ఆ మహమ్మారి అనంతర పునరుద్ధర ణపై ప్రతికూల ప్రభావం పడింది. ఇటువంటి పరిస్థితు ల్లో 2023-24 సంవత్సరానికి ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌లో ఉపాధి కల్పన, దేశీయ డిమాండ్‌ను, ప్రజల కొనుగోలు శక్తి ని పెంచడం వంటి కీలకమైన అంశాలను పరిష్కరించాలి. కానీ, ఈ విషయంలో ఈ బడ్జెట్ విఫలమైంది. పైగా దీనికి విరుద్ధంగా సంపన్నులకు మరింతగా పన్ను రాయితీలిస్తూ, ద్రవ్యలోటు తగ్గించే పేరుతో ప్రభుత్వ వ్యయాన్ని కుదించింది. దేశంలో గత రెండేళ్లలో ఉత్పత్తి అయిన మొత్తం సంపదలో 40.5శాతం దాకా కేవలం ఒకే ఒక్క శాతంగా ఉన్న సంపన్నుల వద్ద పోగు పడిందని ఆక్స్‌ఫామ్ నివేదిక బయటపెట్టిన సమయంలో ఈ బడ్జెట్ వచ్చింది. అందువల్ల, ఇది సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేసే బడ్జెట్ అని చెప్పాలి.

2022-23 సంవత్సరానికి సవరించిన అంచనాల కన్నా 2023-24 సంవత్సరానికి మొత్తం ప్రభుత్వ వ్యయం కేవలం 7శాతమే అధికం.. అదే సమయంలో నామ మాత్రపు (ద్రవ్యోల్బణంతో కూడిన) జీడీపీలో పెరుగుదల (10.5శాతంగా) వుంటుందని అంచనా వేయ బడింది. అందువల్ల, జిడిపి శాతంలో ప్రభుత్వ వ్యయం తగ్గుతుంది. వడ్డీ చెల్లింపుల ను కూడా మినహా యించినట్లైతే, అప్పుడు ఈ వ్యయం గతేడాది కన్నా కేవలం 5.4శాతమే ఎక్కువ. ఒక్కసారి అవ్యక్త ద్రవ్యోల్బణ రేటు 4శాతాన్ని, దాదాపు ఒక శాతంగా ఉన్న జనాభా పెరుగుదలను పరిగణనలోకి తీసు కుంటే, ప్రజా ప్రయోజనాలే కీలకమని చెప్పుకుంటున్న ఈ బడ్జెట్‌తో మెజారి టీ ప్రజల జీవనోపాధిపై దాడులు మరింతగా పెరగబోతున్నాయి. ఇది వరకెన్నడూ లేని రీతిలో, నిరుద్యోగం నింగినంటుతున్న ఈ సమయంలో, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్‌లో కేటాయిం పులు 33శాతం తగ్గించారు.. ఆహార సబ్సిడీలో రూ.90వేల కోట్లు, ఎరువుల సబ్సిడీలో రూ.50వేల కోట్లు, పెట్రో లియం సబ్సిడీలో రూ.6,900కోట్లు కోత పెట్టారు. కరోనా మహమ్మారి ఇంత లా కల్లోలం సృష్టిస్తే, గతేడాది ఆరోగ్య రంగ కేటాయింపుల్లో రూ. 9225 కోట్లు, విద్యా రంగ బడ్జెట్‌లో రూ.4297కోట్లు ఖర్చు చేయకుండా మురగబెట్టారు. చాలీచాలని వేతనాల తో నానా అవస్థలు పడుతున్న ఐసీడీఎస్ స్కీమ్ కార్మికులకు ఎలాంటి పెంపుదల లేదు. మొత్తం వ్యయంలో మహిళలకు బడ్జెట్‌లో (జెండర్ బడ్జెట్) కేవలం 9శాతం మాత్రమే కేటాయిం చారు. జనాభాలో 16శాతం మంది ఎస్‌సిలు వుండగా, వారికి బడ్జెట్‌లో కేవలం 3.5శాతం,. 8.6శాతంగా ఉన్న ఎస్టీలకు కేవలం 2.7శాతం మా త్రమే కేటాయించారు. రైతుల ఆదా యాన్ని రెట్టింపు చేస్తామంటూ ఒక పక్క ప్రభుత్వం అర్భాటంగా చేసుకున్న ప్రచారంలోని డొల్లతనం ప్రధాని కిసాన్ నిధికి కేటాయింపులను రూ. 68వేల కోట్ల నుండి రూ.60వేల కోట్ల కు తగ్గించడంలో కనబడుతోంది. మూలధన వ్యయాల్లో గణనీ యమైన పెరుగుదల వుందని, ఇది ఉపాధి కల్పనకు దారి తీస్తుందని ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు చూసేందుకు పైకి మెరుగ్గా కనిపి స్తున్నా లోపలంతా బూటకమేనని పొలిట్‌బ్యూరో విమర్శి ంచింది. మూల ధన వ్యయాన్ని గణనీ యంగా పెంచామని 2022-23 సంవత్సరానికి సవరించిన అంచనాల ను చూసినట్లైతే ప్రభుత్వ సంస్థల వనరులతో సహా మొత్తంగా మూల ధన వ్యయాలు కేవలం 9.6శాతమే పెరిగాయి. ఇది, నామమాత్రపు జిడిపి లో 15.4శాతం పెరుగుదల కన్నా బాగా తక్కువే. ఆదాయపుపన్ను మిన హాయింపు పరిమితిని రూ.5లక్షల నుండి రూ.7లక్షలకు పెంచడం వల్ల వేతన జీవులకు కొద్దిగా ఉపశమనం కలిగింది. అయితే, ద్రవ్యోల్బణం, సామాజిక రంగ వ్యయంలో కోతల వల్ల విద్య, వైద్య రంగాలతో సహా నిత్యావసర సేవలపై ప్రజలు మరింత గా ఖర్చు పెట్టాల్సి వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వాలకు వనరుల బదిలీలను కుదించడం ద్వారా ఈ బడ్జెట్, ఆర్థిక సమాఖ్య వాదంపై మరి న్ని దాడులను కొనసాగిస్తోంది. ఈ బదిలీలు, 2022-23లో 8.4శాతం ద్రవ్యోల్బణం రేటు వున్నప్పటికీ 2021 -22లో జరిగిన బదిలీలు ఒకేలా వున్నాయని 2022- 23 సంవత్సరానికి సవరించిన అంచనాలు వెల్లడిస్తున్నాయి.. రాష్ట్ర ప్రభుత్వాలు రుణాలను తీసుకునే అంశంపైనా మరిన్ని షరతు లు రుద్దింది. బడ్జెట్‌లో సంపన్నులకు ఇచ్చే పన్ను రాయితీలు, మొత్తంగా పన్ను ప్రతిపాదనలన్నిటితో 2023- 24లో రూ.35వేల కోట్ల మేర రెవిన్యూ నష్టం ఉంటుందని ఆర్థిక మంత్రి తెలియ చేశారు. ప్రజలకు ఎంతగానో అవసర మైన ఉపశమనాన్ని కలిగిం చేందుకు, ఆర్థిక వ్యవస్థ వృద్ధికి దారి తీసేలా దేశీయ డిమాండ్‌ను పెంపొం దించేందుకు గానూ బడ్జెట్ ఈ క్రింది చర్యలు తీసుకోవాల్సి ఉంది.

1.ఉపాధి కల్పనా ప్రాజెక్టుల్లో ప్రభుత్వ పెట్టుబడులను గణనీయంగా పెంచాలి.

2.మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ కేటాయింపులను గణనీయంగా పెంచి, కార్మికులకు అధిక వేతనాలు ఇవ్వాలి.

3.5కిలోల ఉచిత ఆహార ధాన్యాలతో పాటూ 5 కిలోల సబ్సిడీ ఆహార ధాన్యాలను పునరుద్ధరించాలి.

4.సంపద, వారసత్వపు పన్నుల ను విధించాలి.

5,ఆహార పదార్థాలు, మందుల తో సహా నిత్యావసరాలపై జిఎస్‌టిని ఉపసంహరించాలి.

ఈ బడ్జెట్‌లోని ప్రజా వ్యతిరేక ప్రతిపాదనలకు, కోతలకు వ్యతిరేకం గా, పైన పేర్కొన్న డిమాండ్ల అమలు ను కోరుతూ ఈ నెల 22 నుండి 28వరకు దేశవ్యాప్తంగా సిపిఎం నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తుందని పొలిట్‌బ్యూరో ప్రకటన పేర్కొంది. ప్రజల జీవనోపాధిని పరిరక్షించాలని కోరుకునే అన్ని తరగతుల ప్రజలూ ఈ నిరసనల్లో పాల్గొని, గొంతెత్తాలని కోరింది.

వికలాంగుల హక్కుల చట్టం అమలు

నిధుల్లో రూ.90 కోట్ల కోత

కేంద్రంపై ఎన్‌పీఆర్‌డీ ఆగ్రహం



న్యూఢిల్లీ : కేంద్ర బడ్జెట్‌లో వికలాంగులకు నిరాశే ఎదురైంది. 'దివ్యాంగజన్' అనే పేరు పెట్టడం మినహా.. వికలాంగులను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పూర్తిగా విస్మరించారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది బడ్జెట్‌లో వికలాంగులకు కేటాయింపులు ఒక శాతం మాత్రమే పెరిగింది. 2022-23 బడ్జెట్‌లో వికలాంగులకు కేటాయించిన నిధుల్లో రూ.196 కోట్లు వినియోగించలేదు. ప్రస్తుత బడ్జెట్‌లో గత ఏడాది కంటే ఒక శాతం అదనంగా వికలాంగుల సంక్షేమానికి నిధులు కేటాయించారు. వికలాంగ హక్కుల చట్టం అమలు కోసం గత ఏడాది రూ.240.39 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ.150 కోట్లకు దిగజారింది. ఈ ఏడాది రూ.90 కోట్లు కోత పెట్టడంతో ఈ చట్టాన్ని ఏవిధంగా అమలు చేస్తారనే ఆందోళన వికలాంగుల్లో నెలకొంది. కరోనా మహమ్మారి ప్రభావం ఇంకా కొనసాగుతున్న వేళ వికలాంగులందరికీ ఉచిత, సార్వత్రిక ఆరోగ్య సదుపాయాలు కల్పించాలన్న డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోలేదు. గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా జాతీయ వికలాంగుల పెన్షన్‌కు రూ.290 కోట్లే కేటాయించారు. గత పదేళ్లుగా నెలకు రూ.300గా ఇస్తున్న పింఛను పెంచాలన్న డిమాండ్‌ను కేంద్రం పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ రంగంలో ఉద్యోగావకాశాలు తగ్గిపోతున్న వేళ.. ఉపాధి సంక్షోభాన్ని అధిగమించేందుకు ప్రయివేటు రంగంలో వికలాంగులకు ఉపాధి కల్పించడానికి ప్రభుత్వం ఎలాంటి చర్యలూ చేపట్టలేదు.

నిరసనలకు ఎన్‌పీఆర్‌డీ పిలుపు

వికలాంగులను విస్మరించిన కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ నిరసనలు చేపట్టాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) ఒక ప్రకటనలో పిలుపునిచ్చింది. తిరోగమన బడ్జెట్‌కు వ్యతిరేకంగా గొంతు వినిపించాలని తన అనుబంధ సంస్థలకు, ఇతర వికలాంగ హక్కుల సంస్థలను కోరింది.

కేంద్రబడ్జెట్ లో ప్రజలకు అన్యాయమే

- దేశవ్యాప్త ఆందోళనకు పిలుపు
- ఏఐఏడబ్ల్యూయూ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్



న్యూఢిల్లీ : కేంద్ర బడ్జెట్ 90 శాతం దేశ ప్రజానీకానికి, తెలుగు ప్రజలకు అన్యాయం చేసేలా ఉందని వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యూయూ) ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ విమర్శించారు. బుధవారం నాడిక్కడ ఆయన కేంద్ర బడ్జెట్ పై మాట్లాడారు. ఉపాధి హామీ పథకానికి దాదాపు రూ.30 వేల కోట్లు (45 శాతం) తగ్గించారని విమర్శించారు. రైతులు, వ్యవసాయ కార్మికులకు అన్యాయం జరిగిందని అన్నారు. సబ్సిడిలకు భారీగా కోత పెట్టారని పేర్కొన్నారు. ఎరువులకు రూ. 75 వేల కోట్లు తగ్గించారనీ, అందులో ఒక్క యూరియాకే రూ.15 వేల కోట్లు తగ్గించారని తెలిపారు. ఆహార భద్రతకి రూ.90 వేల కోట్లు తగ్గించారనీ, వ్యవసాయ అనుబంధ రంగాలకు నిధులు తగ్గించారని విమర్శించారు. సామాన్య ప్రజానీకాన్ని, గ్రామీణ భారతాన్ని విస్మరించారని అన్నారు. రైల్వేకు కూడా కేటాయింపులు పెరగలేదని, కార్పొరేట్లకు పన్ను పెంచలేదని పేర్కొన్నారు. దేశ అభివృద్ధికి ఉపయోగపడేలా బడ్జెట్ లేదని, మహిళల డిపాజిట్లు కార్పొరేట్లకు అప్పగిస్తారని దుయ్యబట్టారు. బడ్జెట్‌లో తెలుగు రాష్ట్రాలకి అన్యాయం జరిగిందని అన్నారు. ఆదాయ ఆర్జనలో తెలుగు రాష్ట్రాలు ముందున్నాయని తెలిపారు. కర్నాటకలో ఎన్నికలు ఉండటంతో కేటాయింపులు చేశారని విమర్శించారు. విభజన హామీలు, ప్రాజెక్టులకు నిధులు కేటాయించలేదని విమర్శించారు.. బడ్జెట్ కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా వ్యవసాయ కార్మిక సంఘాలు నిరసన చేపడతాయని అన్నారు.

తెలంగాణ పై కేంద్రం వివక్ష

- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి



న్యూఢిల్లీ :తెలంగాణ పట్ల కేంద్రం వివక్ష చూపుతోందని టీపీసీసీ అధ్యక్షుడు ఎ. రేవంత్ రెడ్డి విమర్శించారు. బుధవారం నాడిక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. "బడ్జెట్‌లో తెలంగాణకు కేంద్రం మొండిచేయి చూపింది బయ్యారం ఉక్కు కర్మాగారానికి నిధుల్లేవు. సాగునీటి ప్రాజెక్టులకు నిధుల్లేవు. పేదల పట్ల ఈ ప్రభుత్వానికి ఎలాంటి ప్రేమ, పట్టింపు లేదు. కేంద్ర ప్రభుత్వం చేసిన అన్యాయానికి, రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి అండగా నిలబడింది. బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయానికి బీజేపీ, బీఆర్ఎస్ ఇద్దరు దోషులే. మోడీ, కెసిఆర్ ఇద్దరు తోడు దొంగలు తెలంగాణ కు అన్యాయం చేశారు" అని విమర్శించారు."ఇప్పటికైనా తెలంగాణ లో సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హెూదా ఇవ్వాలి. రాష్ట్రంలో ప్రతీ పేదవాడికి ఇళ్లు నిర్మించేందుకు అవసరమైన నిధులను కేంద్రం కేటాయిం చాలి. రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ప్రారంభించాలి. మోడీ మీరు గుజరాత్‌కు సీఎం కాదు.. ఈ దేశానికి ప్రధాని. నిధుల కేటాయింపులో గుజరాత్‌కు కల్పిం చిన ప్రాధాన్యత ను తెలంగాణకు కల్పించండి. మోడీ అన్యాయం చేస్తుంటే.. నిలదీయాల్సిన బీఆర్ఎస్ సభలో నిస్సహాయంగా నిలబడింది. అవినీతిని కప్పి పుచుకోవడానికే.. కెసిఆర్ కేంద్రంతో కాళ్లబేరానికి దిగారు. తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని సవరించాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది" అని అన్నారు..

తెలంగాణ ఊసే లేదు :వైఎస్ షర్మిల



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కేంద్రబడ్జెట్‌లో తెలంగాణ సమస్యల ఊసేత్తకపోవడం దుర్మార్గమని వైఎస్ఆర్‌టీపీ వైఎస్ షర్మిల విమర్శించారు. ఈసారి కూడా విభజన చట్టంలోని హామీలను పట్టించుకోలేదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కుపరిశ్రమ, పసుపుబోర్డు, ములుగు గిరిజన యూనివర్సిటీ ప్రస్తావించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. 'అడగనిదే అమ్మైనా అన్నం పెట్టదు' అన్నట్టు మన సీఎం ఏనాడైనా రాష్ట్ర ప్రయోజనాల కోసం కొట్లాడారా? ప్రధాని రాష్ట్రానికొస్తే ఎదురెళ్లి విభజన సమస్యలు అడిగారా? అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలకు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు నష్టం చేస్తున్నాయని విమర్శించారు.

కార్పొరేట్ శక్తులకు ఉపయోగపడే బడ్జెట్

- యంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ తీరు కాకులను కొట్టి గద్దలకు వేసినట్టుగా ఉందని యంసిపిఐ(యు) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి విమర్శించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సంపన్నులకు అనేక రాయితీలు కల్పిస్తూ దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ప్రజలపై పన్నుల భారాలు మోపే విధంగా పద్దును రూపొందించారని తెలిపారు. విద్య, వైద్యం, మహిళా, శిశు సంక్షేమం, యువజన రంగాలకు అతి స్వల్పంగా కేటాయించడం శోచనీయమని పేర్కొన్నారు.

పేదలకు ఏమీ లేదు :

- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే

దేశంలో రాబోయే మూడు, నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మోడీ ప్రభుత్వం ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. దేశంలోని పేదలకు కానీ, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించటానికి కానీ బడ్జెట్‌లో ఏమీ లేదు. ఉద్యోగాల విషయంలో ఉపాధి హామీ పథకం, ప్రభుత్వ ఖాళీల భర్తీకి ఎలాంటి చర్యలూ లేవు. పిండి, తృణధాన్యాలు, పాలు, వంట గ్యాస్ ధరల పెంపుతో మోడీ ప్రభుత్వం దేశాన్ని దోచుకున్నది.

ఆర్టీసీ కార్మికుల సమస్యల
పరిష్కారం కోసం విశాల ఐక్య వేదిక

- హాజరైన పలు సంఘాలు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టీఎస్‌ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం విశాల ఐక్య వేదిక ఏర్పాటులో భాగంగా బుధవారం ఆ సంస్థలోని పలు కార్మిక సంఘాలు భేటీ అయ్యాయి. తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎమ్‌యూ) ఆఫీసులో జరిగిన ఈ సమావేశంలో ఆ సంఘం గౌరవాధ్యక్షులు అశ్వత్థామరెడ్డి, అధ్యక్షులు వీ తిరుపతి, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయులు, ప్రచార కార్యదర్శి పీ రవీందర్‌రెడ్డి, ఎన్‌ఎమ్‌యూ రాష్ట్ర అధ్యక్షులు పీ కమాల్‌రెడ్డి, టీజేఎమ్‌యూ ముఖ్య సలహాదారు కృష్ణ, టీకేయూ అధ్యక్షులు ఆంజనేయగౌడ్, కార్మికసంఘ్ ప్రధాన కార్యదర్శి స్వామికుమార్ పాల్గొన్నారు. ఆర్టీసీలో కార్మికులపై పెరుగుతున్న పనిభారం, అద్దె బస్సులు పెంచి కన్సల్టెన్సీలు, ఔట్‌సోర్సింగ్ కంపెనీలను ప్రవేశపెడుతూ కామధేనువు లాంటి ఆర్టీసీ ట్రావెల్ ఏజన్సీ స్థాయికి దిగజార్చుతున్న వైనంపై చర్చించినట్టు నాయకులు తెలిపారు. రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి విశాల ఐక్యవేదిక ఏర్పాటు ఆవశ్యకత ఉన్నదని సమావేశం అభిప్రాయ పడినట్టు చెప్పారు. ఈనెల 11న మరోసారి టీఎమ్‌యూ కార్యాలయంలో మరో సారి భేటీ అవ్వాలని నిర్ణయించారు. ఈ సమావేశానికి హాజరుకాలేని సంఘాలు 11వ తేదీ భేటీలో పాల్గొనాలనీ, ఆ మేరకు ఆహ్వానాలు పంపుతామని టీఎమ్‌యూ అధ్యక్షులు వీ తిరుపతి చెప్పారు.

పీఆర్సీపై యాజమాన్యంతో
టీఈఈజేఏసీ చర్చలు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

విద్యుత్ ఉద్యోగులకు వేతన సవరణ (పీఆర్సీ)ను సాధ్యమైనంత త్వరగా చేయాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఇంజినీర్స్ జేఏసీ యాజమాన్యాన్ని కోరింది. బుధవారంనాడిక్కడి విద్యుత్ సౌధలో జేఏసీ చైర్మెన్ కోడూరి ప్రకాష్, కన్వీనర్ ఎన్ శివాజీ, కో కన్వీనర్ కేవీ జాన్సన్, సభ్యులు రామేశ్వరయ్య శెట్టి తదితరులు టీఎస్‌జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎమ్‌డీ దేవులపల్లి ప్రభాకర్‌తో భేటీ అయ్యారు. పీఆర్సీపై చర్చించారు. ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్‌కు మార్పు, ఆర్టిజన్స్ మాస్టర్ స్కేలు, పర్సనల్ పే తదితర అంశాలపై మాట్లాడారు. అలాగే క్రింది స్థాయి ఉద్యోగుల జీతభత్యాల వ్యత్యాసాన్ని కూడా సరిచేయాలని చెప్పారు.ఉద్యోగులందరికీ పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. పై అంశాలన్నింటినీ సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్ళి చర్చిస్తానని ఈ సందర్భంగా ప్రభాకరరావు తెలిపారు.

సీఎం కేసీఆర్‌ను
కలిసిన అమిత్‌జోగి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఛత్తీస్‌ఘఢ్ మాజీ ముఖ్యమంత్రి అజిత్ జోగి తనయుడు, జనతా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అమిత్ జోగి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుతో భేటీ అయ్యారు. ఆయన తన పార్టీ ముఖ్యనాయకులతో కలిసి బుధవారం ప్రగతి భవన్‌కు వచ్చారు. దేశ రాజకీయాలపై సుదీర్ఘంగా చర్చించారు. బీఆర్ఎస్ విధివిధానాలను అడిగి తెలుసుకున్నారు. జాతీయ రాజకీయాల్లో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తుల అవసరం వున్నదని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమం, అభివృద్ధి పథకాలను ప్రసంసించారు.

ఈ సందర్భంగా తన తండ్రి ఛత్తీస్‌ఘఢ్ మాజీ ముఖ్యమంత్రి అజిత్‌జోగీ తన గురించి రాసుకున్న ఆటోబయోగ్రఫీని సీఎం కేసీఆర్‌కు అందచేశారు. జనతా కాంగ్రెస్ పార్టీకి ఆ రాష్ట్రంలో ముగ్గురు ఎమ్మెల్యేలున్నారు.

'యోగాసన' విజేతలకు బహుమతులు ప్రదానం



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ ఫస్ట్ ఇంటర్ స్కూల్ ఛాంపియన్ షిప్‌లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. కాచిగూడలోని నృపతుంగ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో మూడు కేటగిరిల్లో తరగతుల వారీగా విజేతలను ప్రకటించారు. ఈ పోటీల్లో 65 పాఠశాలల నుంచి 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తెలంగాణ యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు జీ శ్రీధరరావు, యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి డీ నాగేంద్రరావు, తెలంగాణ యోగాసన క్రీడా సంఘం ప్రధాన కార్యదర్శి నందనం కృపాకర్, తెలంగాణ యోగా టీచర్స్ కో ఆర్డినేషన్ కమిటీ అధ్యక్షులు రవికిషోర్, ముద్రా నిపుణులు ముద్ర ప్రకాశ్, ఇండియన్ యోగా ఫెడరేషన్ అధ్యక్షులు డాక్టర్ బ్రిజ్‌భూషణ్ పురోహిత్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ యోగా కోచ్ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొని, విజేతలకు బహుమతులు అందచేశారు.

ముందే టిక్కెట్లు రిజర్వు చేసుకుంటే రాయితీలు

- టీఎస్‌ఆర్టీసీ ప్రకటన

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రయాణికులు ముందుస్తు రిజర్వేషన్ చేసుకుంటే ప్రత్యేక రాయితీలు ఇస్తామని టీఎస్‌ఆర్టీసీ ప్రకటించింది. 31 రోజుల నుంచి 45 రోజుల ముందు రిజర్వేషన్ చేసుకుంటే టికెట్‌లో 5 శాతం, 46 రోజుల నుంచి 60 రోజుల ముందు టికెట్ బుక్ చేసుకుంటే 10 శాతం టిక్కెట్ చార్జీలో రాయితీ ఇస్తామని ఆ సంస్థ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్, మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ తెలిపారు. ఈ మేరకు ఆన్‌లైన్ ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టం (ఓపీఆర్ఎస్) సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేశామన్నారు. ముందస్తు రిజర్వేషన్ సదుపాయం ఉన్న అన్ని సర్వీస్‌లకు ఈ రాయితీ వర్తిస్తుందని స్పష్టంచేశారు. ఈ పద్ధతిని ప్రయోగాత్మకంగా సంక్రాంతి పండుగకు వర్తింప చేశారు. ప్రయాణీకుల నుంచి మంచి స్పందన రావడంతో ఈ సదుపాయాన్ని ఈ ఏడాది జూన్ వరకు పొడిగిస్తున్నట్టు ప్రకటించారు. ముందస్తు రిజర్వేషన్ కోసం అధికారిక వెబ్‌సైట్ www.tsrtconline.in ను సందర్శించాలని కోరారు.

'ఆపరేషన్ స్మైల్'తో 2814 మంది పిల్లలకు విముక్తి

- ఇందులో ఇతర రాష్ట్రాలవారు 160 మంది పైనే..!

నవతెలంగాణ - ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో నెల పాటు నిర్వహించిన 'ఆపరేషన్ స్మైల్' లో పోలీసులు 2814 మంది పిల్లల్ని రక్షించారు. వీరిలో అనాథ పిల్లలతో పాటు తప్పిపోయినవారు, ఇంటి నుంచి పారిపోయి వచ్చిన వారు, హ్యూమన్ ట్రాఫికర్స్‌కు చిక్కినవారు ఉన్నారని 'ఆపరేషన్ స్మైల్'ను పర్యవేక్షించిన రాష్ట్ర మహిళా, భద్రతా విభాగం అదనపు డీజీ షికా గోయెల్ బుధవారం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 'ఆపరేషన్ స్మైల్'కు చెందిన 715 మంది అధికారులు, సిబ్బంది ఈ ఫలితాలను సాధించారని చెప్పారు. రైల్వేస్టేషన్లు, బస్ స్టేషన్లు, ఇటుక బట్టీలు, కార్ఖానాలు, హోటళ్లు, పని వాళ్లతో బలవంతంగా పని చేయిస్తున్న ఇతర కార్ఖానాల నుంచి ఈ పిల్లలను రక్షించటం జరిగిందని ఆమె తెలిపారు. రక్షించబడ్డ పిల్లల్లో 300 మందికి పైగా బాలికలు ఉన్నారనీ, అలాగే 160 మందికి పైగా ఇతర రాష్ట్రాలకు చెందిన పిల్లలు ఉన్నారని చెప్పారు. పిల్లలతో బలవంతంగా పని చేయిస్తున్న 406 మందిని అరెస్టు చేయడం జరిగిందని షికా గోయెల్ వివరించారు. దాదాపు ఆరు నెలల నుంచి కనిపించకుండా పోయిన ముగ్గురు పిల్లలను కూడా రక్షించి వారి తల్లిదండ్రులకు అప్పగించటం జరిగిందని తెలిపారు. రక్షించబడిన పిల్లల్లో చాలా మందిని తమ తల్లిదండ్రుల వద్దకు చేర్చడం జరిగిందని, మిగతావారిని బాలల హోమ్‌లలో ఉంచటం జరిగిందని ఆమె చెప్పారు. ఈ ఆపరేషన్‌లో పోలీసులతో పాటు శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖ తో పాటు పలు ఎన్జీవో సంస్థలకు చెందిన కార్యకర్తలూ పాల్గొన్నారని తెలిపారు. వచ్చే జూన్ నెలలో మరోసారి రాష్ట్రంలో 'ఆపరేషన్ ముస్కాన్'ను నిర్వహించనున్నట్టు షికా గోయెల్ ప్రకటించారు.

ఉపాధ్యాయ బదిలీలకు 59,741 దరఖాస్తులు

- ముగిసిన దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయుల బదిలీ లకు సంబంధించి ఆన్‌లైన్‌లో దర ఖాస్తు స్వీకరణ ప్రక్రియ బుధవారంతో ముగిసింది. అదేరోజు రాత్రి ఎనిమిది గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా 59,741 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేశారు. అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 3,641 మంది, నిజామాబాద్‌లో 3,425 మంది, రంగారెడ్డి జిల్లాలో 3,250 మంది, సంగారెడ్డిలో 3,195 మంది.

ఖమ్మంలో 3,054 మంది, అత్యల్పంగా ములుగు జిల్లాలో 422 మంది, జయశంకర్ భూపాల పల్లిలో 546 మంది, హన్మకొండలో 695 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేశారు.

మోడల్ స్కూళ్లలో ప్రవేశాల దరఖాస్తు గడువు 15కు పొడిగింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో ఆరో తరగతితోపాటు ఏడు నుంచి పదో తరగతి వరకు ప్రవేశాలకు సంబంధించి ఖాళీ సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు గడువును ఈనెల 15 వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు మోడల్ స్కూళ్ల అదనపు సంచాలకులు ఉషారాణి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని 194 మోడల్ స్కూళ్లలో ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుందని తెలిపారు. ఆరో తరగతిలో ఒక్కో పాఠశాలలో వంద సీట్లు అందుబాటులో ఉంటాయని వివరించారు. ఏడు నుంచి పదో తరగతి వరకు ఖాళీ సీట్లు భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ఓసీలు రూ.200, ఎస్సీ,ఎస్టీ,బీసీ, వికలాంగులు, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.125 దరఖాస్తు ఫీజు చెల్లించాలని కోరారు. వివరాలు www.tsmodelschools.com వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. ఇప్పటి వరకు 25 వేల దరఖాస్తులొచ్చాయని వివరించారు.

ఫారం నెం.ఐఎన్‌సి-26

కేంద్ర ప్రభుత్వం, రీజినల్ డైరెక్టర్, సౌత్ ఈస్ట్ రీజియన్, హైదరాబాద్ వారి సమక్షంలో కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 13 (4) మరియు కంపెనీస్ (ఇన్‌కార్పొరేషన్) రూల్స్, 2014లోని రూల్ 30 (5) (ఎ) విషయంలో

మరియు

ఏ.వి.డిజిటల్ నెట్‌వర్క్స్ (హెచ్‌వైడి) ప్రైవేట్ లిమిటెడ్,
దీని రిజిష్టర్డు ఆఫీస్: డోర్ నెం.8-2-293/82/ఏ/1312/ఏ, ప్లాట్ నెం.1312/ఏ, రోడ్ నెం.65, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500033 వద్ద కలిగియున్న విషయంలో

...... పిటిషనర్

పిటీషన్ కొరకు ప్రకటన

ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి ప్రకటన ఇవ్వడమేమనగా "తెలంగాణ రాష్ట్రం"నుండి "తమిళనాడు రాష్ట్రానికి" కంపెనీ దీని రిజిష్టర్డు ఆఫీసును మార్పుచేయు ఉద్దేశ్యంతో గురువారం, **29-12-2022** (ఇరవై తొమ్మిది డిసెంబర్ రెండువేల ఇరవై రెండు)న నిర్వహించబడిన అసాధారణ సర్వసభ్య సమావేశంలో ఆమోదించిన ప్రత్యేక తీర్మానం నియమాలను అనుసరించి కంపెనీ యొక్క మెమోరండం ఆఫ్ అసోసియేషన్‌లో మార్పు నిర్ధారణ కోరుతూ కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 13 క్రింద కేంద్ర ప్రభుత్వం వారికి కంపెనీ దరఖాస్తు చేయుటకు ప్రతిపాదిస్తున్నది.

కంపెనీ యొక్క రిజిష్టర్డు ఆఫీసు ప్రతిపాదిత మార్పుకు సంబంధించి ప్రభావితం అయ్యే అవకాశం ఉన్న ఎవరైనా వ్యక్తి, అతని/ఆమె ఆసక్తి స్వభావం మరియు అక్షేపణలకుగల కారణాలు చూపుతూ అఫిడవిట్ మద్దతు ద్వారా అతని/ఆమె అభ్యంతరాలను రిజిస్టర్డు పోస్టు ద్వారా దరఖాస్తుదారైన కంపెనీకి రిజిష్టర్డు ఆఫీసు పై పేర్కొన్న చిరునామా వద్ద ఒక కాపీతో ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి **పద్నాలుగు రోజుల్లోగా** రీజినల్ డైరెక్టర్, సౌత్ ఈస్ట్ రీజియన్, 3వ అంతస్తు, కార్పొరేట్ భవన్, బండ్లగూడ, నాగోల్, తట్టిఅన్నారం గ్రామం, హయాత్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్-500068. తెలంగాణ వారికి పంపవచ్చును లేదా ఇన్వెస్టర్స్ ఫిర్యాదు ఫారం దాఖలు చేయుట ద్వారా ఎంసిఏ-21 పోర్టల్ (www.mca.gov.in) పై బట్వాడా చేయవచ్చును.

వీరి తరపున
ఏ.వి.డిజిటల్ నెట్‌వర్క్స్ (హెచ్‌వైడి) ప్రైవేట్ లిమిటెడ్
సం/- కామేశ్వర రావు వేమూరి
(డైరెక్టర్)
డిఐఎన్-01831177

ప్రదేశం: హైదరాబాద్
తేది: 01-02-2023

లోపాలు సరిదిద్దుకుంటేనే బీఆర్ఎస్ ప్రభుత్వానికి మనుగడ



(మొదటిపేజీ తరువాయి)

బడ్జెట్ సమావేశాల సందర్భంగా గతంలో ప్రభుత్వాలు ఇచ్చిన హామీల అమలు కోసం ఇందిరాపార్క్ వద్ద ధర్నాచౌక్ దద్దరిల్లేది. ఇటీవలి కాలంలో అలాంటి పరిస్థితి లేదు కదా. ఎందుకు?

ప్రభుత్వం ప్రజాస్వామికంగా వ్యవహరించకపోవడమే దీనికి కారణం. గతంలో ప్రభుత్వాలు సమ్మెలు, నిరసనలు జరిగితే చర్చలు జరిపి పరిష్కరించే ప్రయత్నం చేసేవి. కానీ తెలంగాణ వచ్చాక ఆ పరిస్థితి లేదు. అయితే అసంతృప్తి పెరిగేకొద్దీ అణచివేత కూడా పెరుగుతున్నది. ఈ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. అసంతృప్తితో ఉన్న ప్రజల సమస్యలను చర్చించి పరిష్కరించడం లేదు. ఆర్టీసీ కార్మికులు, వీఆర్ఏలు, పంచాయతీ కార్మికులు సమ్మె చేశారు. వారిని పిలిచి చర్చించి ఒప్పందం కుదుర్చుకోలేదు. సమ్మె విరమించాలంటూ ప్రభుత్వం ఒత్తిడి పెంచింది. డిమాండ్ చేయడం కాకుండా అడుక్కోవాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఇంకోవైపు ధర్నాచౌక్‌లో నిరసనలకు అనుమతి ఇవ్వడం లేదు. అందుకే పరిస్థితుల్లో చాలా మార్పు వచ్చింది.

ఈ వారంలో పోడు భూములకు పట్టాలిస్తామంటూ ప్రభుత్వం ప్రకటించింది. ఇది వామపక్షాల విజయంగా భావించవచ్చా.?

వామపక్షాల పోరాటం వల్లే రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగిందనడంలో ఎలాంటి సందేహం లేదు. మునుగోడు ఉప ఎన్నికలు, బీజేపీ ప్రమాదం ముంచుకొస్తున్న తరుణంలో వామపక్షాల అవసరం బీఆర్ఎస్‌కు పెరిగింది. ఈ నేపథ్యంలోనే పోడు భూముల సమస్యను పరిష్కరిస్తామంటూ ప్రభుత్వం ప్రకటించింది. చట్టప్రకారం అర్హులందరికీ పట్టాలివ్వాలి. కానీ గొత్తికోయలకు పట్టాలివ్వబోమంటూ చెప్తున్నది. ఇది సరైంది కాదు. చట్టవిరుద్ధంగా వ్యవహరించొద్దు. అర్హులందరికీ పట్టాలివ్వాలి.

డబుల్ బెడ్రూం ఇండ్లు, నిరుద్యోగ భృతి వంటి వాగ్దానాలను ప్రభుత్వం అమలు చేయడం లేదు. దీన్ని ఏ విధంగా చూడొచ్చు.?

ఇచ్చిన వాగ్దానాల అమల్లో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలున్నాయి. డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణం, సొంత జాగా ఉన్న ఇంటి నిర్మాణం కోసం రూ.మూడు లక్షల సహాయం, దళితులకు మూడెకరాల భూపంపిణీ, రాష్ట్రమంతా దళితబంధు అమలు వంటి హామీలను ఇచ్చింది. కానీ వాటిని సమర్థంగా అమలు చేయడంలో విఫలమవుతున్నది. ఇంకోవైపు రాష్ట్ర ప్రభుత్వం పట్ల కేంద్రం అనుసరిస్తున్న వైఖరి ఇబ్బందికరంగా మారింది. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, గ్రాంట్లు, జీఎస్టీ బకాయిలు సకాలంలో విడుదల కావడం లేదు. తెలంగాణ పట్ల కేంద్రం కక్షపూరితంగా వ్యవహరిస్తున్నది. దీంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం అప్పులు తెచ్చుకోకుండా ఆంక్షలు విధిస్తున్నది. ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం వాగ్దానాలను సక్రమంగా అమలు చేయలేకపోతున్నది. ప్రభుత్వంలోనూ కొన్ని బలహీనతలున్నాయి. శక్తికి మించి వాగ్దానాలు చేయడమూ ఇబ్బందిగా మారింది.

ఈ ప్రభుత్వానికి ఇదే చివరి బడ్జెట్. ఎనిమిదేండ్ల బడ్జెట్లపై మీ అభిప్రాయమేంటి?

ప్రభుత్వాలు ధనికవర్గాలకు అనుకూలంగా బడ్జెట్లను రూపొందిస్తాయి. అయితే రాష్ట్రంలో కొన్ని పథకాలు పేదలకు ఉపయోగపడేలా ఉన్నాయి. కళ్యాణలక్ష్మి, ఆసరా పింఛన్లు అందులో భాగమే. రైతుబంధు పేదలతోపాటు భూస్వాములకూ ఉపయోగపడుతున్నది. 50, 100 ఎకరాలున్న వారికి ఎందుకివ్వాలనే విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాం.

ఇది పరిశీలనలో ఉన్నది. భవిష్యత్తులో పెద్దవారికి నిలిపివేసే అవకాశమున్నది. కొన్ని రాష్ట్రాలతో పోల్చితే మన దగ్గర సంక్షేమ పథకాలు బాగున్నాయి. అయితే ఎవరినీ కలవకపోవడం, ప్రతిపక్షాల పట్ల అసహనం ఉండడం ఇబ్బందికరంగా ఉన్నది. దీంతో మధ్యతరగతి ప్రజల్లో ఈ ప్రభుత్వం పట్ల వ్యతిరేకత ఉన్నది. ఉద్యోగాల కల్పన పూర్తిస్థాయిలో లేదు. నిరుద్యోగ భృతి ఇవ్వలేదు. ఈ ప్రభుత్వంలో లోపాలున్నా భవిష్యత్తులోనూ అది కొనసాగితేనే రాష్ట్రానికి, ప్రజలకు లాభం. బీజేపీ ఎదిగితే ప్రమాదకరం.

రాజకీయంగా బీఆర్ఎస్‌కు కలిసొచ్చే అంశాలకే ఎక్కువ నిధులు, ప్రాధాన్యత ఇస్తున్నది. దీన్ని ఎలా చూడాలి?

ప్రభుత్వ ప్రాధాన్యతల వల్ల అసమానతలు పెరుగుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టుకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నది. అది పూర్తయినా దక్షిణ తెలంగాణలో ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్, వరంగల్ జిల్లాలకు సాగునీరందదు. దేవాదుల, సీతారామసాగర్, డిండి ఎత్తిపోతల, పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల వంటి ప్రాజెక్టులను పూర్తి చేస్తేనే ఆయా జిల్లాలకు ఉపయోగం కలుగుతుంది. భారీ ప్రాజెక్టులే కాకుండా చిన్న, మధ్యతరహా ప్రాజెక్టులకు ప్రాధాన్యతనిచ్చి నిధులు కేటాయించాలి. హైదరాబాద్‌లో ఐటీ పరిశ్రమలు వచ్చినా జిల్లాలకు విస్తరించలేదు. విద్యావైద్యంలో ప్రయివేటురంగ ఆధిపత్యం కొనసాగుతున్నది. ఆ రెండూ ప్రభుత్వరంగంలో ఉంటేనే ప్రజలకు మెరుగైన సేవలందుతాయి.

బడ్జెట్‌లో కేటాయించిన నిధులకు, ఖర్చుకు చాలా తేడా ఉంటున్నది. దీనిపై ఏమంటారు?

బడ్జెట్‌లో భారీగా నిధులను కేటాయించి చూపిస్తున్నారు. దాన్ని చూసి సంతోషపడుతున్నారు. కానీ శాఖల వారీగా ఖర్చును చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. భారీగా కేటాయింపులు చేసి అరకొర నిధులను ఖర్చు చేయడమంటే ప్రజలను మోసం చేయడమే.

ప్రాజెక్టులు, హైవేలు, ఫ్లైఓవర్లు, నూతన సచివాలయం నిర్మాణ పనులకు నిధులు విడుదలవుతున్నాయి. కానీ ఆరోగ్యశ్రీ, ఫీజురీయింబర్స్‌మెంట్, రైతులకిచ్చే సబ్సిడీలు పెండింగ్‌లో ఉంటున్నాయి?

పట్టణాలు పెరుగుతున్నాయి. హైవేలు, ఫ్లైఓవర్లు అవసరమే. అయితే గ్రామీణ ప్రాంతాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. గిరిజన, ఆదివాసీ ప్రాంతాల్లో విషజ్వరాలతో చనిపోయే పరిస్థితి ఇప్పటికీ ఉన్నది. కానీ హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ సేవలు, గుండె మార్పిడి చికిత్స అందుతున్నది. ఈ పరిస్థితిలో మార్పు రావాలి. కేరళలో మండల కేంద్రంలోనూ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులున్నాయి. విద్యావైద్యరంగాల్లో దేశానికే ఆ రాష్ట్రం ఆదర్శం.

ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఒకటో తేదీన జీతాలు రాని పరిస్థితి ఉన్నది. దీనిపై ఏమంటారు?

తెలంగాణ ధనికరాష్ట్రం. కానీ ప్రజలు ధనికులు కాదు. హైదరాబాద్ ఉండడం వల్ల ఆదాయం వస్తున్నది. అయినా ఉద్యోగులకు జీతాలు, కాంట్రాక్టర్లకు నిధులివ్వలేని పరిస్థితి ఇప్పుడు వచ్చింది. కేంద్రం సహాయ నిరాకరణ చేస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నది. కోవిడ్ వచ్చినపుడు కేంద్రం సహాయం చేయలేదు. అన్ని రంగాలు కుదేలయ్యాయి. జీఎస్టీ బకాయిలు, గ్రాంట్లు, నిధులు విడుదల చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నది. ఇంకోవైపు రాష్ట్ర ప్రభుత్వం తలకు మించిన వాగ్దానాలను చేయడంతో ఉద్యోగులకు జీతాలు, డీఏలు చెల్లించలేని పరిస్థితి ఇచ్చింది.

మాజీ ఎంపీ, ఎమ్మెల్యేగా ప్రస్తుత చట్టసభల పనితీరు, పనిదినాలపై మీ స్పందన?

గతంలో బాగుందని కాదు. ఇప్పటి కంటే మెరుగ్గా ఉండేది. సభ్యులు లేవనెత్తిన అంశాలను మంత్రులు రాసుకుని సమాధానం ఇచ్చేవారు. బడ్జెట్‌లో సవరణలు కూడా జరిగేవి. ఇప్పుడు చట్టసభల్లో ప్రజాస్వామ్య వాతావరణం కనిపించడం లేదు. ప్రభుత్వం, ప్రతిపక్షం అంటే అర్థాన్నే మార్చారు. ప్రతిపక్షం చేసే విమర్శలను ప్రభుత్వం వినాలి. ఒక సెక్షన్ ప్రజల్లో ఉన్న అభిప్రాయాలను ప్రతిపక్షం ప్రభుత్వం దృష్టికి తెస్తుంది. పైకి విమర్శించినా ప్రభుత్వానికి ప్రతిపక్షం సాధనంగా ఉపయోగపడుతుంది.


వాస్తవాలను గ్రహించి ప్రజల్లో ఉన్న అసంతృప్తిని పోగొట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. కానీ ప్రతిపక్షాలను అణచివేయడానికి, వాటిని లేకుండా చేసేందుకు అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో అప్రజాస్వామికంగా వ్యవహరించడం సరైంది కాదు. నయా ఉదారవాద విధానాలు అమల్లోకి వచ్చాక నియంతృత్వం పెరిగింది.

కేంద్ర ప్రభుత్వ విధానాలనే విమర్శిస్తున్నారు రాష్ట్ర ప్రభుత్వ లోపాలను ప్రశ్నించడం లేదన్న అభిప్రాయం వినిపిస్తున్నది. ఏమంటారు?

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మతోన్మాదంతోపాటు కార్పొరేటీకరణ, ప్రయివేటీకరణ విధానాలను అవలంభిస్తున్నది. ప్రజావ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్నది. అందుకే వ్యతిరేకిస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వంలో ఉన్న లోపాలను సీఎం దృష్టికి తీసుకెళ్తున్నాం. బహిరంగంగా ప్రకటించడం లేదు. బీజేపీకి అవకాశమిచ్చే ఏ పనిచేయడం లేదు. రాజకీయంగా ఈ ప్రభుత్వం బలహీనపడొద్దన్నదే మా అభిప్రాయం. బీజేపీ బలపడితే ప్రమాదకర పరిస్థితులు ఉత్పన్నమవుతాయి. ఇది రాష్ట్రానికి, ప్రజలకు నష్టం కలిగిస్తుంది.

అసమానతలు పెంచే బడ్జెట్

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ భారతదేశంలో అసమానతలను మరింత పెంచేదిగా ఉన్నదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. రైతులు, పేదలను కొట్టి కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టేవిధంగా ఇది ఉందని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇది ప్రజావ్యతిరేకమనీ, అత్యంత చెత్త బడ్జెట్ అని విమర్శించారు. ఇందులో రాష్ట్రానికి మొండి చేయి చూపిందని పేర్కొన్నారు.

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి గతేడాది రూ.93 వేల కోట్లు కేటాయిస్తే, ఇప్పుడు రూ.60 వేల కోట్లకు తగ్గించారని వివరించారు. దేశంలో ధనవంతుల సంపద అంతకంతకూ పెరుగుతున్నదనీ, పేదలు మరింత పేదలవుతున్నారని పేర్కొన్నారు. ధనవంతులపై 10 శాతం పన్ను విధిస్తే విద్యా వైద్యం పేదలకు ఉచితంగా అందించొచ్చని సూచించారు. అలాంటి చర్యలు తీసుకోకుండా కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాసేలా కేంద్ర నిర్ణయాలున్నాయని విమర్శించారు. రాష్ట్రానికి సంబంధించి ఖాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్శిటీల ఊసేలేదని తెలిపారు. రాష్ట్రానికి రావాల్సిన బకాయి లకు సంబంధించి ఈ బడ్జెట్‌లో పొందుపరచలేదని పేర్కొన్నారు. జీఎస్టీతోపాటు మరోసారి సెస్‌ల పేరుతో దోపిడీ చేస్తున్నదని విమర్శించారు. జీఎస్టీలో రాష్ట్రాలకు వాటాల పెంపుదలకు సంబంధించిన ప్రస్తావన లేదని తెలిపారు.

పటాటోప బడ్జెట్ : ప్రజాపంథా

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరుద్యోగులను, రైతులను, మధ్యతరగతి ప్రజలను నిరాశపర్చిందని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు విమర్శించారు. కార్పొరేట్ వర్గాలను సంతృప్తిపరిచేలా ఉందని ఒక ప్రకటనలో తెలిపారు. అది మాయామశ్చీంద్ర, మెరుపుల, పటాటోప, మేడిపండు బడ్జెట్ అని ఎద్దేవా చేశారు. బీజేపీ మార్క్ స్వదేశీ ముసుగు, కార్పొరేట్ బడ్జెట్ అని విమర్శించారు.

వ్యవసాయానికి కోతలా?

- రైతుల ఆదాయం రెట్టింపు ఎలా సాధ్యం...?
- కేంద్రానికి తెలంగాణ రైతు సంఘం ప్రశ్న

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వ్యవసాయానికి బడ్జెట్‌లో కోతలు విధించి, రైతుల ఆదాయాన్ని ఎలా రెట్టింపు చేస్తారని తెలంగాణ రైతు సంఘం కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఈమేరకు బుధవారం ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతినేని సుదర్శన్, టి సాగర్ ఒక ప్రకటన విడుదల చేశారు. 2023-24లో కేంద్ర ప్రభుత్వం వ్యవసాయానికి రూ.1,15,531.79 కోట్లు కేటాయించిందనీ, అందులో వ్యవసాయానికి రూ.71,378 కోట్లు మాత్రమే కేటాయించి,మిగిలిన నిధులు పథకాలకు వెచ్చించిందని పేర్కొన్నారు. అన్ని అనుమతులు పొందిన సాగునీటి వనరులకు కేంద్రం నుంచి అన్ని రాష్ట్రాలకు రూ.4వేలు కోట్లు ఇస్తుండగా, గతేడాది నుంచి దానిని తగ్గించిందని గుర్తు చేశారు. పరిశోధనలకు గతంలో రూ.8,513 కోట్లు ఇవ్వగా దానిని రూ.9వేల కోట్లకు పెంచినప్పటికీ పరిశోధనలకు మాత్రం రూ.8,941 కోట్లు మాత్రమే కేటాయించారని విమర్శించారు. పశు సంవర్ధక శాఖకు గతంలో రూ.4వేల కోట్లు కేటాయించగా, ప్రస్తుతం రూ.4,687 కోట్లమేర నామమాత్రంగా పెంచిందని తెలిపారు. వ్యవసాయ రంగానికి మొత్తం బడ్జెట్‌లో 3.2 శాతం మాత్రమే నిధులు కేటాయించారని పేర్కొన్నారు. ప్రకతి వైపరీత్యాల వల్ల పెద్ద ఎత్తున నష్టం జరుగుతున్నప్పటికీ కేంద్రం బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు చేయలేదని విమర్శించారు. రైతు రుణమాఫీ పథకాన్ని అమలు చేయకపోవడం వల్ల బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు ముందుకు రావడంలేదని పేర్కొన్నారు. మార్కెట్లలో కనీస మద్దతు ధరలు అమలు కావడం లేదని తెలిపారు. ఈ పరిస్థితుల దృష్ట్యా వ్యవసాయ బడ్జెట్‌ను పున:పరిశీలించాలని డిమాండ్ చేశారు. లేదంటే దేశవ్యాప్త ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

హామీలను విస్మరించిన బీజేపీ సర్కారు

- కేంద్ర బడ్జెట్‌పై ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను కేంద్రంలోని బీజేపీ సర్కారు మరోసారి విస్మరించిందని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆ బడ్జెట్ వల్ల రాష్ట్ర ప్రజలకు ఉపయోగం లేకుండా పోయిందని విమర్శించారు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, గిరిజన విశ్వవిద్యాలయం ఊసేలేదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విభజన చట్టాన్ని ఆమోదించి పదేండ్లు అవుతున్నా ఇప్పటిదాకా బీజేపీ ప్రభుత్వం ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని విమర్శించారు. బడ్జెట్‌లో కూడా బీజేపీ రాజకీయం చేసిందని పేర్కొన్నారు. ఎన్నికలున్న రాష్ట్రాలకు వెసులుబాటు ఇచ్చిందనీ, ఇతర రాష్ట్రాలకు అన్యాయం చేసిందనీ, పన్ను మినహాయింపు సగటు జీవికి నిరాశపరిచిందని పేర్కొన్నారు.

దేశ రైతాంగాన్ని, అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలను నిరుత్సాహపరిచేలా బడ్జెట్ ఉందని తెలిపారు. టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ పెత్తందారులకి అనుకూల బడ్జెట్‌గా ఉందని తెలిపారు. ప్రధాన కార్యదర్శి నగేష్‌ముదిరాజ్ మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులకు లాభం చేసే పనిలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఉన్నారని విమర్శించారు.

ఉద్యోగాలు పర్మినెంట్ చేయాల్సిందే

- మహారాష్ట్ర సీహెచ్‌వోల ఒక రోజు సమ్మె విజయవంతం

ముంబయి: ఉద్యోగాలు పర్మినెంట్ చేయా లని డిమాండ్ చేస్తూ మహారాష్ట్రలోని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (సిహెచ్‌ఓలు) బుధవారం ఒక రోజు సమ్మె నిర్వహించారు. ముంబయి అజాద్ మైదానంలో జరిగిన ఈ కార్యక్రమానికి భారీ సం ఖ్యలో హాజరయ్యారు. ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని, పని ఒత్తిడి తగ్గించాలని, వేతనాలు సకాలంలో అందించాలని, రాష్ట్ర ప్రభుత్వం బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాం తాల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు కాంట్రాక్ట్ ఉద్యోగులుగా కొనసాగుతున్నారు. సిహెచ్‌ఓలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది 5 శాతం వరకూ నెలవారీ వేతనాలు పెంపు అమలు చేసేదని, 2017 నుంచి దీనిని అమలు చేయడం లేదని, ఆ బకాయిలను ప్రభుత్వం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

బుట్టబొమ్మ విజయం ఖాయం



శౌరి చంద్రశేఖర్. టి.రమేష్

సితార ఎంటర్టైన్మెంట్స్ నుంచి వస్తున్న మరో ఆసక్తికరమైన చిత్రం 'బుట్ట బొమ్మ'. ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ భాగస్వామ్యంతో సితార ఎంటర్టైన్మెంట్స్ నిర్మించిన ఈ ఫీల్ గుడ్ రూరల్ డ్రామాకి సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మాతలు. అనిఖా సురేంద్రన్, సూర్య వశిష్ఠ, అర్జున్ దాస్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రంతో శౌరి చంద్రశేఖర్ రమేష్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ చిత్రం ఈనెల 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో దర్శకుడు శౌరి చంద్రశేఖర్ రమేష్ మీడియాతో మాట్లాడుతూ, సినిమాలపై ప్యాషన్‌తో రామ్ గోపాల్ వర్మకి చెందిన వర్మ కార్పొరేషన్‌లో పనిచేశాను. తర్వాత సుకుమార్ దగ్గర 'జగడం' నుంచి 'పుష్ప' సినిమా వరకు పని చేశాను. 'కప్పేల' చిత్రాన్ని చూశాను. కథనం పరంగా చాలా నచ్చింది. ఇది పూర్తిగా స్క్రిప్ట్ మీద ఆధారపడిన సినిమా. మెయిన్ పాయింట్‌ని తీసుకొని మన తెలుగు నేటివిటీకి తగ్గట్లు చాలా మార్పులు చేశాం. ఈ సినిమాలోని ప్రధాన పాత్రలు ప్రేక్షకులకు గుర్తుండిపోతాయి. ఈ సినిమాలో సంగీతానికి చాలా ప్రాధాన్యముంది. గోపీసుందర్ ఒక పాట, నేపథ్య సంగీతం అందించారు. స్వీకర్ అగస్తి రెండు పాటలు స్వరపరిచారు. ఈ సినిమా చూసి నిర్మాత చినబాబు, త్రివిక్రమ్ బాగుందని ప్రశంసించారు. వీళ్ళ మాదిరిగానే ప్రేక్షకులను సైతం అలరించి విజయం సాధిస్తుంది' అని తెలిపారు.

బెలూన్స్ అమ్ముకునే కుర్రాడి లవ్‌స్టోరీ



రోహిణి హట్టంగడి, జశ్విక, పార్వతీశం

పార్వతీశం, జశ్విక జంటగా శ్రీబాలాజీ పిక్చర్స్ బ్యానర్‌పై వైభవ్ దర్శకత్వంలో వర్షా ముందాడ, మాధవి నిర్మిస్తున్న న్యూ ఏజ్ ప్లాటోనిక్ లవ్ స్టోరీ 'తెలుసా..మనసా..'. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే చిత్రమిది. ఓ గ్రామంలో బెలూన్స్ అమ్ముకునే యువకుడు (పార్వతీశం), అదే ఊర్లో పని చేసే హెల్త్ అసిస్టెంట్ సుజాత (జశ్వికా)ను ప్రేమిస్తాడు. ఇద్దరికీ ఒకరిపై ఒకరికి ప్రేమ ఉంటుంది. కానీ ఎప్పుడూ వారిద్దరూ ఆ ప్రేమను వ్యక్తం చేసుకోరు. మల్లి బాబు పలు సందర్భాల్లో తన ప్రేమను సుజాతతో చెప్పటానికి ప్రయత్నిస్తాడు. కానీ చెప్పలేకపోతాడు. అయితే ఉన్నట్లుండి మల్లి బాబు కలలు కూలిపోతాయి. సుజాతకు దూరం కావాల్సి వస్తుంది. మరి వారిద్దరూ కలుసుకున్నారా! అనేదే ఈ సినిమా. ప్రస్తుతం సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది.

బుధవారం ఈ చిత్ర ఫస్ట్ లుక్‌ను నిర్మాత దిల్ రాజు విడుదల చేసి, చిత్ర యూనిట్‌కి అభినందనలు తెలిపారు. డెబ్యూ డైరెక్టర్ వైభవ్ ఈ చిత్రాన్ని న్యూ ఏజ్ లవ్ స్టోరీగా తెరకెక్కిస్తున్నారు. నేషనల్ అవార్డ్ విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్ గోపీ సుందర్ సంగీత సారథ్యం వహిస్తున్నారు. ప్రసాద్ ఈదర సినిమాటోగ్రఫీ అందిస్తున్న ఈ చిత్రానికి పాపారావ్ ఎడిటర్‌గా వర్క్ చేస్తున్నారు. ఈ చిత్రానికి సమర్పణ: నైనీష్య, సాత్విక్, కో ప్రొడ్యూసర్: గిరిధర్.

నవచిత్రం

కొత్త ఒరవడిని సృష్టిస్తుంది



సందీప్ కిషన్, దివ్యాంశ కౌశిక్

హీరో సందీప్ కిషన్ నటించిన పాన్ ఇండియా సినిమా 'మైఖేల్'. రంజిత్ జయకోడి దర్శకుడు. కరణ్ సి ప్రొడక్షన్స్ ఎల్ఎల్‌పి, శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పి కలిసి ఈ చిత్రాన్ని నిర్మించాయి. భరత్ చౌదరి, పుస్కూర్ రామ్ మోహన్ రావు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి నారాయణ్ దాస్ కె నారంగ్ సమర్పకులు. ఈనెల 3న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ కానున్న నేపథ్యంలో చిత్ర యూనిట్ గ్రాండ్‌గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన హీరో నాని మాట్లాడుతూ, 'మైఖేల్ టీజర్, ట్రైలర్, విజువల్స్, పెర్ఫార్మెన్స్‌లు చూస్తుంటే కొత్త ఒరవడి మొదలతుందనిపిస్తుంది. 'శివ' వచ్చినప్పుడు మిగతా సినిమాలతో కొత్తగా అనిపించింది. అలాంటి సినిమా మైఖేల్ అవ్వాలని కోరుకుంటున్నాను' అని తెలిపారు.

'నా బ్లడ్ మొత్తం పెట్టి ఈ సినిమా చేశానని చాలా మంది చెప్పారు. అయితే ఇది జస్ట్ బిగినింగ్ మాత్రమే. ఇలానే ప్రేమ చూపిస్తూ వుంటే, ఇంకా అద్భుతంగా పని చేస్తాను' అని సందీప్‌కిషన్ అన్నారు.

దర్శకుడు రంజిత్ జయకోడి మాట్లాడుతూ, 'ఈ సినిమాలో పని చేసిన అందరికీ పేరుపేరున కృతజ్ఞతలు' అని చెప్పారు.

ఊహకు అందని కాన్సెప్ట్



యం.నాగేంద్ర, చిత్ర, మహావీర్

ప్రముఖ నేపథ్య గాయని చిత్ర పాడిన 'శ్రీ రాముడా, కృష్ణుడా, ఈశ్వరుడా..' అనే పాట రికార్డింగ్‌తో యం.యన్.ఆర్. ఆర్ట్స్ బ్యానర్ పై ఎంతో గ్రాండ్‌గా ప్రారంభమైన నూతన చిత్రం 'ఊహకు అందనిది'. ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో హై గ్రాఫిక్స్‌తో పాటు అత్యంత హై టెక్నికల్ వ్యాల్యూస్‌తో నిర్మించబోతున్నారు. ఇది ఒక సస్పెన్స్ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో వస్తున్న మూవీ అనేది అందరికీ అర్థమవుతుంది. ఇప్పటివరకు వచ్చిన 'అమ్మోరు, అరుంధతి' వంటి అత్యంత భారీ బడ్జెట్ సినిమాలకూ ఏ మాత్రం తీసిపోని విధంగా తీయడానికి సిద్ధపడుతున్నారు నిర్మాతలు. హైదరాబాద్‌తో పాటు చెన్నైలోనూ భారీ ఎత్తున సెట్టింగ్స్ వేసి షూటింగ్ జరపడానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. ఏప్రిల్‌లో షూటింగ్ మొదలు పెట్టి డిసెంబర్‌లో చిత్రాన్ని పూర్తి చేసి, జనవరిలో విడుదల చేయాలని చిత్ర యూనిట్ భావిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం : మహావీర్, లిరిక్స్ : యం.యన్.ఆర్. రచన-దర్శకత్వం : యం.నాగేంద్ర (యం.యన్.ఆర్).

శివాలెత్తిన శుభ్‌మన్

మూడో టి20లో న్యూజిలాండ్‌పై 168పరుగుల తేడాతో రికార్డు గెలుపు

సిరీస్ 2-1తో కైవసం



గిల్ (126నాటౌట్)

అహ్మదాబాద్: న్యూజిలాండ్‌తో జరిగిన మూడో, చివరి టి20లో టీమిండియా 168 పరుగుల తేడాతో గెలిచి రికార్డు నెలకొల్పింది. ఈ ఫార్మాట్‌లో భారత్ ఇన్ని పరుగుల తేడాతో గెలుపొందడం ఇదే ప్రథమం. టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 234పరుగుల భారీస్కోర్‌ను చేసింది. యువ సంచలనం శుభ్‌మన్ గిల్(126నాటౌట్) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. భారీ లక్ష్య ఛేదనలో న్యూజిలాండ్ జట్టు 12.1 ఓవర్లలో కేవలం 66 పరుగులకే కుప్పకూలింది.

తొలుత టీమిండియా ఇన్నింగ్స్‌ను ఇషాన్ కిషన్, గిల్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించారు. అయితే కేవలం మూడు బంతులను మాత్రమే ఎదుర్కొన్న ఇషాన్ ఒక పరుగు మాత్రమే చేసి ఎల్బీగా పెవీలియన్‌కు చేరాడు. ఆ తర్వాత త్రిపాఠి-శుభ్‌మన్ కలిసి న్యూజిలాండ్ బౌలర్లను ఊచకోత కోశారు. ఓవైపు రాహుల్ త్రిపాఠి(44; 3సిక్సర్లు, 4ఫోర్లు) చెలరేగి ఆడగా.. మరో ఎండ్‌లో శుభ్‌మన్ బంతిని బౌండరీ లైన్‌కు తరలించడమే పనిగా పెట్టుకున్నాడు. శుభ్‌మన్ కేవలం 63 బంతుల్లో 12ఫోర్లు, 7సిక్సర్లతో 126పరుగులు చేశాడు. అలాగే టి20 కెరీర్లో తొలి సెంచరీని సాధించాడు. ఆ తర్వాత సూర్యకుమార్ యాదవ్(24; ఫోర్, 2సిక్సర్లు)కి తోడు హార్దిక్ పాండ్యా(30; సిక్సర్, 4ఫోర్లు) బ్యాటింగ్‌లో రాణించారు. కివీస్ బౌలర్లలో బ్రాస్‌వెల్, టిక్నర్, సోధి, మిచెల్ చెరో వికెట్ దక్కాయి.

భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ జట్టు 7పరుగులకే 4వికెట్లు కోల్పోయి తొలుతే ఓటమిని అంగీకరించింది. మిచెల్(35), సాంట్నర్(13) మాత్రమే రెండంకెల స్కోర్ చేయగలిగారు. మిగతా బ్యాటర్స్ ఘోరంగా విఫలమయ్యారు. దీంతో న్యూజిలాండ్ ఇన్నింగ్స్ 12.1 ఓవర్లలో 66పరుగులకే కుప్పకూలింది. హార్దిక్‌కు నాలుగు, శివమ్ మావి, అర్ష్‌దీప్, ఉమ్రన్ మాలిక్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్.. శుభ్‌మన్‌కు, సిరీస్ హార్దిక్ పాండ్యాకు లభించాయి. దీంతో మూడు టి20ల సిరీస్‌ను టీమిండియా 2-1తో చేజిక్కించుకుంది.

స్కోర్‌బోర్డు..

ఇండియా ఇన్నింగ్స్: ఇషాన్ కిషన్ (ఎల్‌బి)బ్రాస్‌వెల్ 1, శుభ్‌మన్ (నాటౌట్) 126, త్రిపాఠి (సి)ఫెర్గుసన్ (బి)ఇష్ సోధీ 44, సూర్యకుమార్ (సి)బ్రాస్‌వెల్ (బి)టిక్నెర్ 24, హార్దిక్ (సి)బ్రాస్‌వెల్ (బి)మిచెల్ 30, దీపక్ హుడా (నాటౌట్) 2, అదనం 7. (20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 234పరుగులు. **వికెట్ల పతనం:** 1/7, 2/87, 3/125, 4/228 **బౌలింగ్:** లిస్టర్ 4-0-42-0, బ్రాస్‌వెల్ 1-0-8-1, ఫెర్గుసన్ 4-0-54-0, టిక్నెర్ 3-0-50-1, ఇష్ సోధీ 3-0-34-1, సాంట్నర్ 4-0-37-0, మిచెల్ 1-0-6-1,

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: అలెన్ (సి)సూర్యకుమార్ (బి)హార్దిక్ 3, కాన్వే (సి)హార్దిక్ (బి)అర్ష్‌దీప్ 1, ఛాప్మన్ (సి)ఇషాన్ (బి)అర్ష్‌దీప్ 0, ఫిలిప్స్ (సి)సూర్యకుమార్ (బి)హార్దిక్ 2, మిచెల్ (సి)శివమ్ మావి (బి)ఉమ్రన్ మాలిక్ 35, బ్రాస్‌వెల్ (బి)ఉమ్రన్ మాలిక్ 8, సాంట్నర్ (సి)సూర్యకుమార్ (బి)శివమ్ మావి 13, ఇష్ సోధీ (సి)త్రిపాఠి (బి)శివమ్ మావి 0, ఫెర్గుసన్ (సి)ఉమ్రన్ మాలిక్ (బి)హార్దిక్ 0, టిక్నెర్ (సి)ఇషాన్ (బి)హార్దిక్ 1, లిస్టెర్ (నాటౌట్) 0, అదనం 3. (12.1 ఓవర్లలో ఆలౌట్) 66పరుగులు. **వికెట్ల పతనం:** 1/4, 2/4, 3/5, 4/7, 5/21, 6/53, 7/53, 8/54, 9/66 **బౌలింగ్** : హార్దిక్ 4-0-16-4, అర్ష్‌దీప్ 3-0-16-2, ఉమ్రన్ మాలిక్ 2.1-0-9-2, కుల్దీప్ యాదవ్ 1-0-12-0, శివమ్ మావి 2-0-12-2.

క్రీడలకూ కంటితుడుపే..!

'ఖేలో ఇండియా'కు అధిక నిధులు

ఆసియా, పారిస్ ఒలింపిక్స్ సన్నద్ధతకు నామమాత్రమే..

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన బడ్జెట్‌లో క్రీడలకు రూ.3,397.32కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటివరకు ప్రకటించిన బడ్జెట్‌లలో ఇదే అత్యధికమని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం.. ఆ నిధులు ఏ మూలకూ సరిపోవని క్రీడా విశ్లేష కులు అంటున్నారు. గత ఏడాది క్రీడలకు రూ.3,062కోట్ల బడ్జెట్ ప్రకటించగా.. ఈసారి రూ.3,397.32 కోట్లుగా అంచనా వేసింది. ఈ ఏడాది చైనా వేదికగా ఆసియా క్రీడలు జరగ నుండగా.. వచ్చే ఏడాది పారిస్ ఒలింపిక్స్ జరగనున్నాయి. బడ్జెట్‌కు కేటాయించిన మొత్తంలో ఖేలో ఇండియా(నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ డెవలప్ మెంట్ ఆఫ్ స్పోర్ట్స్)కే రూ.1,045కోట్లు కేటాయించారు. 2022 లో ఖేలో ఇండియాకు కేటాయించిన మొత్తం (రూ.606కోట్లు)తో పోల్చిచూస్తే ఇది దాదాపు రెండింతలు. అలాగే నేషనల్ స్పోర్ట్స్ ఫెడరేషన్స్ (ఎన్ఎస్ఎఫ్)కు గత బడ్జెట్‌లో 280 కోట్లు కేటాయించగా.. ఈసారి దాన్ని రూ.325 కోట్లకు పెంపుదల చేశారు. అలాగే నేషనల్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ(నాడా), ప్రపంచ యాంటీ డోపింగ్ ఏజెన్సీ(వాడా)తోపాటు నేషనల్ డోప్ టెస్టింగ్ లాబొరేటరీ(ఎన్‌డిటిఎల్)కు ఈ కేటాయిం పుల్లోనే ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా నాడాకు రూ.21.73కోట్లు, ఎన్‌డిటి ఎల్‌కు రూ.19.50కోట్లుతోపాటు వాడాకు రూ.4కోట్లు మంజూరు చేసింది. పైవన్నీ పోను మిగిలిన మొత్తం క్రీడాకారులను సన్నద్ధం సరిపోవని వారంటున్నారు.

	నేషనల్ ఫెడరేషన్స్	ఖేలో ఇండియా	కేంద్రప్రభుత్వ స్కీమ్	క్రీడాభివృద్ధికి నిధి
2022	రూ.280కోట్లు	రూ.974కోట్లు	రూ.1832.50కోట్లు	రూ.73కోట్లు
2023	రూ.325కోట్లు	రూ.1000కోట్లు	రూ.1913.51కోట్లు	రూ.62కోట్లు

ఆంధ్ర 379 ఆలౌట్

ఇండోర్: మధ్యప్రదేశ్‌తో జరుగుతున్న రంజీట్రోఫీ క్వార్టర్‌ఫైనల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 379పరుగులకు ఆలౌటైంది. ఓవర్ నైట్ స్కోర్ 2వికెట్ల నష్టానికి 262పరుగులతో గురువారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్రప్రదేశ్ జట్టు మరో 117పరుగులు జతచేసి 8వికెట్లు కోల్పోయింది. కీపర్ రికీ బుయ్(149), కరణ్ షిండే(110) సెంచరీలతో కదం తొక్కారు. వీరిద్దరూ ఔటయ్యాక లలిత్ మోహన్(22) మినహా మరో బ్యాటర్ రాణించలేకపోయారు. లోయర్ ఆర్డర్ బ్యాటర్స్ ఘోరంగా విఫలమయ్యారు. అనుభవ్ అగర్వాల్‌కు నాలుగు, కార్తికేయ, గౌరవ్ యాదవ్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. అనంతరం తొలిఇన్నింగ్స్ ప్రారంభించిన మధ్యప్రదేశ్ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 4వికెట్ల నష్టానికి 144 పరుగులు చేసింది. శుభమ్ శర్మ(51) అర్ధసెంచరీకి తోడు ఓపెనర్లు యశ్ దూబే (20), హిమాన్షు(22), పటీధర్(20) ఫర్వాలేదని పించారు. రెండోరోజు ఆట ముగిసే సమయానికి కెప్టెన్ శ్రీవాత్సవ(20), అనుభవ్ అగర్వాల్(0) క్రీజ్‌లో ఉన్నారు. శశికాంత్‌కు రెండు, నితీశ్ కుమార్, పృథ్వీరాజ్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

9న మహాధర్నాను విజయవంతం చేయండి

- పేదలకు ఇండ్ల స్థలాల పట్టాలివ్వాలి
- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి



నవతెలంగాణ-కోదాడరూరల్

నిరుపేదలకు ఇండ్లు, స్థలాలు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సాధన కోసం ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈనెల 9న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాధర్నాకు వేలాదిగా ప్రజలు తరలిరావాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండల పరిధిలోని కాపుగల్లు గ్రామంలో పేదలు వేసుకున్న గుడిసెలను బుధవారం ఆమె సందర్శించారు. పేదల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇండ్ల స్థలాల కోసం భూములు కొనుగోలు చేసి పట్టాహక్కులిచ్చి చేతులు దులుపుకుందని విమర్శించారు. కొనుగోలు చేసిన స్థలాలకు పొజిషన్ చూపించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెండేండ్లుగా గుడిసెలు వేసుకొని నివాసముంటున్న పేదలందరికీ పట్టా హక్కులు కల్పించి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. 30 ఏండ్ల కింద పేదల ఇండ్ల స్థలాల కోసం కొనుగోలు చేసిన భూముల్లో ఇప్పుడు పల్లె ప్రకృతివనం, రైతువేదికలు నిర్మించడం సరికాదన్నారు. అనేక గ్రామాల్లో పేద ప్రజలకు ఇంటి స్థలాలు లేక ఒకే ఇంట్లో మూడు నాలుగు కుటుంబాలు జీవిస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పేదలు గుడిసెలు వేసుకున్న స్థలాల్లో పట్టా హక్కులు కల్పించి ఇండ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. సొంత స్థలం ఉన్న ప్రతి పేదవాడికీ రూ.5 లక్షలు మంజూరు చేసి సొంతింటి కలను నెరవేరే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు అరుణజ్యోతి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ములకలపల్లి రాములు, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెలిది పద్మావతి, సోమపంగు జానయ్య, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కాసాని కిషోర్, గుడిసెవాసుల సంఘం నాయకులు జిల్లాబోసు, రంజాన్‌బీ, లక్ష్మణ్, బేబీ తదితరులు పాల్గొన్నారు.

గండ్ర దంపతులకు 'డబుల్ ఇండ్ల'పై నిరసన సెగ

- ప్లకార్డులతో నిరసన, రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్



నవతెలంగాణ- శాయంపేట

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ గండ్రజ్యోతికి నిరసన తెగ తాకింది. శాయంపేటలో అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి వెళ్లిన వారిని.. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని, రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు నిరసన తెలిపారు. బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయానికి, పాత పోలీస్ స్టేషన్ సమీపంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే, జడ్పీ చైర్‌పర్సన్ శంకుస్థాపన చేశారు. తిరిగి వెళ్తున్న క్రమంలో గ్రామస్తులు ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. రోడ్డు వెడల్పు నిర్మాణ కోసం స్వచ్ఛందంగా ఇండ్లను కూలగొట్టుకున్నామని, ఏడాది గడుస్తున్నా ఇప్పటివరకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు ప్రొసీడింగ్ కాపీ అందజేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. వెంటనే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే రోడ్డు వెడల్పు కోసం గ్రామపంచాయతీ నిధుల నుంచి రూ.6,41,320 నాలుగు నెలల కిందటే విద్యుత్ శాఖకు చెల్లించారని, విద్యుత్ స్తంభాల క్రమబద్ధీకరణ పూర్తికాగానే రోడ్డు పనులు పూర్తి చేస్తామని తెలిపారు. అర్హులందరికీ త్వరలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు.

రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శిగా నవీన్‌మిట్టల్ బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి నవీన్ మిట్టల్ బాధ్యతలు స్వీకరించారు. బుధవారం మధ్యాహ్నం సచివాలయంలో ఆ శాఖ అధికారులు, సిబ్బంది మధ్య ఛార్జీ తీసుకున్నారు. ఈసందర్భంగా సచివాలయ సంఘం, వీఆర్‌వో,వీఆర్‌ఏ సంఘాల ప్రతినిధులు నవీన్‌మిట్టల్‌ను కలిసి అభినందనలు తెలిపారు. దీర్ఘకాలికంగా సీసీఎల్ఏకు పూర్తిస్థాయి అధికారి లేకపోవడంతో ఆ శాఖలో కొంత స్తబ్దత నెలకొంది. ఇప్పటిదాకా సాంకేతిక విద్య, ఇంటర్మీడియట్ విద్యాశాఖ కార్యదర్శిగా ఇంటర్ బోర్డుకు కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన సంగతి తెలిసిందే. నవీన్‌మిట్టల్ ఏ శాఖలో పనిచేసినా, ఆ శాఖలో సంస్కరణలు ప్రవేశపెట్టి పనితీరు మెరుగుపరుస్తారనే పేరుందని ఆయా సంఘాల ప్రతినిధులు అభిప్రాయడుతున్నారు. గత నాలుగేండ్లుగా ఇటు రెవెన్యూ శాఖ, అటు సీసీఎల్ఏలోనూ ఉన్నతస్థాయిలో అధికారులు లేకపోవడంతో సమస్యలు పేరుకుపోయాయనే వ్యాఖ్యానాలు రెవెన్యూ శాఖలో వినిపిస్తున్నాయి. అలాగే ధరణి ఇప్పటికీ బాలారిష్టాలను ఎదుర్కొంటున్న విషయమూ విదితమే. అలాగే రిజిస్ట్రేషన్ల శాఖలోనూ సమస్యలు నెలకొన్నాయి. ఈనేపథ్యంలో నవీన్‌మిట్టల్ రావడం మంచి పరిణామమని ఆ శాఖ ఉద్యోగులు చెబుతుండటం గమనార్హం.

బైకును ఢీకొట్టిన కారు తల్లీకొడుకు మృతి

- నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లిలో ఘటన



నవతెలంగాణ-పెద్ద అడిశర్లపల్లి

బైకును కారు ఢీకొట్టడంతో తల్లీకొడుకు మృతిచెందారు. ఈ ఘటన నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలంలోని చిలకమర్రి స్టేజి సమీపంలో బుధవారం జరిగింది. గుడిపల్లి ఎస్ఐ ఏ.రంజిత్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ ప్రకాశం జిల్లా సంతమవులూరు గ్రామానికి చెందిన గంజి ఎలమంద, వెంకాయమ్మ దంపతులు దేవరకొండలోని తాటికోల్ గ్రామంలో 20 ఏండ్ల నుంచి నివాసం ఉంటున్నారు. తాపీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కొడుకు, కూతురు సంతానం. బుధవారం ఉదయం తల్లీకొడుకు స్వగ్రామానికి బైకుపై బయలుదేరారు. జడ్చర్ల- కోదాడ 167 జాతీయ రహదారిపై చిలకమర్రి స్టేజి సమీపంలో ఎదురుగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. బైకు పెట్రోల్ ట్యాంక్ పగిలి పూర్తిగా దగ్ధమైంది. తీవ్రంగా గాయపడిన గంజి వెంకాయమ్మ(35), గణేష్(19) అక్కడికక్కడే మృతిచెందారు. గణేశ్ దేవరకొండలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

గ్రామ పంచాయతీ కార్మికుల హక్కుల పోరాటం

12న పాలకుర్తి నుంచి పాదయాత్ర
28న ఇందిరాపార్కు వద్ద ముగింపు

- జిల్లా కేంద్రాల్లో ఉపపాదయాత్రలు... కలెక్టర్లకు వినతిపత్రాలు : గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియర్ గౌరవాధ్యక్షులు పాలడుగు భాస్కర్ వెల్లడి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గ్రామపంచాయతీ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం, డిమాండ్ల సాధన కోసం పోరాటాల పురిటి గడ్డ, వీరనారి చిట్యాల ఐలమ్మ స్వగ్రామమైన పాలకుర్తి నుంచి ఈనెల 12న పాదయాత్రను చేపట్టనున్నామని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు పాలడుగు భాస్కర్ తెలిపారు. 15 రోజులపాటు కొనసాగనున్న పాద యాత్ర (300కిలోమీటర్లు) జనగామ, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి జిల్లా మీదుగా హైదరాబాద్‌కు చేరుకుంటుందని చెప్పారు. ముగింపు సందర్భంగా ఇందిరాపార్కు వద్ద సభ నిర్వహిస్తామన్నారు. ఇదే క్రమంలో ఆయా జిల్లా కేంద్రాల్లో ఉపపాదయాత్రలు చేపట్టాలనీ, కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించాలని పిలుపునిచ్చారు. తన నేతృత్వంలోని పాదయాత్ర బృందంలో యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గ్యార పాండు, చాగంటి వెంకటయ్య, కార్యనిర్వాహక అధ్యక్షులు పి గణపతిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు తునికి మహేష్, పి వినోద్ ఉంటారని తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అందుకు సంబంధించిన పోస్టర్, కరపత్రాన్ని రాష్ట్ర ఆఫీస్ బేరర్లు, కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగులేబర్ కోడ్లు, కనీస వేతనం రూ. 26వేలు, ఉద్యోగాలు పర్మినెంట్, వేతనాలు పెంపుదల, కారోబార్లకు స్పెషల్ స్టేటస్, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలనే అంశాలపై నిలదీస్తామన్నారు. గ్రామపంచాయతీ సిబ్బందిలో అత్యధికులు దళితులు, గిరిజనులు, బలహీనవర్గాలకు చెందిన వారే ఉన్నారని తెలిపారు. అందుకే రాష్ట్ర పంచాయతీ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సొంత నియోజకవర్గం పాలకుర్తి కేంద్రంగా పాదయాత్రను ప్రారంభించబోతున్నట్టు తెలిపారు. పాలకులు మారినా వారి బతుకులు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

అత్యంత నిర్లక్ష్యానికి, నిరాదర ణకు గురవుతున్నారని చెప్పారు. గ్రామ పంచాయతీ కార్మికులు సుదీర్ఘకాలం పోరాటం చేస్తే, టీఆర్ఎస్ ప్రభుత్వం ఎలాంటి ప్రాతిపదిక లేకుండా అశాస్త్రీయంగా జీవో నెంబర్ 51 తెచ్చిం దన్నారు. 500 జనాభాకు ఒక్క కార్మికుడు చొప్పున లెక్కించి వేతనాన్ని రూ 8,500 నిర్ణయించి చేతులు దులుపుకుందని తెలిపారు. అదనంగా ఉన్న కార్మికు లకు ఎలాంటి వేతనాలు చెల్లించడం లేదనీ, ఒక కార్మికుడికి ఇచ్చే వేతనాన్ని అక్కడ పని చేసే కార్మికులందరూ పంచుకుంటున్నారని వివరించారు. ఫలితంగా రూ 3, 500 నుంచి రూ 4,500 వరకే వేతనాలు పొందుతున్నారని చెప్పారు.

డిమాండ్లు

- కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి
- మోడీ నిర్ణయించిన వేతనం రోజుకు రూ 178 మాకొద్దు.కనీస వేతనం నెలకు రూ 26వేలుగా నిర్ణయించాలి.
- జీవోనెం 60 ప్రకారం పారిశుద్ధ్య కార్మికులకు రూ 16,500 ,కారోబార్,బిల్ కలెక్టర్లకు రూ 19,500, కంప్యూటర్ ఆపరేటర్లకు రూ 22, 750 వేతనాన్ని చెల్లించాలి.
- చట్టం ప్రకారం పంచాయతీ సిబ్బంది అందరిని పర్మినెంట్ చేయాలి.
- కారోబార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలి. వారిని అసిస్టెంట్ కార్యదర్శులుగా నియమించి ప్రభుత్వ గ్రాంట్ ద్వారా వేతనాలు చెల్లించాలి.
- ఉద్యోగ భద్రత, పిఎఫ్, ఈఎస్ఐ, ప్రమాదబీమా సౌకర్యాలు అమలు చేయాలి.
- పంచాయతీ కార్మికులందరికీ డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం రూ.5.50 లక్షలు ఆర్థిక సాయం చేయాలి.
- దళిత బంధు పథకంలో పంచాయతీ సిబ్బందికి ప్రాధాన్యతనిచ్చి అమలు చేయాలి.

పేదలకు గుంట భూమి ఇవ్వరా..

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్రలను తిప్పి కొట్టాలి
- పట్టాలు అందే వరకు పోరాటం ఆగదు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ.అబ్బాస్



నవతెలంగాణ-భూపాలపల్లి

కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాలు నియంత పాలన కొనసాగిస్తున్నాయని బడా నేతలకు అప్పనంగా ఎకరాల కొద్దీ భూములు కట్టబెడుతూ.. పేదలకు మాత్రం గుంట భూమి ఇవ్వడం లేదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ.అబ్బాస్ అన్నారు. ఇండ్ల స్థలాల పట్టాలు అందే వరకు పోరాటం ఆగదని, పేద ప్రజలకు ఎర్రజెండా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పాత ఎర్ర చెరువు సర్వే నంబర్ 280, 283, 284, 285లోని సుమారు 24 ఎకరాల శిఖం భూమిలో ఆరు రోజుల కిందట సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో గుడిసెలు వేశారు. సుమారు 1500 గుడిసెలు వేశారు. బుధవారం అబ్బాస్ గుడిసెవాసులను కలిసి మద్దతు తెలిపారు. అనంతరం సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బందు సాయిలు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వ భూమి అంటే ప్రజల భూమి అని.. దానిపై పూర్తి హక్కు పేదలకే ఉంటుందన్నారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 32వేల ఎకరాల్లో ఎర్రజెండాలు రెపరెపలాడుతున్నాయని వివరించారు. ఆయా ప్రాంతాల్లో ఇండ్ల స్థలాల కోసం మూడున్నర లక్షల మంది నిరుపేదలు గుడిసెలు వేసుకున్నట్టు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇస్తానన్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇప్పటికీ ఇవ్వకపోవడంతో పేదలు ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుంటున్నారన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ భూములను కబ్జా చేస్తుంటే గుడ్లప్పగించి చూస్తున్న ప్రభుత్వం.. పేదలపై కేసులు పెట్టడం సరైన పద్ధతి కాదన్నారు. భూపోరాటంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం కండ్లు తెరిచి శిఖం భూములను పేదలకు పంచి పట్టాలు ఇవ్వడంతోపాటు ఇండ్లు కట్టించాలని డిమాండ్ చేశారు. భూమిని వదిలేది లేదని కరెంటు నీరు, రావాల్సిందేనని స్పష్టం చేశారు. ఇండ్లు, ఇండ్ల స్థలాల కోసం ఫిబ్రవరి 9న హైదరాబాదులో జరిగే మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో 45 కోట్ల మంది దగ్గర ఉన్న సొత్తు ఎంతో.. కేవలం ఒక అదాని దగ్గర అంత ఉందని చెప్పారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో 15 ఎకరాల్లో ఓ ధనవంతుడు ఇల్లు నిర్మించుకుంటే తప్పులేదు కానీ.. పేదలు గుడిసెలు వేసుకుంటే దౌర్జన్యం ఎందుకని ప్రశ్నించారు. పేదలకు ఉపయోగపడే నిత్యావసర సరుకులు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉజ్వల భారత్ పేరుతో పేదలు గ్యాస్ పంపిణీ చేసినా.. ధర పెరగడం వల్ల మళ్లీ కట్టెల పొయ్యే దిక్కు అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కాంపెటి రాజన్న, చెన్నూరి రమేష్, పొలం రాజేందర్, దమెర కిరణ్, నాయకులు డబ్బా రాజన్న, అతుకూరి శ్రీకాంత్, పొలం చిన్న రాజేందర్, సకినాల మల్లయ్య, గుర్రం దేవందర్, బొడ్డు కిషోర్, బొడ్డు స్మరన్, రిత్విక్, విజయ్, మహేందర్, సంపత్, రాజు పాల్గొన్నారు.

'పశు మిత్రుల'ను సెర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించాలి

- ఫిబ్రవరి 15న చలో హైదరాబాద్ విజయవంతం చేయాలి : సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్
- రాష్ట్ర పశుమిత్రుల వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-ముషీరాబాద్

పశుసంవర్థక శాఖలో పనిచేస్తున్న పశుమిత్రులను సెర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించి ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం రాష్ట్ర పశుమిత్రుల వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో ఎడ్ల రమేష్ అధ్యక్షతన రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. పశుసంవర్థక శాఖలో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 2500 మంది పశుమిత్రులు ఎనిమిదేండ్లుగా సేవలందిస్తున్నారని తెలిపారు. వీరిలో ఎక్కువగా మహిళలే ఉన్నారని చెప్పారు. వీరికి ఐకేపీ ద్వారా ప్రభుత్వం శిక్షణ ఇచ్చి ఎలాంటి పారితోషికమూ నిర్ణయించకుండా పశువైద్య శాఖలో పశుమిత్రులుగా నియమించిందన్నారు. వారు గ్రామీణ ప్రాంతాల్లో పశువులు, గొర్లు, మేకలకు కృత్రిమ గర్భధారణతోపాటు వ్యాక్సినేషన్, నట్టల మందు వేయడం, వ్యాధుల నివారణకు సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో పశు మిత్రులకు ఫిక్స్‌డ్ వేతనం, యూనిఫామ్, గుర్తింపు కార్డు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి సానుకూల నిర్ణయం తీసుకోకపోతే ఫిబ్రవరి 15న చలో ప్రగతి భవన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. కాంటాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జె.వెంకటేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ శాఖల్లో జీవో నెంబర్ 60 ప్రకారం వేతన సౌకర్యాలు కల్పించాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం, ఆశా కార్యకర్తల మాదిరిగా పశు మిత్రులకు పారితోషికం నిర్ణయం తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో పశుమిత్రులంతా బీఆర్ఎస్ నాయకులను నిలదీయడానికి సిద్ధం కావాలన్నారు. అనంతరం రాష్ట్ర నూతన కమిటీని ప్రకటించారు.

రాష్ట్ర కమిటీ..

రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా జె.వెంకటేష్, అధ్యక్షులుగా కె.శారద, ప్రధాన కార్యదర్శిగా కాసు మాధవి, కోశాధికారిగా శ్రీరామ్ పద్మ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కవిత, మనిషా, శ్రీలత, త్రివేణి, ప్రియాంక, సహాయ కార్యదర్శిగా ఎడ్ల రమేష్, లక్ష్మీనరసింహ, కమిటీ సభ్యులుగా లలితా, ప్రభా, మౌనిక తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్, రంజిత్ కుమార్, కవిత, కడారి నరసింహ, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలు గుడిసెలు వేసుకున్న స్థలాలకు పట్టాలివ్వాలి

- ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి : తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని
- కొత్తగూడెం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



నవతెలంగాణ- కొత్తగూడెం

పేదలు గుడిసెలు వేసుకున్న ప్రభుత్వ భూమిలో ఇండ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ డిమాండ్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలంలోని వెంకటేశ్వర కాలనీ పంచాయతీ పరిధిలోని 137/1 ప్రభుత్వ భూమిలో ఇండ్ల స్థలాల కోసం పేదలు గుడిసెలు వేశారు. గుడిసెలు వేసుకున్న స్థలం వెంకటేశ్వర కాలనీ నుంచి చుంచుపల్లి తహసీల్దార్ కార్యాలయం వరకు బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రేపాకుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో పోతినేని మాట్లాడారు. ఇంటి స్థలం, ఇండ్లు లేక పేదలు ఇబ్బందులు పడుతున్నారని.. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదలందరికీ వెంటనే ఇండ్ల స్థలాలు, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెప్పే అభివృద్ధి కాగితాల్లో మాత్రమే ఉందని విమర్శించారు. ప్రజలకు ఇండ్లు, విద్య, భూమి, వైద్యం అందినప్పుడే నిజమైన అభివృద్ధి అన్నారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ వెంటనే స్పందించి పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గుడిసెల ప్రాంతంలో మంచినీరు, విద్యుత్ ఇతర మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు లిక్కి బాలరాజు, సీఐటీయూ జిల్లా నాయకులు భూక్య రమేష్, వీరన్న, ఐద్వా నాయకులు సందకూరి లక్ష్మి, ఈసం రాంబాబు, బాల కృష్ణ, ప్రేమ్ కుమార్, జబ్బ సంధ్యారాణి, రాము, సిద్దెల రాములు, పూజారి నాగమణి, వీరమ్మ, రామకోటమ్మ, శివ, రాజు తదితరులు పాల్గొన్నారు.

మొదలైన మేడారం మినీ జాతర

- మండమెలిగే పండుగతో ప్రారంభం
- అమ్మవార్ల గద్దెలను శుద్ధి చేసి, ప్రత్యేక పూజలు
- పాల్గొన్న మంత్రి సత్యవతి రాథోడ్



నవతెలంగాణ-తాడ్వాయి

మేడారంలో బుధవారం మినీ వనజాతర మొదలైంది. రెండేండ్లకు ఓసారి జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర.. మధ్యలో మినీ జాతర పేరిట ఈ ప్రత్యేక పూజలు జరుగుతాయి. ఇందులో భాగంగా ఫిబ్రవరి 1న మండమెలిగే పండుగతో మినీ జాతర మొదలైంది. మేడారం, కన్నెపల్లిలో పూజారులు మండమెలిగే పండుగ నిర్వహించారు. సమ్మక్క పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు ఆధ్వర్యంలో ప్రధాన పూజారి మునీందర్ ఇంట్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మరో పూజారి సిద్దబోయిన లక్ష్మణరావు ఇంట్లో మామిడి తోరణాలు కట్టి డోలు వాయిద్యాలతో సమ్మక్క గుడి వద్దకు చేరుకున్నారు. గ్రామదేవతలకు పూజలు చేశారు. అనంతరం గద్దెల వద్ద గజ స్తంభాలను ఏర్పాటుచేసి మామిడాకు తోరణాలు కట్టారు. గురు, శుక్ర వారాల్లో సారలమ్మ, సమ్మక్క గద్దెలను శుద్ధి చేసి పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సందర్శకులు పెరిగే అవకాశం ఉండటంతో అందుకనుగుణంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. మూడ్రోజులపాటు ఈ మినీ జాతరలో అమ్మవార్లను గద్దెలపైకి తీసుకురామని, గద్దెలపై ప్రత్యేక పూజలు మాత్రమే చేస్తామని పూజారులు చెప్పారు.

ఘనంగా చెలపెయ్య ఆకు మొక్కు

మహా జాతర వలె మేడారం మినీ జాతరకు ఊరటం గ్రామం నుంచి చందోల వంశీయుల ఆడబిడ్డలు, ఎంపీపీ గొంది వాణిశ్రీ, సత్యనారాయణ, మాధవరావులు చెలపెయ్య ఆవును ప్రత్యేక పూజలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఆవుకు పూజలు నిర్వహించి డోలు వాయిద్యాలతో కాలి నడకన ఊరటం కాజ్వే ద్వారా నడుచుకుంటూ వెళ్లి మేడారం సమ్మక్క సారలమ్మలకు మొక్కులు చెల్లించారు.

మినీ మేడారం జాతరకు సకల సౌకర్యాలు

గిరిజన స్త్రీ- సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్



మినీ మేడారం జాతరలో సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులూ జరగకుండా సకల సౌకర్యాలు కల్పించినట్టు గిరిజన స్త్రీ- శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ చెప్పారు. మేడారంలో గిరిజనుల ఆరాధ్య దైవం సమ్మక్క- సారలమ్మ మినీ జాతర నేపథ్యంలో గిరిజన స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ జడ్పీ చైర్మెన్ కుసుమ జగదీష్, జిల్లా కలెక్టర్ ఎస్.కృష్ణ ఆదిత్య, పీఓ అంకిత్, ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి మంత్రి సమ్మక్క సారలమ్మ వనదేవతలను దర్శించుకున్నారు. మేడారం ఆలయ పూజారులు ఆదివాసీ సంప్రదాయ ప్రకారం వారికి ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి వనదేవతలకు ఇష్టమైన చీర సారే సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. మినీ జాతర జరుగుతున్న నేపథ్యంలో రూ.3 కోట్ల 10 లక్షలతో ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని స్పష్టం చేశారు.

ఇంటర్ బోర్డు కార్యదర్శిగా నవీన్ మిట్టల్‌ను కొనసాగించాలి

- ప్రభుత్వానికి టిప్స్ విజ్ఞప్తి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్ బోర్డు కార్యదర్శిగా, ఇంటర్ విద్యా కమిషనర్‌గా నవీన్ మిట్టల్‌ను కొనసాగించాలని తెలంగాణ ఇంటర్ విద్యా పరిరక్షణ సమితి (టిప్స్) రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని ఇంటర్ విద్యాభవన్‌లో టిప్స్ ఆధ్వర్యంలో ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా టిప్స్ కన్వీనర్ మాచర్ల రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ నవీన్ మిట్టల్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఉన్నతస్థాయి పరిపాలనా నైపుణ్యంతో ఇంటర్ విద్యలో అనేక సంస్కరణలు తెచ్చారని చెప్పారు. పారదర్శకంగా, నిజాయితీగా విధులను నిర్వహించారని అన్నారు. ఈ ఆఫీస్, బయోమెట్రిక్ హాజరు విధానాన్ని ప్రవేశపెట్టారని వివరించారు. ఐదేండ్లుగా నిర్వహించని ఇంటర్ బోర్డు పాలకమండలి సమావేశాన్ని జరిపారని చెప్పారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం, మహిళా ఉద్యోగులకు రక్షణగా ఉంటూ అనేక సమస్యలను సానుకూలంగా పరిష్కరించారని అన్నారు. ఈ నేపథ్యంలో ఇంటర్ వార్షిక పరీక్షలు పూర్తయ్యేంత వరకూ నవీన్ మిట్టల్‌ను కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో టిప్స్ సమన్వయకర్త మైలారం జంగయ్య, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, మనోహర్, విశాలాక్షి, పరశురాములు, దుర్గాప్రసాద్, ఆనంద్, మృత్యుంజయ, కృష్ణస్వామి, ఫ్రాన్సిస్, ప్రవీణ్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు రవాణాలో సింగరేణి రికార్డు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



బొగ్గు రవాణాలో సింగరేణి కాలరీస్ రికార్డు నెలకొల్పింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది జనవరి నెలలో 68.4 లక్షల టన్నుల బొగ్గు రవాణాను సాధించింది. అలాగే 16.67 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ వెలికితీశారు. 2016 మార్చి నెలలో చేసిన 64.7 లక్షల టన్నుల బొగ్గు రవాణాయే ఇప్పటి వరకు గరిష్ఠ రికార్డుగా నమోదై ఉంది. దాన్ని జనవరి నెలలో అధిగమించారు. రోజుకు సగటున 39 రైలు బండ్ల చొప్పున మొత్తం 1216 రేకుల ద్వారా బొగ్గు రవాణా జరిపినట్టు ఆ సంస్థ సీఎమ్‌డీ ఎన్ శ్రీధర్ తెలిపారు. తెలంగాణ జెన్‌కోతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు ఎక్కువ శాతం బొగ్గును రవాణా చేసినట్టు వివరించారు. అలాగే ఓపెన్ కాస్టు గనుల్లో ఓవర్ బర్డెన్ (ఓబీ) తొలగింపులో కూడా కొత్త రికార్డు నెలకొల్పినట్టు తెలిపారు. తొలిసారిగా మంగళవారం (జనవరి 31వ తేదీ) ఉదయం షిఫ్టు మొదలుకొని రాత్రి షిఫ్టు వరకు అత్యధికంగా 16.67 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్‌ను తొలగించినట్టు వివరించారు. సింగరేణి వ్యాప్తంగా ఉన్న 18 ఉపరితల గనుల్లో బొగ్గు ఉత్పత్తి చేయాలంటే దానిపై ఉన్న మట్టిని (ఓవర్ బర్డెన్) తొలగించాల్సి ఉంటుంది. ఇందుకోసం కంపెనీ యంత్రాలతోపాటు ఆఫ్ లోడింగ్ యంత్రాల సహాయంతో ఓబీని తొలగిస్తుంటారు. మంగళవారం ఆఫ్ లోడింగ్ ద్వారా 14.83 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్‌ను, డిపార్ట్‌మెంట్ యంత్రాల సహాయంతో 1.84 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీని తొలగించి కొత్త రికార్డు నెలకొల్పినట్టు చెప్పారు. ఈ సందర్భంగా సీఎమ్‌డీ శ్రీధర్ కార్మికులను అభినందించారు.

బాక్స్ క్రికెట్‌ను ప్రారంభించిన వజ్రేష్ యాదవ్



నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్‌వై బాక్స్ క్రికెట్ గ్రౌండ్‌ను కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శారీరక, మానసిక ఉల్లాసం కోసం ప్రతి ఒక్కరూ క్రీడలపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ తోటకూర అజయ్ యాదవ్, నిర్వాహకులు సిలివేరు విజయ్, రంజిత్ ముదిరాజ్, సాయి, మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై పొంగిపొర్లుతున్న డ్రయినేజీ నీరు




నవతెలంగాణ-బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ పరిధిలోని 16వ వార్డులో గత కొంతకాలంగా డ్రయినేజీ నీరు రోడ్డుపై పొంగి పొర్లుతోంది. జల్‌పల్లి మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవ్వరూ పట్టించుకోవటం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రయినేజీ నిర్మాణ పనులను పూర్తిచేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యం

రాష్ట్రంలో ఫ్రెండ్లీ పోలీస్ విధానంతో మెరుగైన ఫలితాలు ● హోం మంత్రి మహమూద్ అలీ ● ఉప్పల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నూతన భవన సముదాయం ప్రారంభం



నవ తెలంగాణ-ఉప్పల్

పోలీసు శాఖ తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తమవంతు ప్రోత్సాహం ఎల్లప్పుడూ ఉంటుందని రాష్ట్ర హోం శాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. బుధవారం హోం మంత్రి మహమూద్ అలీ, కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి చేతుల మీదుగా ఉప్పల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నూతన భవన సముదాయం ప్రారంభించారు. ఈ సందర్భంగా హోం మంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ పోలీసు శాఖ తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తమవంతు సహకారం, ప్రోత్సాహం ఎల్లప్పుడూ అందిస్తూనే ఉందని తెలిపారు. ఎన్నో నూతన పోలీస్ స్టేషన్ భవనాలు, ఇతర సౌకర్యాలు కల్పించడానికి తగిన తోడ్పాటు అందిస్తోందని చెప్పారు. సీసీ టీవీల నిర్వహణలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉందని, నేర దర్యాప్తులో, నేర నియంత్రణలో సీసీ టీవీలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయన్నారు. పోలీసు శాఖ రాత్రి పగలు తమ విధులను అలుపెరగకుండా నిర్వహించడం వల్లే రాష్ట్రం ప్రశాంతంగా ఉందని అభినందించారు. రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ పోలీస్ వ్యవస్థ సక్రమంగా పనిచేయడం వల్లే రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయని, వారికి అవసరమైన అన్ని రకాల తోడ్పాటును రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. హైదరాబాదు నగరంలో ట్రాఫిక్ సమస్య లేకపోవడం వల్లే సాఫ్ట్ వేర్ రంగం అభివృద్ధి చెందిందన్నారు. తెలంగాణ డీజీపీ అంజని కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతి భద్రతల నిర్వహణలో పోలీసులు నిబద్ధతతో పని చేస్తున్నారని, పోలీసు శాఖలోని పలు విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ రాష్ట్రాన్ని ప్రశాంతంగా ఉంచుతున్నాయని చెప్పారు. రాచకొండ కమిషనర్ డి.ఎస్. చౌహాన్ మాట్లాడుతూ, విస్తీర్ణపరంగా దేశంలోనే అతి పెద్దదైన రాచకొండ కమిషనరేట్ నేర నియంత్రణలో కూడా అగ్ర స్థానంలో ఉందని, సీసీ టీవీల నిర్వహణ ద్వారా నేర దర్యాప్తు అతి త్వరగా సాధ్యం అవుతోందన్నారు. రాచకొండ పరిధిలో నగరంలోని పారిశ్రామిక ప్రాంతాలతో పాటు, సమీప జిల్లాల గ్రామీణ ప్రాంతాలు కూడా కలిసి ఉన్నాయని, అయినా పోలీసులు రాత్రి పగలు నిబద్ధతతో పనిచేస్తూ నేర శాతం అదుపులో ఉంచుతూ శాంతి భద్రతలు కాపాడుతున్నారన్నారు. జీహెచ్ఎంసీ మేయర్ విజయ లక్ష్మి, ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, తెలంగాణ పోలీస్ హౌజింగ్ కార్పోరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్, డీసీపీ-1 ట్రాఫిక్ అభిషేక్ మహంతి, డీసీపీ-2 ట్రాఫిక్ శ్రీనివాస్, డీసీపీ మల్కాజ్ గిరి జానకి ధరావత్, డీసీపీ ఎల్బీనగర్ సాయి శ్రీ, డీసీపీ అడ్మిన్ ఇందిర, అదనపు డీసీపీ అడ్మిన్ నర్మద, అదనపు డీసీపీ షమీర్, అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ, ఏసీపీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వేతన జీవులను వంచించే బడ్జెట్ : యూటీఎఫ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని స్వల్పంగా పెంచి మధ్యతరగతి వేతన జీవులకు భారీ ఊరట పేరుతో ప్రచారం చేసుకోవటం సమంజసం కాదని టీఎస్‌యూటీఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి. రాజారావు, ఎ.శ్యామ్ సుందర్ బుధవారం ఒక ప్రకటనలో అభిప్రాయం వ్యక్తం చేశారు. పాత, కొత్త పన్ను విధానాలను కొనసాగిస్తూ క్రమంగా పాత పన్ను విధానాన్ని ఎత్తివేయటానికే కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్టు ఈ బడ్జెట్ ద్వారా స్పష్టమైందని, పరోక్ష పన్నుల ద్వారా వేతనాల నుంచి ఆదాయాన్ని రాబట్టుకుంటున్న ప్రభుత్వం వేతనాలపై భారీగా పన్ను వేయటమే అర్థరహితమని పేర్కొన్నారు. కార్పొరేట్లు, ధనికులకు అధిక పన్ను రాయితీ ఇచ్చిన సర్కారు చిన్న, మధ్యతరగతి ఉద్యోగులకు ఏమాత్రం ప్రయోజనం కలిగించలేదన్నారు. కొత్త పన్ను విధానంలో పన్ను రాయితీ రూ.5లక్షల నుంచి 7లక్షలకు పెంచారు కానీ కొత్త విధానంలో ఎలాంటి మినహాయింపులుండవని.. అధికాదాయ వర్గాలకు మాత్రమే ఇది కొంత మేరకు ఉపయోగకరమని చెప్పారు. తక్కువ వేతనాదాయ వర్గాలు వినియోగించుకుంటున్న పాత పన్ను విధానంలో స్టాండర్డ్ డిడక్షన్ రూ.2.50 లక్షల నుంచి 3లక్షలకు పెంచటం నామమాత్రమేనని.. పొదుపు మొత్తాలపై రాయితీని రూ.1.50 లక్షలను అలాగే కొనసాగించారని తెలిపారు. 2014కు ముందు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బీజేపీ డిమాండ్ చేసిన స్టాండర్డ్ డిడక్షన్ రూ.5 లక్షలు గానీ పొదుపు మొత్తాలపై రూ.3 లక్షలకు పెంచాలన్న డిమాండ్ కానీ అధికారంలోకి వచ్చిన తొమ్మిదేండ్ల తర్వాత కూడా అమలు చేయలేదన్నారు. స్లాబు రేట్లు సవరణ కూడా స్వల్పంగానే ఉందని, ఈ బడ్జెట్ ద్వారా ధరలు ఏమాత్రం తగ్గే అవకాశం లేదన్నారు. గృహ నిర్మాణానికి ప్రోత్సాహం లేదని, మొత్తంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించిన బడ్జెట్ సగటు వేతన జీవులకు ఏమాత్రం సంతృప్తి కలిగించలేదన్నారు.

ఇంటి పన్నులు తగ్గించకుంటే మున్సిపల్ ఆఫీసు ముట్టడిస్తాం

రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి



నవతెలంగాణ - మీర్ పేట్

పెంచిన ఇంటి పన్నులను తగ్గించకపోతే మున్సిపల్ ఆఫీస్‌ను ముట్టడిస్తామని రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మీర్‌పేట్ మున్సిపల్ కార్పోరేషన్‌లో ఇంటి పన్నులు 200 శాతం పెంచారన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మీర్‌పేట్ కార్పొరేషన్‌లో ఇంటి పన్నులు వసూలు చేస్తున్నారని తెలిపారు. జీఎచ్ఎంసీలో సైతం ఇంతగా ఇంటి పన్నులు, వ్యాపార పన్నులు లేవన్నారు. అధిక పన్నులతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అధికారంలోకొస్తే అధికంగా ఉన్న ఇంటి పన్నులను తగ్గిస్తామని ఆనాడు మంత్రి హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఆ విషయం మర్చిపోయారని విమర్శించారు. ఇంటి పన్నులను నెల రోజుల్లో తగ్గించకపోతే ప్రజలను సమీకరించి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆయన వెంట మీర్‌పేట్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చల్లా బాల్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

జల్‌పల్లి మున్సిపల్ అభివృద్ధికి కృషి

చైర్మెన్ అబ్దుల్లా సాదీ



నవతెలంగాణ-బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మున్సిపల్ చైర్మెన్ అబ్దుల్లా సాది అన్నారు. బుధవారం మున్సిపల్‌లోని 3వ వార్డులో కౌన్సిలర్ అహ్మద్ కసాదితో కలిసి డ్రీమ్ సిటీ కాలనీలో డ్రయినేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. ఇప్పటికే మున్సిపల్‌లో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి, పార్లమెంట్ సభ్యులు అసదుద్దీన్ ఓవైసీల సహకారంతో కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా మున్సిపల్‌లోని వివిధ కాలనీల్లో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన కోసం డ్రయినేజీలు, మిషన్ భగీరథ పథకంలో ఇంటింటికీ తాగునీరు, సీసీ, బీటీ రోడ్లు, విద్యుత్ దీపాలు ఏర్పాటు వంటి పనులు చేస్తున్నామన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసమే 'మన ఊరు-మన బడి'

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి



నవతెలంగాణ-బోడుప్పల్

రాష్ట్రంలోని ప్రభుత్వ బడులను పూర్తిస్థాయిలో బలోపేతం చేయాలనే కృతనిశ్చయంతో ముందుకు సాగుతున్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మొదటి విడత మనఊరు- మన బడి/మన బస్తీ - మన బడి కార్యక్రమంలో భాగంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కమలానగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎంపీపీఎస్‌లో సుమారు రూ.24.50 లక్షల అంచనా వ్యయంతో కూడిన పలు అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పనా శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ దర్గా దయాకర్ రెడ్డి, మేయర్ జక్కా వెంకట్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి చామకూర మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను మోడల్ స్కూళ్లగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో మన బస్తీ-మన బడి అనే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, అందులో భాగంగా మొదటి దశలో బడులన్నింటికీ కామన్ కలర్‌కోడ్ అమలు చేసి, తరగతి గదులకు పెయింటింగ్ పనులు చేపట్టారన్నారు. పాత భవనాలన్నింటికీ ఐదు లేయర్ల పూతతో వాటర్ ప్రూఫింగ్ ట్రీట్‌మెంట్ చేయించడం, ఒక్కొక్క తరగతి గదికి నాలుగు ఫ్యాన్లు, నాలుగు ఎల్ఈడీ ట్యూబ్‌లైట్లు బిగించడం, డ్యూయల్ డెస్క్ బల్లలు, గ్రీన్‌చాక్‌పీస్ బోర్డులు, టీచర్లు, గ్రంథాలయాలు, సైన్స్‌ల్యాబ్‌లకు అవసరమయ్యే కుర్చీలు, టేబుళ్లు, స్టూళ్లు వంటి ఫర్నీచర్‌ను సమకూరుస్తున్నారని తెలిపారు. డిజిటల్ క్లాస్ రూమ్స్, కిచెన్ షెడ్లు, కాంపౌండ్ వాల్, మరుగుదొడ్ల నిర్మాణం, సీసీ టీవీ కెమెరాల ఏర్పాటు మొదలైన అభివృద్ధి పనులను చేపడతామన్నారు. మేయర్ జక్కా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు-మన బడి/మన బస్తీ- మన బడి కార్యక్రమంతో పిల్లల భవితకు బంగారు భవిష్యత్తుని అందిస్తుందని, ఈ కార్యక్రమాన్ని కేవలం ప్రభుత్వ కార్యక్రమంలా కాకుండా ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, డీఈఈ శ్రీనివాస్, ఏఈ వినీల్‌కుమార్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ జానకి, ప్రధానోపాధ్యాయులు ఎల్.సత్యప్రసాద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బాలలా



నవతెలంగాణ-సంతోష్ నగర్

ప్రజా సమస్యను పరిష్కరిస్తూ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలా అన్నారు. సైదాబాద్ పరిసర ప్రాంతాల్లో డ్రయినేజీ, మంచినీరు, సీసీ రోడ్లు తదితర అభివృద్ధి పనులను బుధవారం ఆయన సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్త కాపు అరుణ రవీందర్ రెడ్డితో కలిసి పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యేకు కార్పొరేటర్ శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానికంగా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి చూపాలి

టూరిజం చైర్మెన్ ఉప్పల శ్రీనివాస గుప్తా



నవతెలంగాణ-నాగోలు

విద్యార్థులు చదువులతోపాటు క్రీడల్లో కూడా ఆసక్తిని కనబరిచి తమ ప్రతిభను చాటుకోవాలని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస గుప్తా అన్నారు. బుధవారం నాగోల్‌లోని స్కంద బ్యాడ్మింటన్ అకాడమీలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సమన్వయంతో రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు 15ఏండ్లలోపు బాలబాలికలకు నిర్వహించిన తెలంగాణ బ్యాడ్మింటన్ ఓపెన్ టోర్నమెంట్ ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులే కాకుండా ఏ రంగంలోని వారైనా క్రీడలపై ఆసక్తి చూపితే శారీరకంగా ధృడంగా ఉంటారన్నారు. ప్రతి జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లో క్రీడా మైదానాలను నిర్మిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారని ఆయన తెలిపారు. బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో 13 సంవత్సరాల లోపు వారిలో బాల బాలికలు 13 బీఎల్ విభాగంలో విన్నర్‌గా హర్షవర్ధన్, జీఎస్ 13 విభాగంలో విన్నర్‌గా హర్షచంద్రం హంసిని, జీడీ 13 విన్నర్‌గా అభిరామ్ త్రిపురనేని, జీడీ 13 విన్నర్‌గా చంద్ర అంశిని, బీఎస్15 విన్నర్‌గా అర్జున్ తనజీ బిరాదర్‌లకు శ్రీనివాస్ గుప్తా అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, రంగారెడ్డి జిల్లా బ్యాట్‌మెంటన్ చైర్మెన్ మల్రెడ్డి రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి కారేడ్ల శ్రీనివాసరావు, కోశాధికారి కె.పాణిరావు, టోర్నమెంట్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ సూరి, కన్వీనర్ సాయిరెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



నవతెలంగాణ -ఎల్బీనగర్

సరూర్ నగర్ స్టేడియం జరిగే మెగా జాబ్ మేళా పోస్టర్‌ను బుధవారం ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి తన క్యాప్ కార్యాలయంలో ఎమ్మెల్సీ మల్లేష్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ సరూర్ నగర్ స్టేడియంలో ఫిబ్రవరి 11న జరిగే జాబ్ మేళాలో పాల్గొనాలని ఆయన కోరారు. తెలంగాణ రాష్ట్రంలోనే ఇది అతిపెద్ద జాబ్ మేళా అని ఆయన తెలిపారు. దాదాపు 120 కంపెనీలు పాల్గొంటాయన్నారు. దాదాపు 10వేల మందికి పైగా నిరుద్యోగులకు ఉద్యోగం దొరుకుతుందన్నారు. జాబ్ మేళాకు సహకరిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఏడో తరగతి నుండి పీజీ వరకు చదివిన వారంతా ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు. వికలాంగులు, మూగ, చెవిటి, అంధులు కూడా తమ పేరు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. జాబ్ మేళాలో ఉద్యోగం వచ్చినవారికి అదే రోజు సాయంత్రం అప్పాయింట్‌మెంట్ లెటర్ ఇస్తారన్నారు. ఉదయం 10 గంటల నుండి ఈ మేళా నిర్వహిస్తామన్నారు. ఉద్యోగాన్ని బట్టి దాదాపు రూ.15వేల నుంచి రూ.లక్ష వరకు జీతం లభిస్తుందన్నారు. సందేహాలుంటే 7286008234, 9505437112, 8247768371 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బారాస నాయకులు ఆనంతుల రాజిరెడ్డి, దేరింగులు కృష్ణ, రాము, కళ్యాణ్, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, శేషగిరిరావు, బద్దం నరేందర్ గౌడ్, రమేష్, కిట్టు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ భూముల సమస్యపై అసెంబ్లీలో మాట్లాడండి

ఎమ్మెల్యే రఘునందన్‌ను కలిసిన బోడుప్పల్ భూ బాధితులు



నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అనేక సంవత్సరాల క్రితం కొనుగోలు చేసిన ప్లాట్లు వక్ఫ్ భూములంటూ మమ్మల్ని సర్కారు ఇబ్బందులకు గురి చేయడం సరైనది కాదని దుబ్బాక ఎమ్మెల్యే రుఘునంధన్ రావుతో బోడుప్పల్ వక్ఫ్ భూముల బాధితులు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా వక్ఫ్ భూమి బాధితుల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. బాధితుల సమస్యను విన్న ఎమ్మెల్యే సదరు సమస్యపై అసెంబ్లీలో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు పెద్ది మోహన్ రెడ్డి, బోడుప్పల్ కార్పొరేటర్ కుంభం కిరణ్ కుమార్ రెడ్డిలతో పాటు వివిధ కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల వేతనాలు పెంచాలని ఎమ్మెల్యేలకు వినతి



నవతెలంగాణ-సంతోషనగర్

ఈ నెల 3 నుండి జరగబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో ఆశా వర్కర్లకు జీతాల పెంపు తదితర సమస్యలపై చర్చించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు మీనా, సీనియర్ నాయకులు ఎండి అబ్బాస్, విఠల్, సఫియా, సుల్తానా, కౌసర్, యాస్మిన్‌లు పలువురు ఎమ్మెల్యేలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 26వేల మంది ఆశా వర్కర్లు పని చేస్తున్నారన్నారు. గత 18ఏండ్ల నుండి రాష్ట్రంలోని పేద ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తున్నా వీరంతా మహిళలు బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ఆశాలను కార్మికులుగా గుర్తించాలని, కనీస వేతనం ఇవ్వాలని 106 రోజులు ఆశాలు సమ్మె చేసిన విషయాన్ని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. ఆ సమ్మెకు స్పందించిన సీఎం కేసీఆర్ స్వయంగా ప్రగతి భవన్లో ఆశాలతో సమావేశం ఏర్పాటు చేసి రూ.ఆరు వేల ఫిక్సిడ్ వేతనం ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ ఇంత వరకు ఆ హామీని అమలు చేయలేదన్నారు. ఈ వైఖరిని వ్యతిరేకిస్తూ ఆంధ్రప్రదేశ్లో మాదిరిగా తెలంగాణ రాష్ట్రంలో కూడా ఆశాలకు రూ.10 ఫిక్సిడ్ వేతనం నిర్ణయించాలని కోరారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా రాష్ట్రంలో పని చేస్తున్న ఆశాల సమస్యలు పరిశీలించాలని, ఫిక్సిడ్ వేతనం, ఇతర సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో తగిన బడ్జెట్ కేటాయించాలని వారు కోరారు.

'ట్రాఫిక్ సమస్యను పటించుకోని ప్రభుత్వం'



నవతెలంగాణ -ఎల్బీనగర్

40 ఏండ్ల నుండి ట్రాఫిక్ సమస్యతో చాదర్‌ఘాట్ ప్రాంతంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆలోచన వ్యవస్థాపక అధ్యక్షులు జనేపల్లి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం దిల్‌సుఖ్ నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చాదర్‌ఘాట్‌లో రోజు ట్రాఫిక్ రద్దీ ఉంటుందని, గంటల తరబడి ట్రాఫిక్‌లో ఇరుకుంటున్నారని దీనిని ఎవ్వరు పటించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చాదర్‌ఘాట్ వద్ద ఇంతవరకు నూతనంగా వంతెన నిర్మించకపోవడం వలన ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే బ్రిడ్జిని నిర్మించి చాదర్‌ఘాట్ ప్రాంతం ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే ట్రాఫిక్ సమస్య మరింత జఠిలమవుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, సూర్య ప్రకాష్, శ్రీనివాస్, శంకర్, వీరేష్, పాండు, యాదగిరి, నరసింహ్మా, శ్యామ్ తదితరు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు తెలుసుకున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి



నవతెలంగాణ -ఎల్బీనగర్

సరూర్‌నగర్ పోస్ట్ ఆఫీస్ వద్ద ప్రజలకు, విద్యార్థులకు బస్ సౌకర్యం ఎలా ఉందని లింగోజీగుడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి తెలుసుకున్నారు. బుధవారం బస్టాఫ్ వద్ద విద్యార్థులతో మాట్లాడి సరైన వేలకు బస్‌లు వస్తున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. అనేక మంది విద్యార్థులు బస్సులు రావడం లేదని ఫిర్యాదు చేశారు. ఉదయం 8 గంటలకు నుండి 9 గంటల వరకు బస్ స్టాప్‌లో ఉండి ప్రయాణికుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలేజీ, ఆఫీస్‌కి వెళ్లేవారు గంటల తరబడి బస్‌స్టాప్‌లో బస్ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. వేళకు బస్సులు రాకపోవడంతో కాలేజీ, స్కూల్ విద్యార్థులు క్లాసులు మిస్ అవుతున్నారన్నారు. అనంతరం దిల్‌సుఖ్‌నగర్ డిపో మేనేజర్‌ని కలిసి సమస్యలను వివరించారు. దీంతో అదనంగా బస్సులు నడిపిస్తామని డిపో మేనేజర్ హామీ ఇచ్చారని రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

నిబంధనలు పాటిస్తేనే సురక్షిత ప్రయాణం



నవ తెలంగాణ- సంతోష్ నగర్

వాహనాల రాకపోకలు సాగించే మార్గాల్లో నిర్లక్ష్యంగా ఉండకూడదని, జాగ్రత, భద్రతతో కూడిన ప్రయాణాలే సురక్షితమని బేగంపేట టీటీఐ ఏసీపీ జి.శంకర్ రాజు సూచించారు. నిబంధనలు మనం అనుసరించినా... ఎదుటివారితో చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. బుధవారం మలక్ పేట నియోజకవర్గం సైదాబాద్ పరిధిలోని మాతశ్రీ ఇంజనీరింగ్ కళాశాలలో బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఆధ్వర్యంలో 'రోడ్డు భద్రత.. ట్రాఫిక్ నిబంధనలు'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 500 మంది విద్యార్థినులకు ఆయన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పాటలు వింటూ రోడ్లపై నడవడం చాలా ప్రమాదకరమని ఎన్నో ఘటనలు తెరపై చూపించారు. హెల్మెట్ తప్పనిసరని, ఇక చోదక అనుమతి పత్రం లేదంటే.. వాహనం నడపడం వచ్చినా.. రానట్లేనని తెలుసుకోవాలన్నారు. త్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేని ప్రయాణం, సీట్ బెల్ట్ ధరించకపోవడం, రోడ్డు భద్రత సైబర్ క్రైమ్ డ్రగ్స్ వాటి గురించి సందేహాలు కూడా వివరిస్తూ అపసవ్య మార్గంలో వెళ్లడం తదితర ఉల్లంఘనలే ప్రమాదాలకు సంకేతాలని గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి. హనుమంతరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి నవీన్ కిషోర్, సైదాబాద్ ఎస్సైలు శివాజీ, మీచోక్ మీర్‌చౌక్ ట్రాఫిక్ ఎస్ఐ గణేష్, సైదాబాద్ ఏఎస్ఐ అశోక్‌రెడ్డి, సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను పరిశీలించిన కార్పొరేటర్



నవతెలంగాణ-కాప్రా

నాచారం రాఘవేంద్రనగర్‌లో రూ. 20 లక్షలతో కొత్తగా వేస్తున్న సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను స్టాండింగ్ కమిటీ మెంబర్, నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ బుధవారం పర్యవేక్షించారు. నాణ్యతలో ఎటువంటి లోపాలున్న సహించేది లేదని కార్పొరేటర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాయిజన్ శేకర్, మేకల ముత్యం రెడ్డి, కట్ట బుచ్చన్న గౌడ్, అజ్మెరి, డిప్యూటీ ఇంజనీర్ రూప, అసిస్టెంట్ ఇంజనీర్ లింగారావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈసీఐఎల్‌లో విద్యార్థుల మధ్య ఘర్షణ



నవతెలంగాణ-కాప్రా

ఈసీఐఎల్ సీఎంఎస్ శ్రీ చైతన్య కళాశాల వద్ద విద్యార్థులు ఘర్షణ పడడం బుధవారం కలకలం రేపింది. ఓ విద్యార్థుల గుంపు మరి కొందరి విద్యార్థులను పరిగెత్తించుకుంటూ కొడుతున్న దృశ్యాలు చూసిన స్థానికులు భయాందోళన చెందారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా ఉదయం, సాయంత్రం సమయాలలో ఈసీఐఎల్ పరిసర కళాశాలల వద్ద సంబంధిత కళాశాలల యాజమాన్యాలు, కుషాయిగూడ పోలీసులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆశ..నిరాశలు.. వేతన జీవులకు ఊరట

- పెరగనున్న బ్రాండెడ్ దుస్తుల ధరలు, టైర్ల ధరలు
- కేంద్ర బడ్జెట్ పేదలకు వ్యతిరేకం, సంపన్నులకు అనుకూలం : సీపీఐ(ఎం) నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్



నవతెలంగాణ-సిటీబ్యూరో

పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ బుధవారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ సామాన్యులకు నిరాశే కల్గించింది. సంపన్నులకు అనుకూలంగా ఉంది. ముఖ్యంగా సామాన్యులకు సంబంధించిన ఉపాధి హామీ పథకానికి నామమాత్రంగానే నిధులు కేటాయించారు. పట్టణాల్లో ఉపాధి హామీ పథకం ఊసేలేదు. దీంతోపాటు నగరంలో ఉండే మధ్యతరగతి ఎక్కువగా ఉపయోగించే బ్రాండెడ్ దుస్తువుల ధరలు పెరగనున్నాయి. మోటారు వాహనాలకు సంబంధించిన టైర్ల ధరలు సైతం పెరగనున్నాయి. దీంతో సామాన్య, మధ్య తరగతి ప్రజల బాండెడ్ దుస్తువుల బడ్జెట్ పెరగనుంది. ఇదిలా ఉండగా బంగారం, వెండి ధరలు ఆకాశానంటనున్నాయి. వేతనజీవులు, మధ్యతరగతివర్గాలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఆశ ఫలించింది. వ్యక్తిగత ఆదాయ పన్ను మినహాయింపు కనిష్ఠ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంచుతూ కేంద్రం ప్రకటించింది. ఆదాయం రూ.7 లక్షలు దాటితే 5 స్లాబుల్లో పన్ను విధించనున్నారు. రూ.7 - రూ.9 లక్షల వరకు 5 శాతం పన్ను, ఆదాయం రూ.30 లక్షలు దాటితే 30 శాతం పన్ను విధింపునకు బడ్జెట్‌లో ప్రతిపాదించారు. అయితే ఇది నూతన పన్ను విధానానికి మాత్రమే వర్తిస్తుంది. పాత పన్ను విధానంలో ఎలాంటి మార్పులు చేయలేదు. కాగా ఏ పన్ను విధానాన్ని ఎంచుకోవాలనేది పూర్తిగా చెల్లింపుదారుడి ఐచ్ఛికం. ఎందులో ప్రయోజనం ఉంటుందనుకుంటే దానిని ఎంపిక చేసుకోవచ్చు. కాని ఉద్యోగులు మాత్రం కేంద్ర బడ్జెట్‌పై పెదవి విరుస్తున్నారు. దీంతోపాటు నగరంలో అత్యధికంగా ఉండే ప్రయి వేటు ఉద్యోగులకు కేంద్ర బడ్జెట్‌తో ఒరిగిందేమిలేదని పలువురు ఉద్యోగులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. సాధారణ ప్రజలకు మాత్రం 0 నుంచి రూ. 3 లక్షలకు ఎలాంటి పన్నులు చెల్లింపులేదు. దీంతోపాటు ఎలక్ట్రానిక్ వస్తువుల ధరలు తగ్గనున్నాయి. ఎలక్ట్రిక్ వాహనాల ధరలు కూడ తగ్గనున్నాయి.

కేంద్ర బడ్జెట్ పేదలకు వ్యతిరేకం, సంపన్నులకు అనుకూలం
సీపీఐ(ఎం) నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్

పార్లమెంట్‌లో ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ 2023-24 పేదలకు వ్యతిరేకం, సంపన్నులకు అనుకూలంగా ఉంది. కరోనాకు ముందు రెండేండ్లుగా దిగజారుతున్న ఆర్థిక పరిస్థితులు, ప్రపంచ వ్యాప్తంగా ముంచుకొస్తున్న ఆర్థిక మాంద్యం నేపథ్యంలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ పరిస్థితిలో ప్రజల కొనుగోలు శక్తి పెంచి, దేశీయ మార్కెట్‌ను విస్తరించుకోవాల్సి ఉంది. కాని దీనికి భిన్నంగా కేంద్ర ప్రభుత్వం చేసే ఖర్చులను తగ్గించుకుంటూ సంపన్నులకు మరింతగా పన్ను రాయితీలు ఇస్తున్నది. ఒక పక్క దేశ చరిత్రలో ఎన్నడూలేనివిధంగా నిరుద్యోగం పెరుగుతూ ఉంటే కేంద్రప్రభుత్వం జాతీయ ఉపాధి కల్పనకిచ్చే నిధుల్లో 33శాతం తగ్గించడం, ఆహార సబ్సిడీల్లో రూ.9000 కోట్లు, ఎరువుల సబ్సిడీల్లో 50వేల కోట్లు, పెట్రోలియం సబ్సిడీల్లో 6900కోట్లు కోతలు పెట్టడం రాబోయే రోజుల్లో నిత్యా వసర సరుకులు, పెట్రోలు, డీజిల్ ధరలు పెరిగి ప్రజలపై మరింత భారంగా మారబోతున్నది ఆహార సబ్సిడీలు, పెట్రోలు, డీజిల్ సబ్సిడీలు గతంలో కంటే పెంచాలి. నిరుద్యోగాన్ని రూపుమాపి, ప్రజల కొనుగోలు శక్తి పెంచాలి. జాతీయ గ్రామీణ ఉపాధికి కేటాయింపులు పెంచాలి. నగరాల్లో కూడ ఉపాధి హామీ పథకం అమలు చేయాలి. ఆహార పదార్థాలపై జీఎస్టీ, రద్దు చేయాలి. వీటన్నింటికి తగిన విధంగా బడ్జెట్‌లో మార్పులు చేయాలి.



ఇంటర్వ్యూకు వెళ్లిన యువతి అదృశ్యం

- మరో ఘటనలో మతిస్థిమితం లేని యువతి..

నవతెలంగాణ-జవహర్‌నగర్

ఉద్యోగ అన్వేషణలో ఉన్న యువతి ఇంటర్వ్యూకు వెళ్లి అదృశ్యమైంది. ఈ సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ కె. చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం... జవహర్ నగర్ కార్పొరేషన్‌లోని న్యూ గబ్బిలాలపేటలో 25 ఏండ్ల స్వాతి కుటుంబసభ్యులతో కలిసి నివాసముంటుంది. డిగ్రీ వరకు చదివిన ఆమె ఉద్యోగాలకు సన్నద్ధమవుతోంది. గత నెల 31న ఇంటర్వ్యూకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచొక్కొ బయటకు వెళ్లిన స్వాతి ఇంత వరకు తిరిగి రాలేదు. దాంతో ఆమె ఆచూకి కోసం చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా సమాచారం లభించలేదు. దాంతో కుటుంబసభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో ఇంటి బయటకు వెళ్లిన మతిస్థిమితం లేని యువతి అదృశ్యమైంది. కార్పొరేషన్ పరిధిలో నివాసం ఉంటున్న వెంకటమ్మ కూతురు 31 ఏండ్ల శ్రీదేవి మతిస్థిమితం లేకపోవడంతో జనవరి 26న ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. ఆమె ఆచూకి కోసం చుట్టుప్రక్కల, బంధువుల వద్ద వెతికినా సమాచారం లభించలేదు. ఈ మేరకు కుటుంబసభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హెల్త్ అండ్ ఫిట్‌నెస్ ప్రోగ్రామ్‌లో సత్తా చాటిన హైదరాబాదీ బాడీ బిల్డర్స్..

నవతెలంగాణ-హైదరాబాద్

కర్నాటకలోని సేడమ్ జిల్లాలో మొట్టమొదటి సారిగా హెల్త్ అండ్ ఫిట్నెస్ షఫీ షమీ బాడీబిల్డింగ్ అండ్ మెన్స్ ఫిజిక్ ఛాంపియన్‌షిప్-2023 ప్రోగ్రామ్ జరిగింది. ఇందులో మన హైదరాబాద్ కు చెందిన ఇద్దరు యువకులు తమ టాలెంట్ చూపించి విజేతలుగా నిలిచారు. దేశవ్యాప్తంగా పలురాష్ట్రాల నుంచి ఈ పోటీలో బాడీ బిల్డర్లు పాల్గొనగా, మన హైదరాబాద్ నుంచి పాల్గొన్న హరీష్ కుమార్, మన్సూర్ షా ఇద్దరు కూడా ఓవరాల్ విన్నర్స్ గా నిలిచారు. ఈ కార్యక్రమానికి ఐఎఫ్ బీబీ ప్రో అఫ్రోజ్ ఖాన్ ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆర్గనైజర్ షఫీ షమీ మాట్లాడుతూ .. అన్ని గేమ్స్ అండ్ స్పోర్ట్స్ కంటే బాడీబిల్డింగ్ కోసం చాలా కష్టపడాలని అన్నారు. బాడీ బిల్డింగ్ కాంపిటేషన్ లోపాల్గొన్న ప్రతిఒక్కక్కరు విన్నరే అని ఆయన చెప్పారు.



అభివృద్ధి పథంలో రాష్ట్రం నెంబర్ వన్



మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలో..

నవతెలంగాణ-కాప్రా

అభివృద్ధి పథంలో రాష్ట్రం ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో దేశం లోనే నెంబర్‌వన్ రాష్ట్రంగా ఉందని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి అన్నారు. మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని మంగాపురం, కృష్ణానగర్ తదితర కాలనీలలో సుమారు రూ. 50 లక్షల అంచనా వ్యయంతో నూతన పైప్ లైన్ కోసం ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డిలు బుధవారం శంకు స్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ హెచ్ బీ కాలనీ డివిజన్ పరిధిలోని కాలనీలకి సంబంధించి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసుకున్నామని చెప్పారు. ఇక ముందు కూడా అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తూ ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు.. వాటర్ వర్క్స్ జీఎం పి. సంతోష్ కుమార్, డీజీఎం సతీష్, ఏఈ వేణుగోపాల్, మంగాపురం, కృష్ణానగర్ కాలనీల సం క్షేమ సంఘ నాయకులు, బీఆర్ఎస్ శేణులు పాల్గొన్నారు.

కాప్రా డివిజన్‌లోని ఎన్నారై కాలనీలో రూ. 41.90 లక్షల వ్యయంతో కాంపౌండ్ వాల్ ప్లే ఎక్విప్మెంట్స్ ఏర్పాటుకు, వాకింగ్ ట్రాక్ పనులకు, శ్రీరామ్ నగర్ కాలనీలో రూ.20.80 లక్షలతో సీసీ రోడ్డు పనుల నిర్మాణం, బాలాజీ ఎంక్లేవ్‌లో రూ. 8.70 లక్షలతో కమ్యూనిటీ హాల్ మిగిలి ఉన్న పనులకు ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాప్రా కార్పొరేటర్ స్వర్ణ రాజు, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, కుషాయిగూడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఇన్‌స్పెక్టర్లు మహమ్మద్ షఫీ, వేణుమాధవ్, కాప్రా మున్సిపల్ సర్కిల్ అసిస్టెంట్ ఇంజనీర్ అభిషేక్, బీఆర్ఎస్ , కాప్రా డివిజన్ అధ్యక్షుడు సుడుగు మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గిల్బర్ట్, ఉప్పల్ మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ ఎంకే బద్రుద్దీన్, నాయకులు కాసం మహిపాల్ రెడ్డి, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

మీర్‌పేట్ హెచ్.బీ కాలనీ డివిజన్ వార్డు కార్యాలయంలో కుషాయిగూడ వి.ఎన్. రెడ్డి నగర్ కాలనీ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి శాలువాలతో సత్కరించి అభినందించి, తన సహాయ సహకారాలు కాలనీ అభివృద్ధికి ఎల్లవేళలా ఉంటాయని తెలిపారు. అదేవిధంగా కుషాయిగూడ వి.ఎన్. రెడ్డి నగర్ కాలనీ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో మీర్‌పేట ఎస్.వి కాలనీ కార్పొరేటర్ జేరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి, కుషాయిగూడ వి.ఎన్. రెడ్డి నగర్ కాలనీ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడు వాసుదేవా రెడ్డి, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ బుచ్చిరెడ్డి, బాలిరెడ్డి, రామ్ రెడ్డి రామచంద్రారెడ్డి, జాయింట్ సెక్రెటరీ సూర్య భగవాన్, తదితరులు పాల్గొన్నారు.



మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ వార్డు కార్యాలయంలో..



కాప్రా డివిజన్‌లో..

మెట్రో రాయితీ పాస్‌లు ఇవ్వండి

- హెచ్‌ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డికి ఎస్ఎఫ్ఐ విజ్ఞప్తి



నవతెలంగాణ-సిటీబ్యూరో

విద్యార్థులకు రాయితీతో కూడిన మెట్రో రైల్ పాస్‌లు ఇవ్వాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కోరింది. ఈ మేరకు బుధవారం రసూల్‌పూరాలోని మెట్రో రైల్ భవన్‌లో హెచ్‌ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డిని కలిసి హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లెనిన్ గువేరా, అశోక్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు వీరేందర్, శివ, వాసు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ హైదరాబాద్ మెట్రో రైల్ అతికొద్ది కాలంలోనే ప్రజలకు మంచి రవాణా సౌకర్యాన్ని అందిస్తూ ప్రజాధరణ పొందింద న్నారు. అదే సమయంలో నగరంలోని లక్షలాది మంది విద్యార్థులకు మెట్రో రైలు ప్రయాణాన్ని మరింత అందుబాటులో తెచ్చేందుకు రాయితీతో కూడిన మెట్రోరైల్ పాస్‌లు జారీ చేయాలని కోరుతున్నామన్నారు. ఈ పాసుల జారీ చేయడం ద్వారా పేద, మధ్యతరగతి విద్యార్థుల చదువులకు ఎంతో ఉపయోగం జరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. పేద విద్యార్థుల కోసం హెచ్‌ఎంఆర్ఎల్ సంస్థ తమ సామాజిక బాధ్యతగా పాసుల జారీని ప్రారంభిస్తుందని ఆశిస్తున్నామన్నారు. ఆర్టీసీ బస్సులలో బస్సు పాసుల కారణంగా పేద విద్యార్థులకు చాలా మేలు జరుగుతుందని, అదే మాదిరిగా మెట్రో రైల్ సంస్థ సైతం పాసులు జారీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

పేద విద్యార్థినికి బీఎల్ఆర్ ట్రస్ట్ చేయూత



నవతెలంగాణ-కాప్రా

ఏఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని పంచవాటి కాలనీకి చెందిన దోమ ప్రకాష్ (జోసఫ్) కుమార్తె దోమ శ్వేతశ్రీ నిమ్స్‌లో బీఎస్సీ కాడియో వాక్సిలర్ టెక్నాలజీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నది. ఆమె పరాలసిస్ వ్యాధితో బాధపడుతుండగా విషయం తెలుసుకున్న బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి వారి ఇంటికి వెళ్లి 20 వేల రూపా యల ఆర్థిక సహాయం అందజేశారు. గత సంవ త్సరం కూడా ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నియోజకవర్గంలో నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థులకు ఆర్థిక సహాయం చేస్తున్నట్టు తెలిపారు. ఎంబీబీఎస్ సీటు సాధిం చిన విద్యార్థులకు తామే ఫీజు కడుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ రావు నగర్ మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, పార్టీ డివిజన్ ప్రెసిడెంట్ కాసం మహిపాల్ రెడ్డి, బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు గూడ ఇంద్రయ్య, నేమూరి మహేశ్ గౌడ్, గుమ్మడి జంపాల్ రెడ్డి, జోసఫ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మల్టీ గేమింగ్ ప్లాట్ఫారమే గూగ్లీ లక్ష్యం

నవతెలంగాణ-హైదరాబాద్

భారతదేశం తన స్వంత మల్టీ-గేమింగ్ ప్లాట్ఫారమ్ యూనివర్సల్ హెూమ్ గూగ్లీ ఆల్ థింగ్స్ గేమింగ్తో గేమింగ్ విప్లవాన్ని చూసింది. సాధారణం, ఇస్పోర్ట్స్ ప్లేయర్లను ఎంగేజ్ చేసేందుకు భారతదేశంలో అతిపెద్ద గేమర్ల సముదాయాన్ని నిర్మించుందకు అధునాతన ఫీచర్లతో విభిన్న పరికరాల్లో మల్టీ-గేమింగ్ ప్లాట్ఫారమ్ ను రూపొందించడాన్ని గూగ్లీ లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈసందర్భంగా గూగ్లీ సహ వ్యవస్థాపకులు, సీఈఓ శుభదీప్ పాల్ మాట్లాడుతూ... గేమింగ్ ను ప్రజాస్వామ్యం చేయడం, అందరికీ అందుబాటులో ఉండేలా చేయడమే తమ ప్రయత్నమన్నారు. గూగ్లీ అనేది గేమర్లు తమ అవసరాలన్నింటినీ ఒకే ప్లాట్ఫారమ్లో సులభంగా యాక్సెస్ చేయగలరని నిర్ధారించడానికి మాత్రమే కాకుండా, గేమర్లందరూ తమ స్వంత ప్రత్యేక సముదాయాలను ఏర్పరుచుకునేందుకు, వారి స్నేహితులతో ఆడుకునేందుక అనుకూల టోర్నమెంట్లను హెూస్ట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు.



నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని మధుర నగర్ రోడ్ నెంబర్ 6లో 20 రోజులుగా రోడ్డు పైనే మురుగు నీరు నిలవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. -నేరేడ్‌మెట్

ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధన

- అన్ని రకాల మౌలిక సౌకర్యాలతో ప్రభుత్వ బడుల అభివృద్ధి
- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్
- మన బస్తీ, మన బడి కింద అభివృద్ధి చేసిన పాఠశాలల ప్రారంభం



నవతెలంగాణ-బేగంపేట్, బంజారాహిల్స్, సిటీబ్యూరో

ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధన జరిగే విధంగా ప్రభుత్వ పాఠశాలలను అన్ని రకాల సౌకర్యాలు, వసతులతో అభివృద్ధి చేయడమే మన బస్తీ-మన బడి కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. బుధవారం సనత్‌నగర్ నియోజకవర్గం పద్మారావునగర్ లోని మైలార్ గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రూ. 18.92 లక్షల రూపాయల వ్యయంతో, కంటోన్మెంట్ నియోజకవర్గంలోని పికెట్ లక్ష్మీనగర్ ప్రాథమిక పాఠశాలలో 36.28 లక్షల వ్యయంతో, ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని రాజ్ భవన్ ప్రాథమిక పాఠశాలలో రూ. 17.38 లక్షల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు పూర్తి చేయగా, బుధవారం మంత్రి శ్రీనివాస్ యాదవ్ ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు సాయన్న, దానం నాగేందర్, బెవరేజేస్ కార్పొరేషన్ చైర్మెన్ గజ్జెల నగేష్, టీఎస్ఎంఐడీసీ చైర్మెన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత రెడ్డి, హైదరాబాద్ డీఈవో ఆర్.రోహిణిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని అన్ని తరగతి గదులు, టాయిలెట్స్‌ను మంత్రి తిరిగి పరిశీలించారు. నూతన ఫర్నిచర్, పాఠశాల భవనానికి కలర్స్ వేసిన తర్వాత ఎలా ఉంది అని విద్యార్థులను అడగ్గా, చాలా బాగుంది అని విద్యార్థులు చెప్పారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో సరైన సౌకర్యాలు, వసతులు లేని కారణంగానే అనేకమంది విద్యార్థులను వారి తల్లిదండ్రులు వేలాది రూపాయల ఫీజులు చెల్లించి ప్రయివేటు పాఠశాలలకు పంపిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చాలి... విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలనే ముఖ్యమంత్రి ఆలోచన మేరకు మన బస్తీ-మన బడి కార్యక్రమాన్ని చేపట్టినట్టు వివరించారు. ఈ కార్యక్రమం కింద రాష్ట్రంలో 26,065 పాఠశాలలు ఉండగా, మొదటి విడతలో 9,123 పాఠశాలలను ఎంపిక చేసినట్టు తెలి పారు. ఇందుకుగాను రూ.7,289 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు. హైదరాబాద్ జిల్లాలో 239 పాఠశాలలను ఎం పిక చేసి రూ. 44 కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఈ నిధులతో ప్రహరీగోడ నిర్మాణం, టాయిలెట్స్ నిర్మాణం, అభివృద్ధి పనులు, విద్యుత్, తాగునీటి సౌకర్యం, ఫర్నిచర్ కొనుగోలు తదితర 12రకాల అభివృద్ధి పనులను చేపట్టినట్టు చెప్పారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వమూ ఇంత పెద్ద మొత్తంలో నిధులు కేటాయించలేదని ఆయన గుర్తుచేశారు. మన బస్తీ-మన బడి కార్య క్రమంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయని తెలిపారు. కార్పొరేట్ పాఠశాలను తలపించే విధంగా విద్యార్థులకు ఎంతో నాణ్యమైన టేబుల్స్, బెంచీలు, ఇతర ఫర్నిచర్‌ను అందు బాటులోకి తీసుకొచ్చినట్టు చెప్పారు.ఉచితంగా విద్యాబోధనతో పాటు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నట్టు వివరించారు. అన్ని వసతులు, సౌకర్యాలతో కూడిన ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యా ర్థులను చేర్పించాలని పిలుపునిచ్చారు. పాఠశాలల ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు పాఠశాలను ఎంతో సక్రమంగా నిర్వహించుకోవాలన్నారు. కార్పొరేటర్‌లు హేమ లత, విజయారెడ్డి, నళిని యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ ప్రసన్న, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారి షఫీ, డిప్యూటీ ఈవోలు చిరంజీవి, సామ్యూల్ రాజ్, బాలు నాయక్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ విజయ్ కుమార్, సెక్టో రియల్ ఆఫీసర్ రజిత, ప్రధానోపాధ్యా యులు ఉమాదేవి,రత్న మాల, మంజులత, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు చెత్త తరలింపు డబ్బాలు పంపిణీ

నవతెలంగాణ-ఓయూ

నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, బీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడు శోభన్ రెడ్డితో కలిసి తార్నాకలోని తమ క్యాంపు కార్యాలయంలో రాంకీ సంస్థ ద్వారా సమకూర్చిన కొత్త చెత్త తరలింపు డబ్బా (వీల్ బీన్స్) లను పారిశుద్ధ కార్మికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ హైదరబాద్ నగరాన్ని పరిశుభ్రంగా, చెత్త రహితంగా తీర్చిదిద్దాలన్నారు. ఇందుకు అధికారులు తెరవ తీసుకుని ప్రజలను చైతన్యవంతులని చేయాలన్నారు. పరిసరాలు శుభ్రత ఉంచి, ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వీకరించాలన్నారు. పారిశుభ కార్మికులకు సహకరిస్తూ చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కొత్త వీల్ తరలింపు బండ్ల వల్ల పారిశుధ్య కార్మికులకు కొంతమేర శ్రమ తగ్గి చెత్త తరలింపు సులభతరం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ, రాంకీ సంస్థ అధికారులు, ఎస్ఎఫ్ఏ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు , తదితరులు పాల్గొన్నారు.

జైస్వాల్ గార్డెన్ అభివృద్ధికి అధికారులు సహకరించాలి

నవతెలంగాణ-అంబర్‌పేట



జైస్వాల్ గార్డెన్ అభివృద్ధికి అధికారులు సహకరించాలని జైస్వాల్ గార్డెన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చింతల శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. మంగళవారం గోల్నాక డివిజన్ పరిధిలోని జైస్వాల్ గార్డెన్‌లో తుప్పు పట్టిన విద్యుత్ స్తంభాల ప్లేస్‌లో కొత్తవి స్థానిక అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తాననీ, అందుకు అధికారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ కమిటీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌చారి, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి యాదవ్‌రెడ్డి, ప్రతినిధులు రామన్‌గౌడ్, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మత్స్య కారులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-అంబర్‌పేట



మత్స్యకారులకు ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా అండగా ఉంటుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. వివిధ రకాల చేపల వంటకాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావడానికి చర్యలు తీసుకుంటున్నట్టు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. బుధవారం మాసాబ్ ట్యాంక్ లోని మత్స్యశాఖ కార్యాలయం ఆవరణలో రూ.25 లక్షలతో నూతనంగా అభివృద్ధి చేసిన ఫిష్ క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో చేపల వినియోగాన్ని పెంచేందుకు చేపల వంటకాలపై మహిళలకు శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు వివరించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రారంభించిన ఉచిత చేప పిల్లల పంపిణీతో మత్స్య సంపద గణనీయంగా పెరిగిందని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో ఈ రంగానికి తగిన ఆదరణ లేదనీ, రాష్ట్ర ఆవిర్భావం తర్వాత సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక నిధులు కేటాయించినట్టు తెలిపారు. పెరిగిన మత్స్య సంపదను మత్స్యకారులు విక్రయించుకోవడానికి గాను సబ్సిడీపై వివిధ రకాల వాహనాలు అందజేసినట్టు చెప్పారు. చేపలు, చేపల వంటకాల విక్రయాల కోసం సబ్సిడీపై మొబైల్ రిటైల్ ఫిష్ ఔట్ లెట్‌లను కూడా అందజేసినట్టు వివరించారు. మత్స్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్యాంటీన్‌లో లభించే చేప వంటకాలకు ఆదరణ పెరిగిన కారణంగా వచ్చే వినియోగదారులకు సౌకర్యవంతంగా ఉండేలా ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. త్వరలోనే వివిధ రకాల వంటకాలతో కూడిన ఫిష్, మటన్ స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. రాష్ట్రంలోని మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తుందని చెప్పారు. ప్రభుత్వ పథకాల లబ్ది అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాలనే ఉద్దేశంతోనే మత్స్య సొసైటీలలో సభ్యత్వ నమోదు స్పెషల్ డ్రైవ్ చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అధర్ సిన్హా, మత్స్య శాఖ కమిషనర్ లచ్చిరాం భూక్యా, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ రాంచందర్, మంజువాణి, శ్రీనివాస్, మురళీకృష్ణ, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ కొనసాగిన ఇంటింటి సర్వే



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ నియోజకవర్గం, రహమత్ నగర్ డివిజన్ ఎస్‌పీఆర్ హిల్స్, హెూమ్ నగర్‌లో సీఐటీయూ, డీవైఎఫ్ఐ, ఐద్వా శ్రామిక మహిళా సమన్వయ కమిటీ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రెండో రోజు డబుల్ బెడ్‌రూం ఇండ్ల కోసం ఇంటింటి సర్వే కొనసాగింది. ఈ సర్వేలో ప్రజా సంఘాల బృందం దృష్టికి వందలాది మంది ప్రజలు డబుల్ బెడ్ రూమ్స్ కోసం దరఖాస్తులు చేసుకున్నామని తెలిపారు. 15, 20 ఏండ్ల నుంచి అద్దె ఇంట్లో జీవనం కొనసాగిస్తున్నామనీ, కుటుంబం మొత్తం కూలి పనులు చేసుకుని సంపాదించిన ఆదాయం ఇంటి అద్దె, పిల్లల చదువు, వైద్యం ఖర్చులకు కూడా సరిపోవట్లేదని బృందం దృష్టికి తీసుకొచ్చారు. సీఐటీయూ హైదరాబాద్ నగర ఉపాధ్యక్షులు జె.స్వామి ఈ సర్వేలో వచ్చిన సమస్యల మీద మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో ఇల్లు లేని ప్రతి పేద కుటుంబానికీ డబుల్ బెడ్ రూమ్స్ కట్టిస్తానని హామీ ఇచ్చిందనీ, 120 గజాల స్థలంలోపు ఉన్నవారికి ఇల్లు నిర్మాణం కోసం రూ.3లక్షలు ప్రభుత్వం ఇస్తుందని ఇచ్చిన హామీలను ఈ 9 ఏండ్లలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎక్కడా అమలు కాలేదన్నారు. నియోజకవర్గంలో ఇల్లు లేని ప్రతి కుటుంబాన్ని గుర్తించి, అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇవ్వాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 9వ తేదీన చలో హైదరాబాద్ మహా ధర్నా చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు టి.సాయి శేష గిరిరావు, ఆర్.అశోక్, ఏఆర్.నరసింహ, బి.లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్స్ ఇలా..

1. అర్హులైన పేదలందరికీ 'డబుల్' ఇండ్లు కట్టివ్వాలి
2. ఇంటి స్థలం ఉన్న పేదలందరికీ ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలు ఇవ్వాలి
3. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్లను వెంటనే పూర్తి చేయాలి.

అసలు నోట్లు తీసుకుని నకిలీ నోట్ల అందజేత



- హవాలా కేసును ఛేదించిన నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్సు పోలీసులు
- నలుగురు నిందితుల అరెస్టు
- రూ.72లక్షల స్వాధీనం

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఒర్జినల్ నోట్లు తీసుకుని నకిలీ నోట్లు అందిస్తున్న ముఠాలోని నలుగురు నిందితులను నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్సు పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.72 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. బుధవారం బషీర్‌బాగ్‌లోని ఓల్డ్ పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ రాధాకిషన్‌రావుతో కలిసి అదనపు సీపీ ఏఆర్ శ్రీనివాస్ వివరాలను వెల్లడించారు. రాజస్థాన్‌కు చెందిన కన్హయ్యాలాల్ అలియాజ్ జతిన్, అదే రాష్ట్రానికి చెందిన రమావతర్ శర్మా అలియాజ్ మోహన్, భరత్‌కుమార్, రామక్రిష్ణా శర్మలు వివిధ వ్యాపారాలు చేస్తున్నారు. అయితే అందులో ఆశించిన తీరులో సంపాదన లేకపోవడంతో హవాల దందాపై దృష్టి సారించారు. ముంబాయ్, ఢిల్లీ, కల్‌కత్తా తోపాటు ఇతర రాష్ట్రాలల్లో హవాలా రూపంలో డబ్బులు సరఫరా చేస్తున్నారు. అయితే ఇందులోనూ ఆశించిన తీరులో సంపాదన లేకపోవడంతో నకిలీ నోట్లపై దృష్టి సారించారు. ఈ ముఠా ఒర్జినల్ నోట్లు తీసుకుని బాధితులకు మాత్రం కలర్ జిరాక్స్ తీసిన నకిలీ నోట్లను అందిస్తున్నారు. ఇదే తరహాలో ఢిల్లీల్లో ఓ వ్యక్తి నుంచి దాదాపు రూ.80లక్షలు ఒర్జినల్ నోట్స్‌ను తీసుకున్నారు. వాటిని హవాలా రూపంలో మాదాపూర్‌లో 'ఐకాన్ టెక్నాలజీస్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్'కు అందించాల్సి ఉంది. అయితే ఒర్జినల్‌కు బదులుగా నకిలీ నోట్లను గత నెల 28న నాంపల్లిలో ఆ సంస్థ ప్రతినిధులకు అందించారు. ఆలస్యంగా గమనించిన వారు నకిలీ నోట్లగా గుర్తించారు. వెంటనే నిందితులకు ఫోన్లు చేయడంతో స్విచ్ఛాఫ్‌గా వచ్చాయి. మోసపోయినట్టు గుర్తించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీసీపీ రాధాకిషన్‌రావు ఆదేశాలతో విచారణ చేపట్టిన సీఐ టీ.శ్రీనాథ్‌రెడ్డి అన్ని కోణాల్లో విచారించారు. టాస్క్‌ఫోర్సు ఎస్ఐ బీ.అశోక్‌రెడ్డితోపాటు కే.శ్రీకాంత్, ఎం.అనంత చారి, బీ.అరవింద్ గౌడ్ కలిసి నిందితులను అరెస్టు చేశారు. నగరంలో సంచలనం రేపిన హవాలా కేసును ఛేదించినందుకు అదనపు సీపీ ఏఆర్ శ్రీనివాస్ టాస్క్‌ఫోర్సు పోలీసులను ప్రత్యేకంగా అభినందించారు.

హరీశ్‌రావును కలిసిన ఓయూ ఉద్యోగులు

నవతెలంగాణ-ఓయూ



ఓయూ ఎన్జీఓఎస్ అధ్యక్షుడు బియ్యాని జ్ఞానేశ్వర్, ఉద్యోగ సంఘాల నాయకులు ఓపీఎస్/సీపీఎస్ ఇంప్లిమెంటేషన్ కోసం మంత్రి తన్నీరు హరీష్ రావును కలిసి సుదీర్ఘంగా వివరించి వినతిపత్రం అందజేశారు. దీర్ఘకాలిక సమస్యకు సంబంధించిన నేటి సమావేశం ఉద్యోగులుకు తీపి కబురు అని హామీ ఇచ్చారని చెప్పారు.



బీఆర్ఎస్వీ నాయకుల అరెస్ట్

నవతెలంగాణ-ఓయూ

ఓయూ బీఆర్ఎస్వీ నాయకుల ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఎదుట బుధవారం గుజరాత్ అల్లర్లపై బీబీసీ రూపొందించిన డాక్యుమెంటరీని ప్రదర్శిస్తున్న విద్యార్థులను పోలీసులు అడ్డుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దమ్మ రమేష్, రాష్ట్ర కార్యదర్శులు జీడీ అనిల్, రాజేష్ నాయక్, కునపురం శశిపాల్, నాగేందర్ రావు అవినాష్, మధు గౌడ్, అనిల్, రాజు, నాగరాజు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

23న ఎర్రగడ్డ చెస్ట్ హాస్పిటల్ వద్ద కార్మికులతో ధర్నా

నవతెలంగాణ-జూబ్లీహిల్స్



ఎర్రగడ్డ చెస్ట్ హాస్పిటల్‌లో కార్మికులకు జీవో 60 ప్రకారం రూ.15,600 ఇవ్వాలని హాస్పిటల్ ఎదుట ఈ నెల 23వ తేదీన రిలే నిరాహార దీక్ష చేయనున్నట్టు సీఐటీయూ యూనియన్ కమిటీ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహబూబ్ ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ హాస్పిటల్స్‌లో జీవో 60 అమలు చేస్తున్న ప్రభుత్వం, ఎర్రగడ్డ చెస్ట్ హాస్పిటల్‌లో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. వెంటనే ఈ జీవో అమలు చేయాలని ఈ నిరసన చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాపర్తి అశోక్, వైస్ ప్రెసిడెంట్ ఎస్.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నస్రిన్, విటల్ పాల్ పాల్గొన్నారు.

ముషీరాబాద్ నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యం



- రూ.38 లక్షలతో వీడీసీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం
- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే మూఠా గోపాల్ పేర్కొన్నారు. బుధవారం ముషీరాబాద్ డివిజన్ పరిధిలోని బర్ల గల్లీలో రూ.12 లక్షలు, కమలా నెహ్రూ నగర్ లో రూ.11 లక్షలు, వైఎస్ఆర్ పార్కు వద్ద గల కుమ్మరి గల్లీలో రూ.15 లక్షల జనరల్ బడ్జెట్ నిధులతో వీడీసీసీ రోడ్ల నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ సుప్రియ నవీన్ గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రధాన సమస్యగా ఉన్న డ్రయినేజీ వ్యవస్థను రూ.కోట్లతో బడ్జెట్‌తో పెరిగిన జనాభాకు అనుగుణంగా ఆధునికరిస్తున్నామని తెలిపారు. ఈ క్రమంలో ధ్వంసమైన పాత సీసీ రోడ్ల స్థానంలో నూతన వీడీసీసీ రోడ్లను నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకులు ముఠా జై సింహ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సోమన్, దీన్ దయాల్ రెడ్డి, ముషీరాబాద్ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆకుల అరుణ్, మహంకాళి టెంపుల్ చైర్మన్ ఎయిర్టెల్ రాజు, ప్రశాంత్, బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గ కో-కన్వీనర్ నవీన్ గౌడ్, బీజేవైఎం ముషీరాబాద్ కన్వీనర్ గడ్డం నవీన్, మహంకాళి జిల్లా కార్యదర్శి అనిల్, కంచి ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి




నవతెలంగాణ-అంబర్‌పేట

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. బుధవారం బాగ్ అంబర్ పేట డివిజన్ పరిధిలోని వైభవ నగర్ కాలనీలో ఎమ్మెల్యే స్థానిక అధికారులతో కలిసి పాదయాత్ర నిర్వహించి ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీజన్స్ హాస్పిటల్ లైన్లో రూ.30 లక్షలతో నూతనంగా వేసిన సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో అంబర్‌పేట నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేపడుతూ ప్రజలకు సకల సౌకర్యాలను అందిస్తున్నామని చెప్పారు. ఈ నేపథ్యంలో రూ.75 లక్షలతో వైభవ్ నగర్ కాలనీ పార్కులో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు త్వరలోనే శంకుస్థాపన చేస్తామనీ, ఇప్పటి వరకు వైభవ్ నగర్ కాలనీలో సుమారు రూ.2 కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేపట్టామనీ, భవిష్యత్తులో మరిన్ని పనులు చేపడతామని ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు నర్సింగ్‌యాదవ్, గణేష్, అధికారులు పాల్గొన్నారు.

విద్యా రంగాన్ని విస్మరించిన కేంద్ర బడ్జెట్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ లో పూర్తిగా విద్యా రంగాన్ని విస్మరించిందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ బడ్జెట్ కేవలం పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రవేశపట్టిన ఎన్నికల బడ్జెట్ తప్ప విద్యార్థులు, యువకులకు ఈ బడ్జెట్ ద్వారా ఏమీ ప్రయోజనం లేదన్నారు. బడ్జెట్ లో విద్యకు 10 శాతం నిధులు కేటాయించాలని కొఠారి కమిషన్ చెప్పినా మోడీ ప్రభుత్వం విద్యా రంగం పట్ల చిన్న చూపు చూస్తూ కనీసం 5 శాతం నిధులు కేటాయించలేదన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి కేంద్ర ప్రభుత్వం రూ.1,12,899 కోట్లు కేటాయించిందనీ, ఈ మొత్తంలో పాఠశాల విద్య, అక్షరాస్యత శాఖకు రూ.68,804.85 కోట్లు, ఉన్నత విద్యా శాఖకు రూ.44,094.62 కోట్లు కేటాయించారని తెలిపారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బడ్జెట్ లో విద్యకు నిధులు తగ్గిస్తూనే కార్పొరేట్ కంపెనీలకు దోచి పెడుతుందన్నారు. డిజిటల్ విద్య, లైబ్రరీ ప్రాధాన్యత అంటున్న మోడీ ప్రభుత్వం పేద వారికి విద్యను దూరం చేసి విద్యను మొత్తం ప్రైవేటీకరణ చేసే కుట్ర చేస్తుందనీ, ఈ బడ్జెట్ లో విద్యార్థులకు సంబంధించిన స్టేషనరీ వస్తువులపై జీఎస్టీ ఎత్తివేయడం, కనీసం తగ్గించడం లేదనీ, ముఖ్యంగా తెలంగాణ విభజన హామీల్లో ఉన్న ట్రిపుల్ ఐటీ, జిల్లాకో నవోదయ పాఠశాలల ఏర్పాటు, కేంద్రీయ విద్యాలయల ఏర్పాటు, గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు ఈ బడ్జెట్ లోనైనా వస్తాయనుకుంటే మొండి చేయి చూపించిందన్నారు. యూనివర్సిటీలను నిర్వీర్యం చేస్తూ ప్రైవేట్, విదేశీ యూనివర్సిటీలకు ప్రాధాన్యం ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. ఈ బడ్జెట్ పూర్తిగా విద్యార్థి వ్యతిరేక బడ్జెట్ అనీ, తెలంగాణ రాష్ట్ర విద్యార్థుల పట్ల తెలంగాణ విభజన హామీల్లో ఉన్న విద్యా సంస్థలను తెలంగాణకు కేటాయించకుండా మోడీ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించిందన్నారు. విద్యార్థి వ్యతిరేక విధానాలపై ఏఐఎస్ఎఫ్ అధ్వర్యంలో ఉద్యమిస్తామన్నారు.

ఆశా వర్కర్స్ సమస్యలను అసెంబ్లీ సమావేశాల్లో చర్చించండి

నవతెలంగాణ-ధూల్‌పేట్



ఆశా వర్కర్స్ సమస్యలను అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి, పరిష్కారానికి కృషి చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయు) గోషామహల్ జోన్ కమిటీ నాయకులు కే.జంగయ్య కోరారు. యూనియన్ ఆధ్వర్యంలో గోషామహల్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్ కార్యాలయంలో కార్యదర్శి అర్జున్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశాలకు కనీస వేతనం రూ.20వేలు ఇవ్వాలనీ, ఈలోపు ఆంధ్రప్రదేశ్‌లో ఇస్తున్నట్టు వేతనం రూ.10వేలు వెంటనే నిర్ణయం చేయాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. 2022 డిసెంబర్ 6 నుంచి నిర్వహించిన లెప్రసీ సర్వే ప్రభుత్వం అధనంగా డబ్బులు చెల్లించాలన్నారు. 2023 జనవరి 18 నుంచి నిర్వహించిన కంటి వెలుగు పనికి అదనపు డబ్బులు చెల్లించాలన్నారు. గతంలో అశాలు నిర్వహించిన లెప్రసీ, కంటి వెలుగు పెండింగ్ డబ్బులను వెంటనే చెల్లించాలన్నారు. టీబీ స్ఫూటమి డబ్బాలను ఆశాలతో ముగించే పనిని రద్దు చేయాలన్నారు. ఆశాలకు పని భారం తగ్గించి, జాబ్ చార్టులను విడుదల చేయాలన్నారు. 2021 జూలై నుంచి డిసెంబర్ వరకు ఆరు నెలల పీఆర్సీ ఎరియర్స్ వెంటనే చెల్లించాలన్నారు. కేంద్రం చెల్లించిన కరోనా రిస్క్ అలవెన్స్ నెలకు రూ.వెయ్యి చొప్పున 16 నెలల బకాయి డబ్బులు వెంటనే చెల్లించాలన్నారు. 32 రకాల రిజిస్టర్ ప్రింట్ చేసి ప్రభుత్వం సప్లై చేయాలనీ, ఈ లోపు రిజిస్టర్స్ కోసం పెట్టిన ఖర్చులు చెల్లించాలన్నారు. క్వాలిటీతో కూడిన ఐదేండ్లుగా పెండింగ్ లో ఉన్న యూనిఫామ్ వెంటనే ఇవ్వాలన్నారు. జిల్లా ఆస్పత్రిలో ఆశాలకు రెస్ట్ రూములు ఏర్పాటు చేయాలన్నారు. ఖాళీ పోస్టులు వెంటనే భర్తీ చేయాలనీ, ఈలోపు పని చేసిన ఆశలకు ఇన్చార్జ్ అలవెన్స్ చెల్లించాలన్నారు. ఆశాలపై అధికారుల వేధింపులు ఆపాలనీ, ప్రసూతి సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకుల కె.నాగమణి, పి.నాగేశ్వర్ పాల్గొన్నారు.

రైస్ బ్రాన్ ఆయిల్ గుండెకు అనుకూలమైన నూనె

నవతెలంగాణ-జూబ్లీహిల్స్



మన రోజువారీ జీవితంలో మనం మన కలలను అన్వేషిస్తూ ముందుకు సాగుతుంటాం. మరింతగా సంపాదించాలనీ, మరింత శక్తివంతం కావాలనీ, మంచి గౌరవ మర్యాదలు పొందాలని తలపోస్తుంటాం. ఈ ప్రక్రియలో మనం ఎంతో ఒత్తిడి ఎదుర్కోవడంతో పాటు మన ఆరోగ్యాన్నీ నిర్లక్ష్యం చేస్తుంటాం. వ్యాయామం చేయకపో వడం, నిద్ర సరిగా పోకపోవడం, విపరీతంగా అనారోగ్యకరమైన స్నాక్స్‌ను తినడం, ఇతర జంక్ ఫుడ్ తీసుకోవడం కనిపిస్తుంది. ఇవన్నీ కూడా ఊబకాయం, మధుమేహం, గుండె సమస్యలు, ఇతర రోగాలు రావడానికి కారణమవుతాయి. మనం ఆరోగ్యంగా ఉండటానికి మనం ఏం చేయాలి?.

ఆరోగ్యవంతమైన జీవితానికి ఆరోగ్యవంతమైన కార్యక్రమాలు? మనం తీసుకునే ఆహారం మన బరువు, హార్మోన్లు, అవయవాల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. సరైన ఆహారం తీసుకుంటే గుండె ఆరోగ్య సమస్యలు, స్ట్రోక్ ప్రమాదం గణనీయంగా తగ్గుతుంది. హెూల్ గ్రెయిన్ ఫుడ్ తీసుకోవడం ఓ అలవాటుగా మార్చుకోవడంతో పాటు తాజా పండ్లు, కూరగాయలు తీసుకోవాలి. ఫైబర్స్, విటమిన్స్, మినరల్స్, కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్స్ వీటిలో అధికంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి మంచిది. కొద్ది మొత్తంలో కొవ్వు కూడా డైట్‌లో భాగం చేసుకోవాలి. రైస్ బ్రాన్ ఆయిల్ లాంటి నూనెల వినియోగం మంచిది. వీటిలో మోనో శాచురేటెడ్ ఫ్యాట్స్, గామా ఒరైజనాల్ వంటివి ఉండటం వల్ల మనకు ప్రయోజనకరంగా ఉంటుంది.

రైస్ బ్రాన్ ఆయిల్ మూలం

ఊకను తొలగించిన తర్వాత బియ్యంను పాలిష్ చేస్తున్న సమయంలో పొందే ఉప ఉత్పత్తి బంగారు వర్ణపు పొర రైస్ బ్రాన్. ఈ బ్రాన్ నుంచి తీసిన నూనె రైస్ బ్రాన్ ఆయిల్. వైద్య పరంగా ఈ నూనెలో అత్యంత ముఖ్యమైన యాంటీ ఆక్సిడెంట్ గామా ఒరైజనాల్ ఉంది. మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్) నిష్పత్తిని పెంచడం ద్వారా టోటల్ ప్లాస్మా కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్స్‌ను తగ్గించి బ్లడ్ కొలెస్ట్రాల్‌ను మెరుగుపరచడంలో అత్యంత క్రియాశీలకమైన భాగమిది.

ఫిజికల్లీ రిఫైండ్ రైస్ బ్రాన్ ఆయిల్ సాధారణంగా గోల్డెన్ ఎల్లో రంగులో ఉంటుంది. దీన్ని స్టీమ్ డిస్టిలేషన్ ప్రక్రియ ద్వారా శుద్ధి చేస్తారు. దీనివల్ల అత్యవసర పోషకాలన్నీ సంరక్షించబడతాయి. ఫ్రీడమ్ రైస్ బ్రాన్ ఆయిల్‌లో 10000o పీపీఎం ఒరైజనాల్ ఉంది. ఇది చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) తగ్గించడంతో పాటు మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్)ను మెరుగుపరుస్తుంది. తద్వారా మీతో పాటు మీ ప్రియమైన వారు కూడా చక్కగా ఉండేందుకు, ఆరోగ్యవంతమైన గుండెను పొందేందుకు ఇది అత్యధిక స్మోక్ పాయింట్ కలిగి ఉంది. అందువల్ల అత్యధిక ఉష్ణోగ్రతల వద్ద వంట చేసినప్పటికీ స్థిరంగా ఉంటుంది. వేపుళ్లకు సైతం ఇది అత్యంత అనుకూలంగా ఉంటుంది. ఇవే అంశాలు ప్రతి భారతీయ గృహంలోనూ తప్పనిసరిగా ఉండాల్సిన వంటనూనెగా రైస్ బ్రాన్ ఆయిల్‌ను నిలుపుతుంది. ఇంకో విషయం ఏమిటంటే, ఆరోగ్యవంతమైన నూనెలుగా పేర్కొనబడుతున్న కొన్ని నూనెలు, అత్యధిక ఉష్ణోగ్రతల వద్ద అస్థిరంగా ఉంటాయి. అందువల్ల అవి కేవలం డ్రెస్సింగ్స్‌కు మాత్రమే పనికొస్తాయి తప్ప భారతీయ గృహాలకు అస్థిరంగా ఉంటాయి. రైస్ బ్రాన్ ఆయిల్‌లో విటమిన్ ఈ, కొలెస్ట్రాల్ తగ్గించే సామర్థ్యాలు సైతం ఉన్నాయి. ఇవి అత్యుత్తమంగా ఫ్యాటీ యాసిడ్స్ కలిగి ఉన్నాయి. అందువల్ల రైస్ బ్రాన్ ఆయిల్ ఆరోగ్యవంతమైన ఆహార ఎంపికగా నిలుస్తుంది. ఈ సందర్భంగా పి.చంద్రశేఖర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సేల్స్ అండ్ మార్కెటింగ్ ఫ్రీడం రైస్ బ్రాన్ ఆయిల్ మాట్లాడుతూ నిపుణులు వెల్లడించే దాని ప్రకారం ఒకవేళ ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనశైలి అనుసరించాలంటే, వారు సరిగా తినాలి, అలాగే చెడు అలవాట్లు అయిన పొగ తాగడం మానేయాలీ, కనీసం రెండు నుంచి మూడు లీటర్ల వరకు నీరు తాగాలి అని తెలిపారు.

ఎనిమిదేండ్ల ఆశ నిరాశే..

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



8 ఏండ్లుగా ఎదురు చూస్తున్న ఉద్యోగులకు కొత్త బడ్జెట్ తీవ్ర నిరాశ మిగిల్చిందని టీఎస్సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు నరేందర్ రావు అన్నారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ పై ఆయన మాట్లాడుతూ వేతనాల్లో కోతలు తప్ప కొత్తగా ఊరటనిచ్చిన అంశం ఏమీ లేదన్నారు. 2023 బడ్జెట్ పాత సీసాలో కొత్త సారా లాగ ఉందనీ, పన్ను పరిధిని కొత్త పద్ధతిలో 7లక్షలకు పెంచినా ఎలాంటి మినహాయింపులు ఇవ్వలేదన్నారు. పాత పద్ధతిలో 5 స్లాబ్‌లు పెంచినప్పటికీ ఉపయోగం లేదన్నారు. కొనుగోలు శక్తి తగ్గినప్పటికీ, ధరలు వంద రెండు వందల శాతం పెరిగిన, ఉద్యోగులు ఆశించిన ఊరట ఊరటగానే మారిందన్నారు. సీపీఎస్ ఉద్యగులకు 80డీ కింద ఇచ్చే రూ.50వేల మినహాయింపులో ఎలాంటి మార్పు లేదన్నారు. సీపీఎస్ ఉద్యోగి పదవీ విరమణ పొందినప్పుడు మార్కెట్ నుంచి ఉపశమహరించుకునే 60 శాతం డబ్బులపై పన్ను మినహాయింపు పరిధిని పెంచలేదన్నారు. 80సీ సెక్షన్ కింద వర్తించే పొదుపు 1.50లక్షలలో ఎలాంటి మార్పు లేదన్నారు. గృహ రుణాల వడ్డీ రేట్లు 7 శాతం నుంచి దాదాపుగా 10శాతం పెరిగినప్పటికీ వడ్డీ రాయితీలో ఇంతకు మునుపు ఇచ్చే రూ.2లక్షలు తప్ప ఎలాంటి మినహాయింపు లేకపోవడం దారుణమన్నారు. ఈ బడ్జెట్‌ను ఉద్యోగ వ్యతిరేక బడ్జెట్‌గా పరిగణిస్తున్నామన్నారు. గత 8 ఏండ్ల సంప్రదాయం కొనసాగిస్తూనే కార్పొరేట్ సంస్థ లకు కొమ్ము కాసే విధానాన్నే అవలంభించారన్నారు. పేద, మధ్యతరగతి ప్రజల నడ్డి విడిచే బడ్జెట్ తీవ్రంగా వ్యతిరేకస్తున్నామన్నారు.

వక్ఫ్ బోర్డ్ ఆస్తులను కాపాడేందుకు కఠినమైన చట్టాలు తీసుకురావాలి



నవతెలంగాణ-అడిక్‌మెట్

వక్ఫ్ బోర్డ్ ఆస్తులను కాపాడేందుకు ప్రభుత్వం కఠినమైన చట్టం తీసుకురావాలని మాజీ రాజ్యసభ సభ్యుడు అజీజ్ పాషా డిమాండ్ చేశారు. హిందూ ఆలయాల ఆస్తులను కాపాడేందుకు రూపొందించిన చట్టం తరహాలో చట్టాన్ని తీసుకురావాలని కోరుతున్నట్టు తెలిపారు. బుధవారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద ఆలిండియా మైనార్టీ రైట్స్ ఫోరం, ఆవాజ్, ఆన్సాప్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అజీజ్ పాషా మాట్లాడుతూ తాము కొత్తగా కోరుతున్నది ఏమీ లేదనీ, గతంలో సీఎం కేసీఆర్ అసెంబ్లీలో మూడు సార్లు బహిరంగ సభలో రెండు సార్లు చేసిన ప్రకటనలను అమలు చేయాలని కోరుటున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో 33,929 ఆస్తులు, 77,538 ఎకరాల భూములు ఉండగా 57,123 ఆస్తులు కబ్జాల పాలయ్యాయని తెలిపారు. 100 కేసులు ట్రిబ్యునల్స్‌ల్లో నడుస్తున్నాయని తెలిపారు. న్యాయపరమైన చర్యలు తీసుకునే అధికారం లేనందున కబ్జాదారులకు భయం లేకుండా తమ ఇష్టారాజ్యంగా కబ్జాలకు పాల్పడుతున్నారని తెలిపారు. వెంటనే ప్రభుత్వం స్పందించి వక్ఫ్ బోర్డు ఆస్తులు అక్రమణకు గురికాకుండా ప్రత్యేక చట్టం తీసుకురావాలనీ, లేనిపక్షంలో తమ సంస్థల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ ధర్నాలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఎంఏ సిద్ధికి, దక్కన్ ఎక్స్ ప్రాపర్టీస్ ప్రొటెక్షన్ సొసైటీ అధ్యక్షుడు అల్ హజారీ, ఇన్సాఫ్ కన్వీనర్ మునీర్ పటేల్, ఆవాజ్ ప్రతినిధి మహ్మద్ అలీ, వివిధ సంఘాల నాయకులు అబ్రార్ హుస్సేన్, మైనార్టీ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలో ఇంటింటికీ తురుగుతూ లబ్దిదారులకు డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సామల హేమ, బీఆర్ఎస్ యువ నాయకులు కిషోర్ కుమార్‌గౌడ్, రామేశ్వర్‌గౌడ్, అధికారులు పాల్గొన్నారు. నవతెలంగాణ-ఓయూ



నవతెలంగాణ
కుత్బుల్లాపూర్
గురువారం 2 ఫిబ్రవరి 2023

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన ప్రజలు



నవతెలంగాణ-దుండిగల్
మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు శంభీపూర్‌లోని కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యాక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రజలు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు



నవతెలంగాణ-దుండిగల్
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని దుండిగల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు హనుమంత్‌రెడ్డి బుధవారం తన పుట్టిన రోజు సందర్భంగా ఎమ్మెల్యే కేపి వివేకానంద్‌ని కొంపల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు రూ.6వేల పెన్షన్ ఇవ్వాలి



- సంక్షేమ పథకాలను మెరుగుపర్చాలి
- తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం, ఐఎఫ్‌టీయూ
- జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా.. అదనపు కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-సిటీబ్యూరో
భవన నిర్మాణ కార్మికులకు రూ.6వేల పెన్షన్ ఇవ్వాలని, సంక్షేమ పథకాలను మెరుగుపర్చాలని తెలంగాణ ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం హెచ్74 (ఐఎఫ్‌టీయూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు నల్లన్న అధ్యక్షత వహించిన ఈ ధర్నాలో తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు హన్మేశ్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.ఎల్.పద్మ, గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి రాందాసు, నాయకులు రాజు, వెంకటేష్, నాగరాజు, బాలస్వామి, బొమ్మను పహడు మల్లేష్, కోశాధికారి అంజి, రమేష్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేస్ ప్రదీప్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు అనిల్, పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షులు స్వరూప, ప్రజాపంథా నాయకులు రవి తమ సంఘీభావం ప్రకటించారు. అంతకు ముందు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆ సంఘం ప్రతినిధుల బృందం కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను మెరుగుదల చేయాలని, ప్రమాద మరణానికి రూ.6లక్షల నుంచి 10 లక్షలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సహజ మరణానికి రూ.లక్ష 30వేల నుంచి రూ.5లక్షలకు పెంచాలని, 60 ఏండ్లు పైబడిన వారికి రూ.6వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. పెండ్లి కానుక, ప్రసూతి సహాయం రూ.30వేల నుంచి లక్ష రూపాయలకు పెంచాలని కోరారు. ఇండ్లు లేనివారికి డబుల్ బెడ్‌రూమ్ మంజూరు చేయాలని, సొంత స్థలం ఉన్నవారికి రూ.5లక్షల ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల పిల్లలకు గురుకులాల్లో ప్రవేశాలు, స్కాలర్‌షిప్స్ మంజూరు చేయాలన్నారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డులోకి కార్మిక సంఘాల ప్రాతినిధ్యం, కార్మిక శాఖలోని ఖాళీలను భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. నగరంలో పనిచేస్తున్న కార్మికులకు సంక్షేమ బోర్డు కనీస అవసరాలు తీర్చడంలేదని, అడ్డాలు లేవని, ఉన్నవాటికి షెల్టర్స్ లేవన్నారు. తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులకు గురికావడంతో పాటు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. అధికారులు స్పందించి నగరంలో అడ్డాల దగ్గర సౌకర్యాలు కల్పించాలని కోరారు. రాష్ట్రంలో కార్డులు తీసుకోలేని ఎనిమిది లక్షల మందికి యుద్ధ ప్రాతిపదికన లేబర్ కార్డు ఇప్పించాలని వారు డిమాండ్ చేశారు.

కార్పొరేట్ స్కూళ్లతో పోటీపడే విధంగా ప్రభుత్వ పాఠశాలలు

- పేద విద్యార్థుల విద్యాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం
- రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ-దుండిగల్
తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల స్వరూపాన్ని సమగ్రంగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మన ఊరు-మన బడి' కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థుల విద్యాభివృద్ధి లక్ష్యంగా కార్పొరేటు, ప్రైవేటు పాఠశాలకు దీటుగా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బుధవారం ప్రగతినగర్‌లో 'మన ఊరు-మన బడి' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వసతులు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే కేపి వివేకానంద్, ఎడ్యుకేషనల్ కమిషనర్ దేవసేనలు హాజరై ప్రారంభించారు. ప్రగతినగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రూ.68లక్షలతో అభివృద్ధి చేసిన కాంపౌండ్ వాల్స్, తాగు నీరు, విద్యుత్, వంట గది, టాయిలెట్స్, ఫర్నీచర్, గ్రీన్ చాక్ బోర్డ్స్ వంటి వసతులను స్థానిక మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం డిజిటల్ తరగతిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కార్పొరేట్ స్కూళ్లతో పోటీపడే విధంగా, కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లలో ఉండే వసతులు ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించే లక్ష్యంతో చేపట్టిన కార్యక్రమమే 'మన ఊరు - మన బడి' అని అన్నారు. పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంతోపాటు విద్యార్థులకు సకల వసతులు కల్పిస్తున్నామని అన్నారు. విద్యార్థులకు సులువుగా అర్థం అయ్యే విధంగా డిజిటల్ క్లాసులు కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యతోపాటు విద్యార్థులకు మంచి భోజనాన్ని అందిస్తున్న ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం అని సామాన్య, మధ్యతరగతి పేద విద్యార్థుల విద్యాభి వృద్ధి కోసం ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అసిస్టెంట్ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమేష్, డీఈఓ విజయ కుమారి, ఎంఈఓ ఆంజనేయులు, స్థానిక కమిషనర్ రామకృష్ణ రావు, స్థానిక డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్, స్థానిక కార్పొరేటర్ ఇంద్రజిత్ రెడ్డి, స్కూల్ ప్రిన్సిపల్ లక్ష్మీ నర్సింలు, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి





నవతెలంగాణ - కుత్బుల్లాపూర్
ఉమ్మడి రంగారెడ్డి జిల్లా, మేడ్చల్, హైదరాబాద్ జిల్లాలు కలుపుకొని ఈనెల 3వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని కార్మికులందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ అధ్యక్షులు కే.ఏసురత్నం పిలుపునిచ్చారు. బుధవారం కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిల్ కార్యాలయాల వద్ద వారు మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనం రూ.24000 ఇవ్వాలన్నారు. ముఖ్యమంత్రి చెప్పిన మాటలను గుర్తు చేస్తూ మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ కార్మికులను, పారిశుధ్య, ఎలక్ట్రానిక్, పార్క్ ఆఫీసులో కంప్యూటర్, డ్రైవర్స్, అసిస్టెంట్, బిల్ కలెక్టర్లను వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు కార్యదర్శి రాములు, శేఖర్ కుత్బుల్లాపూర్, గాజులరామారంల జంట సర్కిల్ అధ్యక్షులు కార్యదర్శి వి.హరినాథ్‌రావు, వి.శ్రీనివాసులు మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి వచ్చే కార్మికులకు 80 నుంచి 100 రూపాయలు చార్జీలవుతున్నాయని.. ఒక నెలకు మూడు నుంచి నాలుగు వేల రూపాయలు చార్జీలకే ఖర్చవుతున్నాయని అన్నారు. ఇలాంటి కార్మికులను గుర్తించి వారిని ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. కొంతమంది కార్మికులకు బయోమెట్రిక్ రావడంలేదని చెప్పారు. మూడు నుంచి నాలుగు నెలల వేతనాలు రాక చాలా ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే ఇలాంటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

అలరించిన 'మలయమారుతం'



నవతెలంగాణ-హైదరాబాద్
'మలయమారుతం' సినీ సంగీత విభావరి 16వ వార్షికోత్సవం సందర్భంగా గాయనీగాయకులు పాడిన పాటలు సంగీత ప్రియులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ర్నాకలోని మర్రి కృష్ణారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో కార్యక్రమం నిర్వహించినట్లు వ్యవస్థాపక కార్యదర్శి ఆర్.విశ్వనాథ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గాయనీగాయకులు పద్మజ కావ్య, అన్నపూర్ణ, విజయశ్రీ, అరుంధతి, భువనేశ్వరి, అపర్ణ, పద్మజ, చరణ్, హర్ష ప్రజ్ఞ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్‌తో జాగ్రత్త

- డ్రగ్స్‌తో ఎన్నో అనర్థాలు
- ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించిన ఏసీపీ



నవతెలంగాణ-సిటీబ్యూరో
అత్యాధునిక టెక్నాలజీ వాడకంతో ఎన్ని ప్రయోజనాలున్నాయో, అదే తరహాలో మోసాలున్నాయని బేగంపేట్‌లోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జీ.శంకర్‌రాజు తెలిపారు. బుధవారం సైదాబాద్‌లోని 'మాతృశ్రీ ఇంజనీరింగ్ ఆఫ్ కాలేజీ'లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏసీపీ మాట్లాడారు. రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీని ఉపయోగించి నేరస్తులు మోసాలకు పాల్పడుతున్నారని అలాంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ముఖ్యంగా అమాయకులను ఎంచుకుని వారిని మాటలతో మభ్యపెడుతున్న సైబర్ నేరస్తులు అందిన కాడికి దండుకుంటున్నారని చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తులు పంపించిన లింక్‌లను క్లిక్ చేయవద్దని, అలాంటి వారితో ఆర్థిక లావాదేవీలపై మాట్లాడొద్దన్నారు. ఏ బ్యాంక్ అధికారి కూడా ఫోన్‌లో ఆర్థిక లావాదేవీల వివరాలను సేకరించరన్నారు. ముఖ్యంగా ఓటీపీలు, కేవైసీ, బ్యాంక్ వివరాలను షేర్ చేయొద్దన్నారు. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని కోరారు. తల్లిదండ్రులు మీపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా చదువులో రాణించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతో వచ్చే నష్టాలు, రోడ్డు ప్రమాదాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సైదాబాద్ ఎస్ఐ శివాజీ, గణేష్, ఏఎస్ఐ ఖదీర్, హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణరెడ్డి, దాదాపు 500 మంది విద్యార్థులతో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ డి.మనుమంతరావు, అధికారి పి.నవీన్ కిషోర్, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల మీదే దేశ భవిష్యత్ ఆధారపడి ఉంది

ఎమ్మెల్సీ డి.రాజేశ్వరరావు



నవతెలంగాణ-కేపీహెచ్‌బి
విద్యార్థుల మీదే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని తెలంగాణ రాష్ట్ర ఎమ్మెల్సీ డి.రాజేశ్వరరావు అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో డిప్లొమా స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ నూతన క్యాలెండర్‌ను తెలంగాణ రాష్ట్ర ఎమ్మెల్సీ డి.రాజేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం సమాజం కోసం మంచి చేస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. డిప్లొమా స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీని అభినందించారు. ఈ కార్యక్రమంలో జేఎన్టీయూహెచ్ విద్యార్థి సంఘాల నేత, డిప్లొమా స్టూడెంట్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎరవెల్లి జగన్, బీఆర్ఎస్ రాంనగర్ డివిజన్ అధ్యక్షులు రావులపాటి మోజెస్, హెబ్రోన్ పాస్టర్ బ్రదర్ జీవరత్నం, ప్రభుదాస్, సామ్యూల్ పట్టా, అంద్రూ, జేఎన్టీయూహెచ్ డిఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ నాయకులు ప్రేమ్ నగిశెట్టి, వివేక్ పటేల్ శివ శివకుమార్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సంఘం నాయకులను సత్కరించిన ఎమ్మెల్యే



- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి
బాలానగర్ డివిజన్ పరిధిలోని రాజీవ్ గాంధీనగర్ సంక్షేమ సంఘం ఎన్నికల్లో రెండోసారి అధ్యక్షుడుగా గెలుపొందిన అబ్దుల అజీజ్‌ని, మరియు రెండోసారి ప్రధాన కార్యదర్శిగా గెలుపొందిన ఎస్‌కే.నరేష్‌ను కూకట్‌పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, కూకట్‌పల్లి క్యాంప్ కార్యాలయంలో శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, రాజీవ్ గాంధీ నగర్ బస్తీలో 380 ఓట్లు పోలింగ్ కాగా, అందులో అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్‌కి 216 ఓట్లు, 99 ఓట్ల మెజారిటీతో గెలుపొందడం, ప్రధాన కార్యదర్శి నరేష్‌కి 234 ఓట్లు, 104 ఓట్ల మెజారిటీతో విజయం సాధించడం గొప్ప విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఇందిరానగర్ అధ్యక్షుడు గోవు వెంకటరెడ్డి, ఏరియా కమిటీ అధ్యక్షుడు నగేశ్, సుల్తాన్, బస్తీ అధ్యక్షుడు ఫాయక్ అలి, లాలూ, సర్దార్, గౌస్, మోయిన్, శంశు మరియు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ సభ ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎమ్మెల్యే,ఎమ్మెల్సీలు



నవతెలంగాణ-దుండిగల్
రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఈనెల 5న తేదీన నిర్వహించనున్న నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ సభ ఏర్పాట్లను ఆయన దగ్గర ఉండి పర్యవేక్షించారు. బుధవారం మంచిర్యాల జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, టీఎస్ఐబిసీ చైర్మెన్ గ్యాదరి బాలమల్లు, సివిల్ సప్లై కార్పొరేషన్ మాజీ చైర్మెన్ మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర నాయకులు గుడాల భాస్కర్, నాందేడ్ స్థానిక బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఈరోజు పర్యవేక్షించారు.





అల్పసంఖ్యాక వర్గాలు..
ఆస్పత్రుల ఊసే లేదు..

కేంద్రఆర్థికమంత్రి నిర్మల ప్రసంగంలో కీలకంగా...

అంశాల వారీగా..	ప్రస్తావించింది..
పన్నులు...	59
ఇండియా...	31
నేషన్...	30
నేషనల్...	24
డ్యూటీ...	20
రైతుల గురించి...	14
యువతరం...	11
ఖర్చులు...	11
అమృత్ కాల్...	9
ఆరోగ్యం..	8
విద్య ...	8
ఉద్యోగాలు...	8
ప్రధాని ...	7
మహిళలు...	6
కాలేజీలు...	4
ఉపాధి ..	3
ఓబీసీ..	3
సంక్షేమం..	2
పేదలు ...	02
మధ్యతరగతి...	2
ఎగుమతులు..	3
రహదారులు.	2
బదులు..	2
రక్షణ శాఖ..	0
ఆస్పత్రులు..	0
అవినీతి...	0
అల్పసంఖ్యాక వర్గాలు..	0

కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్ లో బడ్జెట్ ప్రవేశపెట్టాక..గంట 27 నిమిషాల సేపు ప్రసంగించారు. అయితే మోడీ సర్కార్ వచ్చాక..కీలకమైన రంగాలను పక్కన బెడుతున్నారనటానికి ఉదాహరణగా చెప్పవచ్చు. పేదల గురించి తక్కువగా ప్రస్తావించారు. అవినీతి, ఆస్పత్రులు, మైనార్టీల గురించి ఊసే ఎత్తకపోవటం గమనార్హం.

ఉపాధి హామీకి తూట్లు

ఏడాదికి ఏడాది కేటాయింపుల్లో కోత

- బడ్జెట్‌లో రూ.29,400 కోట్లు తగ్గుదల
- వ్యవసాయ, అనుబంధ రంగాలకు పదేండ్ల కోత

న్యూఢిల్లీ : కేంద్రంలోని మోడీ సర్కార్ ఉపాధి హామీకి తూట్లు పొడుస్తున్నది. ఉపాధి హామీని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు స్పష్టం అవుతున్నాయి. అందులో భాగంగానే బుధవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశ ఓపెట్టిన బడ్జెట్‌లో ఉపాధి హామీకి నిధుల కేటాయింపులో భారీగా కోత విధించారు. 2021-22 బడ్జెట్‌లో ఉపాధి హామీకి రూ.98,467.85 కోట్లు కేటాయించారు. అదే 2022-23లో రూ. 89,400 కోట్లు కేటాయించారు. ఏడాదిలో 9,067.85 కోట్లు తగ్గించారు. ఈ ఏడాది (2023-24) బడ్జెట్‌లో రూ.60,000 కోట్లు కేటాయించారు. ఏడాదిలో రూ.29,400 కోట్లు కేటాయింపు తగ్గింది.

పేదల వంట గ్యాస్ కనెక్షన్లకు కోత

పేదలకు వంట గ్యాస్ (ఎల్పీజీ) కనెక్షన్లకు బడ్జెట్‌లో భారీగా కోత విధించారు. 2022-23 లో రూ.8,010 కోట్లు కేటాయించారు. ప్రస్తుత బడ్జెట్‌లో కేవలం రూ.1 లక్ష కేటాయించారు. అలాగే వినియోగదారుల బ్యాంక్ ఖాతాల్లో సబ్సిడీ సొమ్ము జమ చేసే ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) కేటాయింపుల్లో భారీగా కోత విధించారు. 2022-23లో రూ.4,000 కోట్లు కేటాయిస్తే, ప్రస్తుత 2023-24లో కెరవలం రూ.180 కోట్లు మాత్రమే కేటాయించారు.

వ్యవసాయ, అనుబంధ రంగాలకు పదేండ్లలో భారీ కోత

2022-23లో వ్యవసాయ, అనుబంధ రంగాల కేటాయింపు మొత్తం బడ్జెట్లో 3.84 శాతం ఉండగా, ప్రస్తుత బడ్జెట్ (2023-24)లో అది 3.20 శాతానికి పడిపోయింది. గత పదేండ్లలో ఇదే అతి పెద్ద కోత. గతేడాది కేటాయింపు 1,51,521 కోట్లు ఉండగా, 2023-24 లో అది 1,44,214 కోట్లకు పడిపోయింది. దాదాపు రూ. 7,307 కోట్ల కేటాయింపు తగ్గింది. పంటల బీమా పథకం (పీఎంఎఫ్బీవై) కేటాయింపు 12 శాతం తగ్గింది. గతేడాది రూ.15,500 కోట్లు కేటాయిస్తే, ఇప్పుడు రూ.13,625 కోట్లు కేటాయించారు. పీఎం కిసాన్ పథకానికి కేటాయింపు 13 శాతం




తగ్గింది. గత బడ్జెట్‌లో రూ.68 వేల కోట్లు కేటాయిస్తే, ఇప్పుడు రూ.60 వేల కోట్లు కేటాయించారు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్కేవీవై) నిధులు ఏకంగా 31 శాతం తగ్గించారు. గత బడ్జెట్‌లో రూ.10,433 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.7,150 కోట్లు కేటాయించారు. ఈ పథకం క్రింద రాష్ట్రాలకు తమ ప్రణాళిక ప్రకారం ఖర్చు చేసేందుకు కేంద్రం నిధులు ఇస్తుంది. అంటే ఇప్పుడు రాష్ట్రాలకు వికేంద్రీకృతమైన కార్యక్రమాలకు కేంద్రం పెద్ద కోత విధించింది. పీఎం-ఆశా పథకానికి కేటాయింపు రూ. 1 కోటి నుంచి తగ్గిస్తూ ఈసారి రూ.లక్ష మాత్రమే కేటాయించింది. పిఎస్-ఎస్-ఎంఐఎస్ పథకానికి గతేడాది రూ.1,500 కోట్లు కేటాయించగా, ఈసారి దానిని రూ.1 కోటికి తగ్గించింది.

ఎరువుల సబ్సిడీ తగ్గుదల

గతేడాదిలో ఎరువుల సబ్సిడీకి రూ.2,25,000 కోట్ల కేటాయించగా, ఈ బడ్జెట్‌లో రూ.1,75,000 కోట్లకు తగ్గించారు. యూరియాకు కేటాయింపులు కూడా రూ.1,18,457.24 కోట్ల నుంచి రూ.1,04,063.18 కోట్లకు తగ్గించారు. మొత్తం బడ్జెట్‌లో గ్రామీణాభివృద్ధికి కేటాయింపులు కూడా తగ్గింది. 2022-23లో 5.81 శాతం కేటాయింపులు ఉండగా, ప్రస్తుత (2023-24) 5.29 శాతానికి తగ్గాయి.

ఎస్సీ, ఎస్టీ సంక్షేమ కోసం కేంద్రం ప్రాయోజిత పథకాల కేటాయింపులు తగ్గాయి. గత బడ్జెట్‌లో రూ.1,819.52 కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.976.86 కోట్లకు తగ్గించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి కార్యక్రమాలకు ఈసారి నిధులు కేటాయించలేదు. మహిళ, శిశు సంక్షేమానికి సంబంధించిన పోషకాహారం, భద్రత, సంక్షేమానికి కేటాయింపులు భారీగా తగ్గించారు. 2022-23లో రూ.3,512.88 కోట్లు కేటాయించగా, ఈ బడ్జెట్‌లో రూ.1,514.32 కోట్లకు తగ్గించారు. యువజన, క్రీడల రంగంలో కూడా కేంద్ర ప్రాయోజిత పథకాలకు కేటాయింపులో కోత విధించారు. స్పేస్ రంగంలో న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్‌కు కేటాయింపులు భారీగా తగ్గించారు.

బడ్జెట్ రాజకీయ జుమ్లా



- దేశ ప్రస్తుత ఆర్థిక పరిస్థితిపై ఒక్క మాటా లేదు
- కార్మికులపై దారుణ దాడి
- బడ్జెట్‌ను తీవ్రంగా వ్యతిరేకించాలి : నిరసనలు చేయాలని అనుబంధ సంఘాలు, కమిటీలు, ప్రజలకు సీఐటీయూ పిలుపు

న్యూఢిల్లీ : కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ రాజకీయ జుమ్లా తప్ప మరొకటి కాదు అని సీఐటీయూ అభివర్ణించింది. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై సీఐటీయూ జనరల్ సెక్రెటరీ తపన్ సేన్ ఒక ప్రకటనను విడుదల చేశారు. ఈ ప్రకటన ప్రకారం.. దేశం ఎదుర్కొంటున్న భయంకర ఆర్థిక పరిస్థితిపై అది (బడ్జెట్) ఒక్క మాట కూడా మాట్లాడలేదు. 2022-23లో జీడీపీ 6.5 శాతానికి తగ్గుతుందని ఆర్థిక సర్వే స్వయంగా అంచనా వేసింది. స్వతంత్ర భారత చరిత్రలో వరుసగా నాలుగు సంవత్సరాలుగా అధోముఖమైన వృద్ధిని చూస్తున్నది. తయారీ రంగంలో వృద్ధి తగ్గుదల ఉన్నది. ఇది గత ఆర్థిక సంవత్సరంలో 9.9 శాతంగా ఉండగా.. అది 1.6 శాతానికి తగ్గింది. ఉద్యోగాలు కోల్పోవడం, కార్మికులు, సామాన్య ప్రజల పని, జీవన స్థితి గతులు అధ్వాన్నంగా ఉండటం, ఆందోళనకరమైన నిరుద్యోగం, ద్రవ్యోల్బణం ఫలితంగా కార్మికులు, సాధారణ ప్రజలు తీవ్ర బాధలను ఎదుర్కొంటున్నారు.

విస్తరిస్తున్న కరెంటు ఖాతా లోటు, రూపాయి మారకపు క్షీణత, అధిక రుణ జీడీపీ నిష్పత్తి మొదలైన ఆర్థిక సర్వేలో పేర్కొన్న నష్టాలను పరిష్కరించడంలో విఫలమైంది. పెట్రోలియం సబ్సిడీని గత సంవత్సరం సవరించిన అంచనాల నుంచి 75 శాతం తగ్గించటంతో ఇది ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ధరల పెరుగుదల తీవ్రంగా ఉంటుంది.

ఇటీవల విడుదలైన ఆక్స్‌ఫామ్ నివేదిక ప్రకారం భారత ప్రజలు పరోక్ష పన్నులపై ఆరు రెట్లు ఎక్కువగా చెల్లిస్తున్నారు. ఆర్థిక సంవత్సరం సవరించిన అంచనాలతో పోలిస్తే ఆహార సబ్సిడీని 29 శాతం, ఎన్ఎఫ్ఎస్ఏ కింద వికేంద్రీకృత సేకరణకు 17 శాతం, మధ్యాహ్న భోజనానికి 9.4 శాతం, పోషకాల ఆధారిత సబ్సిడీని 38 శాతం తగ్గించింది. కోవిడ్ విపత్తు నుంచి ప్రజారోగ్య మౌలిక సదుపాయాల విషయంలో మోడీ సర్కారు ఎలాంటి పాఠాలు నేర్చుకోలేదని బడ్జెట్ స్పష్టంగా చూపిస్తున్నది. ఆయుష్మాన్ భారత్‌కు కేటాయింపులు 34 శాతం తగ్గించారు. ఎన్‌హెచ్ఎంకి కేటాయింపులు గతేడాది కంటే 1 శాతం తగ్గాయి. విద్య సాధికారత పథకానికి కేటాయింపులు గత ఏడాది అంచనాల కంటే 33 శాతం తగ్గాయి. జాతీయ విద్యా మిషన్‌కు నిధులు రెండు శాతం పడిపోయాయి.

అంగన్వాడీ కార్యకర్తలు, ఆశాలు, మధ్యాహ్న భోజన కార్మికులు వారి వేతనాలు, ప్రయోజనాలలో ఎలాంటి మెరుగుదల లేకుండా పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యారు. ఉపాధి హామీ కోసం కేటాయింపులు గతేడాది సవరించిన అంచనాల నుంచి 33 శాతం తగ్గించబడ్డాయి. జాతీయ జీవనోపాధి మిషన్‌కూ కేటాయింపులను తగ్గించారు.

మోడీ సర్కారు అత్యధికంగా ప్రచారం చేసుకున్న ఆత్మనిర్భర్ భారత్ రోజ్‌గార్ యోజన కోసం కేటాయింపులు 65 శాతం తగ్గాయి. బడ్జెట్‌తో కార్మికులపై దారుణమైన దాడి జరిగింది. 2021 ఆర్థిక సంవత్సరంలో కార్మిక సంబంధిత కేంద్ర పథకాలు, ప్రాజెక్టులపై వాస్తవ వ్యయం రూ. 23,165 కోట్లుగా ఉన్నది. ఈ బడ్జెట్‌లో దానిని దాదాపు సగానికి తగ్గించి కేవలం రూ. 12,435 కోట్లకు చేర్చింది. పెన్షన్ ఫండ్ 4.2 శాతం తగ్గింది.

రైతుల ఆదాయం రెట్టింపు విషయంలో చర్చ నడుస్తున్నప్పటికీ.. పీఎం కిసాన్ కేటాయింపులు 11.76 శాతం తగ్గించబడ్డాయి. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కోసం 31 శాతం, కృషి సించాయ్ యోజన కోసం 17 శాతం, క్రిషియోన్నతి యోజన కోసం రెండు శాతం కేటాయింపులు తగ్గాయి. ఎరువుల సబ్సిడీలు గత సంవత్సరం సవరించిన అంచనాల నుంచి 22 శాతం పడిపోయాయి. పంటల బీమా పథకానికి గతేడాది అంచనాల కంటే 12శాతం తగ్గించింది. మైనారిటీల అభివృద్ధికి నిధుల కేటాయింపు 66 శాతం తగ్గింది. మాతృవందన యోజన కోసం కేటాయింపులు రూ. 40 కోట్లు తగ్గించబడ్డాయి. ఎస్సీలకు కేవలం 3.5 శాతం, ఎస్టీలకు 2.7 శాతం కేటాయింపులే జరిగాయి. పీఎస్‌యూలలో పెట్టుబడిని 11 శాతం తగ్గించారు. ఉపాధి కల్పన, ఎంఎస్ఎంఈలకు కూడా ఇందులో మద్దతు ఏమీ లేదు.

ఈ బడ్జెట్ బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, జాతీయ వ్యతిరేక, కార్పొరేటు అనుకూల స్వభావానికి రుజువు. ఎన్నికల ముందు బడ్జెట్ కావడంతో ప్రభుత్వం ప్రజలకు ఊరటనిస్తుందని అంతా భావించారు. అయితే, అమృత్‌కాల్ అని పిలవబడే మొదటి బడ్జెట్ ప్రజలకు విషపూరితంగా మారింది. కార్మిక వర్గం, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అన్ని కమిటీలు, అనుబంధ సంఘాలు, ప్రజలు కేంద్ర బడ్జెట్‌ను తీవ్రంగా వ్యతిరేకించాలి. కార్యాలయాలు, నివాస ప్రాంతాలలో నిరసనలు నిర్వహించాలి.

పాలమూరుకు జాతీయహోదా మరిచిపోవాల్సిందే !



- రాష్ట్ర ప్రాజెక్టులకు మొండిచేయి
- నిర్మల పద్దుపై నిపుణుల పెదవి విరుపు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

అనుకున్నంతా అయింది. మరోసారి అదే జరిగింది. కావాలనే చేసింది. తెలంగాణను ఎండబెట్టేందుకు మోడీ సర్కార్ బడ్జెట్‌ను ఆయుధంగా చేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం ఒకటి తలిస్తే, కేంద్రం మరోకటి చేసింది. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టులకు ఇంకోసారి మొండిచేయి చూపింది. రిక్తహస్తాలనే మిగిల్చింది. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులకు దాదాపు మూడేండ్లుగా సీఎం కేసీఆర్ సర్కారు అడుగుతున్న జాతీయ హోదా సంగతి పట్టించుకోలేదు. కాగా పక్కనున్న కర్నాటకలోని అప్పర్ భద్ర డ్యామకు జాతీయ హోదాను కట్టబెట్టింది. ఎన్నికలే లక్ష్యంగా ఈ పనికి పూనుకుంది. అంతేగాక వేగవంతమైన సాగునీటి ప్రయోజన పథకం(ఏఐబీపీ) నిధులకూ కోతపెట్టింది. యూపీఏ కాలం నుంచి కొనసాగుతున్న ఈ నిధులను 50 శాతం వరకు గత బడ్జెట్ నుంచే తగ్గిస్తూ వస్తున్నది. దీనిపై సర్కారుతోపాటు సాగునీటి రంగ నిపుణులు పెదవి విరుస్తున్నారు. ఏఐబీపీ ద్వారా భారీ, మధ్య తరహా సాగునీటి ప్రాజెక్టులకు నిధులు సమకూర్చే కార్యక్రమాన్ని దాదాపుగా నీరుగార్చింది. 1996-97లో యూఏపీ సర్కారు ఏఐబీపీ పథకానికి శ్రీకారం చుట్టింది. తెలంగాణకు సంబంధించి 11 ప్రాజెక్టులకు ఏఐబీపీ నిధులు వచ్చాయి. ఇందులో నాలుగు భారీ ప్రాజెక్టులు కాగా, ఏడు చిన్న తరహావి. దాదాపు రూ. 4,516.19 కోట్లు వచ్చాయి. 2005-06లో మాత్రం రూ.11,485.46 కోట్లను కేంద్రం మంజూరు చేసింది. ఆ తర్వాత రూ.21,683.14 కోట్లుగా సవరించింది. కాగా తాజా బడ్జెట్‌లో ఏఐబీపీ నిధులను రాష్ట్రానికి తగ్గిస్తూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించారు. అలాగే ప్రస్తుతం రాష్ట్రంలోని ఆయా ప్రాజెక్టులు పూర్తికావాలంటే దాదాపు రూ. 1.50 లక్షల కోట్లు కావాల్సిందే. ఈ నిధుల కోసం కేసీఆర్ ప్రభుత్వం పదే పదే విన్నవించినా, లేఖలు రాసినా అలక్ష్యం చేస్తున్నది.

తెలుగు రాష్ట్రాలకు అన్యాయం: సాగునీటిరంగ నిపుణులు సారంపల్లి మల్లారెడ్డి.

సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి బడ్జెట్లో తెలుగు రాష్ట్రాలకు అన్యాయం జరిగింది, రాష్ట్ర ప్రభుత్వం పదే పదే అడుగుతున్నా కేంద్రం పట్టించుకోవడం లేదు. అలాగే ఏఐబీపీ నిధులనూ తగ్గిస్తూ వస్తున్నది. నిర్మిలా సీతారామన్ బడ్జెట్ కార్పొరేట్లకే తప్ప, ప్రజలకు కాదన్నారు.

భగీరథకూ గుండుసున్న

ఇదిలావుండగా దేశంలో ఆదర్శ తాగునీటి పథకంగా పదే పదే ప్రశంసిస్తున్న మిషన్ భగీరథ పథకానికీ కేంద్రం నిధులు ఇవ్వలేదు. 2018లోనే నిటి అయోగ్ చేసిన సిఫారసులనూ తాజా బడ్జెట్‌లోనూ నిర్లక్ష్యం చేసింది. కేంద్రంలోని బీజేపీ సర్కారు రాజకీయ ప్రయోజనాలు చూడటం మినహా రాష్ట్రాల సంక్షేమానికి పట్టించుకోకపోవడం తెలిసిందే.

జాతీయ రహదారులనూ మరిచింది

రాష్ట్రానికి గత ఏనిమిదేండ్ల కాలంలో జాతీయ రహదారులకు కేంద్రం రూ.1.25 లక్షల కోట్లను కేటాయించింది. కానీ, ఖర్చు చేసింది మాత్రం రూ. 18 వేల కోట్లు మాత్రమే. అంటే ఇంకా రూ. లక్ష కోట్లకుపైగా నిధులు ఇవ్వాల్సి ఉంది. దీంతో పనులు ఆలస్యంగా సాగుతున్నాయి. ఈ బడ్జెట్‌లోనైనా నిధులు వస్తాయని భావించిన కేసీఆర్ సర్కారు ఆశలపై నీళ్ల చల్లింది.

మాటలే..చేతల్లేవ్: మంత్రి వేముల

రాష్ట్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తప్పుబట్టారు. మాటలు కోటలు దాటుతున్నాయి. చేతలు గడపదాటం లేదు. ప్రయివేటు రంగాన్ని ప్రోత్సహిస్తారా ? నిధులు కేటాయింపుల్లో తెలంగాణకు అన్యాయం జరిగింది. ఏండ్ల తరబడి వివక్ష చూపుతున్నారు.

ఎన్నికల బడ్జెట్ : చేవెళ్ల ఎంపీ రంజీత్‌రెడ్డి

సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించడంలో మోడీ ప్రభుత్వం వివక్ష చూపింది. ఎన్నికలు ఉన్నాయనే పేరుతో కర్నాటకలోని అప్పర్ భద్ర డ్యాంకు జాతీయ హోదా ప్రకటించింది. తెలంగాణ ప్రాజెక్టులకు ఏమాత్రం నిధులు ఇవ్వలేదు. రైతులకూ అన్యాయం చేసింది. పార్లమెంటులో పోరాడుతాం. మోడీ ప్రభుత్వ విధానాలను ఎండగడతాం.



హైదరాబాద్‌లో బడ్జెట్‌పై మాట్లాడుతున్న ఎఫ్‌టిసిసిఐ ప్రతినిధులు.

బడ్జెట్‌పై కార్పొరేట్ల స్పందన

హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2023-24 బడ్జెట్‌పై పారిశ్రామిక సంఘాలు, కార్పొరేట్ వర్గాలు సానుకూలంగా స్పందించాయి. ఫిక్కీ, సిఐఐ, ఎఫ్‌టిసిసిఐ బడ్జెట్‌ను స్వాగతించాయి. ఇది వృద్ధి ఆధారిత బడ్జెట్ అని పేర్కొన్నాయి.

ఎంఎస్ఎంఇలకు మద్దతు : సిఐఐ

"సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఇ)లకు మద్దతునిచ్చేలా బడ్జెట్ ఉంది. ఎంఎస్ఎంఇలకు రూ.2 కోట్ల వరకు క్రెడిట్ గ్యారంటీ స్కీమ్ పథకాన్ని కొనసాగించడం సహా ఇతర ప్రోత్సహకాలు హర్షణీయం. చిన్న పరిశ్రమలకు మద్దతును ఇవ్వడం ద్వారా తిరిగి వాటి వృద్ధి పుంజుకోనుంది. విత్త లోటును 6 శాతం దిగువనకు చేర్చాలనే లక్ష్యం స్వాగతించదగినది.' అని సిఐఐ ప్రెసిడెంట్ సంజీవ్ భన్సల్ పేర్కొన్నారు.

బ్యాలెన్స్‌డ్‌గా ఉంది : ఫిక్కీ

"కేంద్ర బడ్జెట్ బ్యాలెన్స్‌గా, అభివృద్ధికి దోహదంగా ఉంది. ప్రధానంగా వృద్ధికి ప్రాధాన్యతను ఇచ్చింది. ఖచ్చితంగా ఇదే మేము కోరుకున్నది. వ్యవసాయ రంగంపై ప్రధాన దృష్టి పెట్టారు. అదే విధంగా పట్టణీకరణ, డిజిటలైజేషన్‌కు ప్రాధాన్యతను ఇచ్చారు." అని ఫిక్కీ ప్రెసిడెంట్ సుభ్రకాంత్ పాండ తెలిపారు.

వృద్ధికి దోహదం : ఎఫ్‌టిసిసిఐ

"మంత్రి సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ సమ్మిళిత వృద్ధికి దోహదం చేసేలా ఉంది. అన్ని రంగాలకు ప్రాధాన్యతను ఇచ్చారు. మౌళిక వసతుల అభివృద్ధి, పెట్టుబడులు, విమానాశ్రయాలు, యవతకు అవకాశాలు, గిరిజనాభివృద్ధి, గృహాలు, మోడల్ స్కూళ్ల తదితర అన్ని రంగాలను పరిగణలోకి తీసుకున్నారు. పన్ను పరిమితిని రూ.7లక్షలకు పెంచడం మంచి పరిణామం." అని ఎఫ్‌టిసిసిఐ ప్రెసిడెంట్ అనీల్ అగర్వాల్ అన్నారు.

ఆరోగ్య సంరక్షణపై దృష్టి : అపోలో హాస్పిటల్స్

"కేంద్ర బడ్జెట్‌లో ఆరోగ్య సంరక్షణపై ఎక్కువ శ్రద్ధ చూపారు. హెల్త్‌కేర్ స్కిల్ డెవలప్‌మెంట్, 157 నూతన నర్సింగ్ కళాశాలలు, వైద్య పరికరాల తయారీ, ఆవిష్కరణల కోసం నూతన నైపుణ్య అభివృద్ధి కోర్సులను ప్రకటించడం హర్షణీయం. ఆరోగ్య సంరక్షణ విభాగంలో పరిశోధన, ఆవిష్కరణలకు అవకాశాలను సృష్టిస్తుంది. హెల్త్‌కేర్ అప్లికేషన్‌లను అభివద్ధి చేయడానికి 5జి ల్యాబ్‌లను ప్రోత్సహించడం ద్వారా సుదూర భౌగోళిక ప్రాంతాలలో నివసించే ప్రజలకు ఆరోగ్య సంరక్షణ కనెక్టివిటీ, సంరక్షణ మెరుగుపడుతాయి." అని అపోలో గ్రూపు హాస్పిటల్స్ ప్రెసిడెంట్ డాక్టర్ కె హరి ప్రసాద్ పేర్కొన్నారు.

బడ్జెట్‌లో అప్పులు తప్ప ఏం లేవు

రెడ్కో చైర్మెన్ వై సతీష్‌రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్ల మెంటులో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో అప్పుల కుప్పగా ఉన్నదేతప్ప, అభివృద్ధి ఊసే లేదని టీఎస్‌రెడ్కో చైర్మెన్ వై సతీష్‌రెడ్డి అన్నారు. బడ్జెట్‌లో 34 శాతం అప్పులే ఉన్నాయనీ, 20 శాతం సొమ్ము వడ్డీల కిందే పోతున్నదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్ల మెంట్ సాక్షిగా ఒప్పుకున్నారన్నారని చెప్పారు. దేశానికి ఇంతకంటే దౌర్భాగ్య పరిస్థితి ఇంకేం ఉంటుందన్నారు. 2014 వరకు భారత దేశ అప్పులు రూ. 55 లక్షల కోట్లు ఉంటే, ప్రస్తుతం అది రూ.169 లక్షల కోట్లకు చేరిందన్నారు. మోడీ హయాంలో రూ.115 లక్షల కోట్లు అప్పులు చేశారని వివరించారు. తెచ్చిన అప్పులతో చేసిన అభివృద్ధి ఏమీ లేదని విమర్శించారు.

వేతన జీవులకు మొండి చేయి : టీఎస్‌యూటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని స్వల్పంగా పెంచి మధ్యతరగతి వేతన జీవులకు భారీ ఊరట పేరుతో ప్రచారం చేసుకోవటం సమంజసం కాదని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) తెలిపింది. వేతన జీవులను కేంద్ర ప్రభుత్వం వంచించిందని విమర్శించింది. ఈ మేరకు టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాత, కొత్త పన్ను విధానాలను కొనసాగిస్తూ క్రమంగా పాత పన్ను విధానాన్ని ఎత్తేయటానికే కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్టు ఈ బడ్జెట్ ద్వారా స్పష్టమైందని తెలిపారు. పరోక్ష పన్నుల ద్వారా వేతనాల నుంచి ఆదాయాన్ని రాబట్టుకుంటున్న ప్రభుత్వం వాటిపై భారీగా పన్ను వేయటమే అర్థరహితమని విమర్శించారు. కార్పొరేట్లు, ధనికులకు అధిక పన్ను రాయితీ ఇచ్చిన ప్రభుత్వం చిన్న, మధ్యతరగతి ఉద్యోగులకు ఏ మాత్రం ప్రయోజనం కలిగించలేదని పేర్కొన్నారు. కొత్త పన్ను విధానంలో పన్ను రాయితీ రూ.ఐదు లక్షల నుంచి రూ.ఏడు లక్షలకు పెంచారని తెలిపారు. కానీ కొత్త విధానంలో ఎలాంటి మినహాయింపులుండబోవని పేర్కొన్నారు. అధికాదాయ వర్గాలకు మాత్రమే ఇది కొంత మేరకు ఉపయోగకరమని వివరించారు. తక్కువ వేతనాదాయ వర్గాలు వినియోగించుకుంటున్న పాత పన్ను విధానంలో స్టాండర్డ్ డిడక్షన్ రూ.2.50 లక్షల నుంచి రూ.మూడు లక్షలకు పెంచటం నామ మాత్రమేనని తెలిపారు. పొదుపు మొత్తాలపై రాయితీని రూ.1.50 లక్షలను అలాగే కొనసాగించారని పేర్కొన్నారు. 2014కు ముందు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బీజేపీ డిమాండ్ చేసిన స్టాండర్డ్ డిడక్షన్ రూ.ఐదు లక్షలు గానీ, పొదుపు మొత్తాలపై రూ.మూడు లక్షలకు పెంచాలన్న డిమాండ్‌ను అధికారంలోకి వచ్చిన ఈ తొమ్మిదేండ్ల కాలంలో అమలు చేయలేదని విమర్శించారు. శ్లాబు రేట్ల సవరణ కూడా స్వల్పంగానే ఉందని తెలిపారు. ఈ బడ్జెట్ ద్వారా ధరలు ఏమాత్రం తగ్గే అవకాశం లేదని పేర్కొన్నారు. గృహ నిర్మాణానికి ప్రోత్సాహం లేదని వివరించారు. కేంద్రం ప్రతపాదించిన ఈ బడ్జెట్ సగటు వేతన జీవులకు ఏమాత్రం సంతప్తిని కలిగించలేదని విమర్శించారు.



దగా చేసిన కేంద్రం : టీఎస్టీయూ

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మరోసారి వేతన జీవులను దగా చేసిందని టీఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు ఎండీ అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శి చందూరి రాజిరెడ్డి విమర్శించారు. ద్రవ్యోల్బణం పెరిగి నిజ ఆదాయం తగ్గి దేశ చరిత్రలో డాలర్‌తో రూపాయి మారక విలువ పాతాళానికి తగ్గిన ఈ తరుణంలో మధ్యతరగతి ఉద్యోగ వర్గాలకు ఊరటనిచ్చేలా ఆదాయ పన్ను స్టాండర్డ్ డిడక్షన్‌తోపాటు పొదుపు మొత్తాలను పెంచకపోవడం తీవ్ర నిరాశకు గురిచేసిందని విమర్శించారు.

పొదుపును దూరం చేసేలా కొత్త పన్ను శ్లాబులు : టీఆర్టీఎఫ్

ఈ బడ్జెట్లో వ్యక్తిగత పన్ను మినహాయింపు పరిమితిని రూ.ఏడు లక్షలకు పెంచడాన్ని స్వాగతిస్తున్నామని టీఆర్టీఎఫ్ అధ్యక్షులు కావలి అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కటకం రమేష్ తెలిపారు. ప్రస్తుత పన్ను విధానం ఉద్యోగుల పొదుపును దూరం చేసే విధంగా ఉందని తెలిపారు.

పన్ను మినహాయింపు పరిమితి పెంపు పట్ల హర్షం : తపస్

ఆదాయపన్ను మినహాయింపు పరిమితిని పెంచుతున్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) స్వాగతించింది. పన్ను మినహాయింపు పరిమితిని రూ.ఏడు లక్షలకు పెంచడం పట్ల ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు హన్మంతరావు, ప్రధాన కార్యదర్శి సురేష్ హర్షం వ్యక్తం చేశారు.

వేతన జీవిని కనికరించని మోడీ ప్రభుత్వం : టీఎస్‌పీటీఏ

ఈ బడ్జెట్‌లో వేతన జీవిని మోడీ ప్రభుత్వం కనికరించలేదని టీఎస్‌పీటీఏ అధ్యక్షులు సయ్యద్ షౌకత్‌అలీ విమర్శించారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలు కోసం విధించిన ఆదాయ పరిమితి రూ.ఎనిమిది లక్షల వరకు పెంచినా కొంత మేరకు మేలు జరిగేదని పేర్కొన్నారు. పొదుపు రిబేట్‌ను రూ.ఏడు లక్షలకు పెంచడం వల్ల ప్రయోజనం లేదని తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.